రామాయణం

# శ్రీరాముని చరిత్రము



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org | Mobile App: Free Gurukul | email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul | Help Line / WhatsApp: 904 202 0123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# శ్రీరాముని చరిత్రము

(శ్రీ పోతనార్య ప్రణీతము)

టీకా తాత్పర్యకర్తలు:
కొలకుల నారాయణరావు, బి.ఏ., బి.యల్.
యఫ్.ఆర్.ఈ.యస్. (లండను)

# అంకితము

1

శ్రీ నిలయైక సప్తగిరి
శేఖరసంస్థితిఁ గన్న నీకు నా
నా నవరత్నరాసుల ఘ
నంబుగ నిచ్చెడు శక్తి లేదు; మ
న్మానసవారిజోదిత స
మంచితభావమరందపూరితా
మ్లానమనోజ్ఞ పద్యకుసు
మంబుల నిచ్చెద, వేంకటేశ్వరా!

2

జంకు కళంకు వీడి నిను
స్వాంతమునం దలపోయఁ బద్దెముల్
వంకరపోవు మార్గములఁ
బట్టక యంబరచుంబిసప్తశై
లాంకురితప్రవాహరయ
మట్టుల పర్వెడుఁ ద్వత్కృపాప్తి చే,
నంకిత మిత్తు నీ కృతి స
మాదృతి నీ కిదె, వేంకటేశ్వరా!

# గురుస్మరణ

1

ప్రత్యక్షంబగు తిక్కనార్యుని, మహో
పాధ్యాయు, విద్వత్కవి
స్తుత్యర్హోభయసాహితీధనుని, వి
జ్ఞుఁ, మత్కవితోద్వదయ
ప్రత్యాశాలతికాసమాశ్రయుని, 'దు
ర్భా'వంశసంభూతు ని
ష్ప్రత్యూహార్థము గొల్తు మద్గురుని సు
బ్రహ్మణ్య విద్వన్మణిన్.

2

చిన్నారిపొన్నారి జిలిబిలి పద్దెముల్
పసితనానఁ గొసరి వ్రాయునపుడు,
శ్రీకాళిదాససత్కృతి 'ఋతుసంహార'
కావ్యంబు దెలిఁగింపఁ గడఁగినపుడు,
'మేఘంబు'లోని యమృతధార లొకకొన్ని
యాంధ్రుల కొసఁగ మిట్టాడినపుడు,
'సుమతిశతక' మట్లు 'కుమతిశతకమును'
సాగింప జతనంబు సలిపినపుడు,

'సుప్రభాతంబు' 'స్తోత్రాది' సుకృతు లెన్నొ
వ్రాయునపుడు, నా కెవఁడు శ్రీరామరక్ష
యయ్యె, ధీసాంద్రు 'దుర్భా'న్వయాబ్ధిచంద్రు
సత్కవీంద్రు, సుబ్రహ్మణ్యశర్మఁ గొలుతు.

# ఉపోద్ఘాతము

—————:o:—————

చరితం రఘునాథస్య శతకోటిప్రవిస్తరమ్,
ఏకైక మక్షరం ప్రోక్తం మహాపాతకనాశనమ్
రామాయ రామభద్రాయ రామచన్ద్రాయ వేధసే
రఘునాథాయ నాథాయ సీతాయాః పతయే నమః.

శ్రీ రామాయణము పవిత్రమైన కావ్యము. పుట్టువుచేత నేగాక గుణముచేతను అది యాదికావ్యము. ఇంతకంటె నే కావ్యము ఏ పురాణము ఏ యితిహాసము మఱి యే యితరగ్రంథములు నీతుల నుపదేశింపలేదు. శ్రీ రామాయణ మనఁగా లక్ష్మీరమణుఁడైన శ్రీమన్నారాయణుని మానవావతారమైన శ్రీరామచరిత్రమనియు, శ్రీ లక్ష్మీదేవి యవతారమగు సీతాదేవి చరిత్రమనియు నర్థము.

2. *ఈ మహాగ్రంథమున, బాలకాండమందు జగజ్జననహేతుత్వము, అయోధ్యాకాండమందు స్థితిహేతుత్వము, అరణ్యకాండమందు మోక్షప్రదాయిత్వము, కిష్కింధాకాండమందు గుణసంపత్తి, సుందరకాండములో సర్వహర్తృత్వము, యుద్ధకాండమందు వేదాంతవేద్యత్వము, ఉత్తరకాండములో స్రష్టృహేతుత్వము ప్రతిపాదింపఁబడియుండుటచే

---

*శ్రీ విష్ణోః ప్రథమే కాండే జగజ్జననహేతుతా
ద్వితీయే స్థితహేతుత్వం తృతీయే మోక్షదాయితా
చతుర్థే గుణసంపత్తిః పంచమే సర్వహర్తృతా
షష్ఠే వేదాంతవేద్యత్వం సప్తమే స్రష్టృహేతుతా
ఏవం విష్ణుః పరం తత్త్వం రామాత్మేతి సునిశ్చితః
పద్మే దివ్యేఽర్కసంకాశే నాభ్యా ముత్పాద మామపి
ప్రాజాపత్యం త్వయాకర్మ సర్వం మయి నివేశితమ్

ని రామాయణ మందు రామరూపముగా నవతరించిన విష్ణువే పరతత్త్వమని నిశ్చయింపఁబడినది.

3. ఇతరభాషలలోను ఆంధ్రమందును రచింపఁబడిన రామాయణ గ్రంథము లసంఖ్యాకములు. ఎందఱెందఱో మహాకవులు మహాపండితులు పద్యగద్యరూపముగ శ్రీరామునిచరిత్రమును వర్ణించి కృతకృత్యులైరి. ఇంకను వ్రాయుచునే యున్నారు; వ్రాయఁగలరు; వ్రాయనున్నారు. శ్రీ కంకంటి పాపరాజకవి

......................రాఘవే
శ్వరుచారిత్రము సెంద ఱెన్నిగతులన్ వర్ణించినన్ గ్రాలదే?

అని ఉత్తరరామాయణరచనకుఁ గారణము స్థూలముగాఁ జెప్పియే యున్నాఁడు. నాకుఁ జిన్నప్పటినుండి శ్రీ రామాయణమన్న మిక్కిలి యభిమానము. నా జీవితములో నెప్పటికైన సంగ్రహరామాయణము నేని రచించి ధన్యుఁడ నగుటకు సర్వప్రయత్నములు చేసితిని. కాని యా కోరిక నెఱవేఱలేదు. మద్గురువర్యులు కీ॥ శే॥ దుర్భా సుబ్రహ్మణ్యశర్మగారు జీవించి యుండినతఱి సుందరకాండమును జాలవఱకు నాంధ్రీకరించి వారి కొసంగితిని. వారు దానిని సరిచూచి యిచ్చుభాగ్యము నాకు దక్కలేదు.

4. ఇది యిట్లుండఁగా నొకపరి బమ్మెరపోతరాజకవి కృతమైన శ్రీ మదాంధ్రభాగవతములోని నవమస్కంధమును జూచుచుండఁగా శ్రీరాముని చరిత్రను గూర్చిన నూఱుపద్యముల ఘట్టమెందు నాకుఁ గానుపించెను. మధురద్రాక్షాపాకసమన్వితమైన పోతరాజు కవిత్వమునకు ముగ్ధుఁడనై ఆ పద్యములకుఁ డీకాతాత్పర్యములు రచించినచో నా చిరకాల వాంఛిత మీడేరు నేమో యని తలంచితిని. పోతన కథావిధానములో రామాయణగాథ సంగ్రహముగ నిర్వహింపఁబడినది. కాఁబట్టి తాత్పర్యము వ్రాయునప్పుడు పద్యములలోఁ జెప్పఁబడిన విషయములఁ గొలంది పెంపొందింపఁజేసి మాతృకకు నెడమీయక రామాయణకథను సులభశైలిలో స్వతంత్రముగా నడిపించిన కరము హృద్యముగ నుండునని యెంచి యీ కార్యమునకు దొరఁకొంటిని. నా యాశయ మెంతవఱకు సఫలీకృత మయ్యెనో సహృదయులే నిర్ణయింతురుగాత!

5. భాగవతములోని రామాయణమునకును వాల్మీకి రామాయణమునకుఁ గొన్ని వ్యత్యయములు గాన్పించుచున్నవి. *పట్టాభిషేకానంతరము శ్రీరామచంద్రుఁడు తానే యజ్ఞేశ్వరుఁడయ్యు బహుయజ్ఞముల నారాధించి యజ్ఞదక్షిణగా హోతకుఁ బ్రాగ్దిశను, బ్రహ్మకు దక్షిణదిక్కు, నధ్వర్యునకుఁ బశ్చిమదిక్కు, నుద్గాతకు నుత్తరదిక్కు, నాచార్యునకు మధ్యభూమినెల్ల నొసంగుటచేఁ దుదకుఁ దాను ధరించిన వస్త్రాలంకారములు జానకికి సౌమంగల్యము మాత్రమే శేషించెననియు, నంత ఋత్విజులు ప్రీతులై తమకిచ్చిన భూమియెల్ల రామునకుఁ గ్రమ్మఱ నర్పించి తమహృదయములలోని యంతస్తిమిరంబులు హరించుటచే ధన్యుల మని శ్లాఘించినట్లును భాగవతమునఁ గలదు. ఈ కథాంశము వాల్మీకిరామాయణమునఁ గానరాదు.

6. వాల్మీకి రామాయణములో శ్రీరాముఁడు తాను బ్రచ్ఛన్నవేషమున నగరమున సంచరించునెడ సీతాపవాదము నాలకించినట్లు కానరాదు. రాముఁ డొకనాఁడు భద్రునిఁబిలిచి "భద్రా! పట్టణమందును బల్లెలయందును నా విషయమై యేమి చెప్పుకొనుచున్నారు? సీతను గుఱించి యేమి యను

---

*భగవానాత్మ నాత్మానం రామ ఉత్తమ కల్పకైః
సర్వదేవమయం దేవమీజ ఆచార్యవాన్ మఖైః
హోత్రే దదౌ దిశంప్రాచీం బ్రహ్మణే దక్షిణాం ప్రభుః
అధ్వర్యవే ప్రతీచీం వా ఉదీచీం సామగాయినే
ఆచార్యాయ దదౌ శేషాం యావతీ భూస్తదంతరా
మన్యమాన ఇదం కృత్స్నం బ్రాహ్మణోఽర్హతి నిస్పృహః
ఇత్యయం సదలంకారవాసోభ్యా మవశేషతః
తథా రాజ్ఞ్యపి వైదేహీ సౌమంగళ్యావశేషితా
తత్ర బ్రాహ్మణ దేవస్య వాత్సల్యం వీక్ష్య సజ్జనాః
ప్రీతాః క్లిన్నధి యస్తస్మై ప్రత్యర్ప్యేదంబభాషిరే
అప్రత్తం నస్త్వయా కిన్నుభగవన్ భువనేశ్వర
యన్నోఽన్తర్హృదయం విశ్యతమో హంసి స్వరోచిషా.

కొనుచున్నారు? భరతుని లక్ష్మణుని శత్రుఘ్నుని కైకేయిని మాయమ్మను నుద్దేశించి యేమేమి చెప్పుకొందురు?" అని యడుగఁగా భద్రుఁడు చేతులు జోడించికొని యిట్లనియెను. "దేవా! పురవాసులు చెప్పుకొనుకథ లనేకము లున్నవి. అవి యన్నియు మంచివే. రావణునిఁ జంపి సంపాదించిన జయమునుగూర్చి మనపట్టణమం దనేకవిధములుగాఁ బౌరులు చెప్పుకొనుచున్నారు." అని భద్రుఁ డనఁగా రాముఁ డిట్లనియె. "భద్రా ఉన్నది యున్నట్లు సర్వమును జెప్పుము. మంచిగాని చెడుగాని దాఁపక చెప్పుము. అని విని యిటుపైని మంచిపనులుచేయుచుఁ జెడుపనులు మానుకొందును. నీ మనసులో నింతయు భయపడక విన్నదివిన్నట్లు చెప్పుము. అందఱును బుణ్యాత్ములే యుండరు. జనపదములయందుఁ బాపాత్ములు నుందురు" అని రాముఁడు నొక్కి యడుగఁగా వాఁడు సావధానముగాఁ జేతులు జోడించికొని యిట్లనియె. "రాజేంద్రా! అటులేని వినుము చత్వరముల యందును ఉపవనములయందును బౌరులు చెప్పుకొనుచుండునవి యేమనఁగా, ...శ్రీరాముఁడు రావణుని యుద్ధములోఁ జంపి తన పౌరుషమును వెనుక నుంచుకొని సీతనుదోడ్కొని మరల నింటికి వచ్చినాఁడు, రాముని హృదయములో సీతాసంభోగమువలనఁ గలిగిన సుఖమెట్టిదో తెలియదుగాని పూర్వము రావణుఁడు బలాత్కారముగాఁ దన తొడపైఁ గూర్చుండఁబెట్టుకొని లంకకుఁ దీసికొనిపోయి యశోకవనములోనుంచిన సీతను మరలఁ దెచ్చుకొన్నాఁడు. రామునకు గుణదోషవిచారము లేకపోయినది. ఇటుపైని మా భార్యలవిషయమున నేమిజరిగినను మేముగూడ సహింప తీరదుగదా! ఏమన? రా జెట్లు నడచినఁ బ్రజలు నట్లేకదా నడువ వలసి యుండును ? అని యీ రీతిఁగాఁ బురవాసు లనేకవిధములుగాఁ జెప్పుకొనుచున్నారు." అని భద్రుండు చెప్పఁగా విని రాముఁడు మిక్కిలి పీడనొందినట్లు విచారించుచు మిత్రులవంకఁజూచి యిదేటిసంగతియో నాకుఁ జెప్పుఁడన వారందఱు శిరస్సుచే భూమికి వందనములుచేసి దీనముగా "అవును; నిస్సంశయమే" అనిరి. అందఱును నేకీభవించి చెప్పిన మాటలను విని శ్రీరాముఁడు చింతాక్రాంతుఁ డయ్యెను.

7. చారులవలన ననేకమిత్రులచే సీతాపవాదముంగూర్చి యాలకించి సీతను బరిత్యజించినట్లు వాల్మీకి కథను నడపించెను. సీతను గుఱించిన ప్రజాపవాదమును రాముఁడు గూఢచారులవలన విని, ఆ విషయమును మంత్రి

పురోహిత బాంధవసమన్వితమైన కొలువుకూటమున రచ్చకెక్కించి, అందలి సత్యాసత్యములనుగుఱించి సభాస్తారులను బ్రశ్నించినాఁ డనుటకంటెను, ఒంటరిపాటునఁ దానే యా సంగతిని విని అభిమానదగ్ధుఁడై సీతను బరిత్యజించినాఁడనుట యనౌచిత్యతరముగా నున్నదేమో కదా! ఇట్లనుట వాల్మీకి కథాకల్పన అనౌచిత్యమని యధికప్రసంగము సేయుట కాదు; పోతనామాత్యుని కల్పనాకళావైదగ్ధ్యమును శ్లాఘించుటమాత్రమే!

8. జైమిని భారతమునందు గూఢచారులచే శ్రీరాముఁడు ధరిత్రీతనయ మీఁది యపవాదము విన్నట్లు గలదు. ఇందు "రజకి" యొకర్తుక ప్రవేశపెట్టఁబడినది చూడుఁడు—

"రజకి యొకర్తు నాథుఁడు తి
  రస్కృతిఁ జేసినఁ బుట్టినింటికేఁ
గ జనకుఁ డాత్మజం గని జ
  గజ్జనగాత్రమలీనుసాంశుక
వ్రజములు శుద్ధిసేయు నిజ
  వంశము మైలపడంగఁ జేసితిం
టి జగడమింటిలోనె హావ
  ణింపకనీవిటు లొంటివచ్చుటన్.

అని తనకూఁతుఁ దోడ్కొనుచు
  నల్లునియింటికి నేఁగ మామఁ జూ
చనలములోన నెయ్యొలికి
  నట్టుల మండుచు నిల్లు వెళ్ళి నా
ల్దినములు నేఁడు నాకడనుఁ
  దెచ్చితివే యల రాఘవుండ నే
దనుజగృహీత సీతఁ దన
  దారను గ్రమ్మఱఁదెచ్చి యేలఁగన్?

నర్మసచివుఁడగు భద్రునిచే నేకాంతమున జనకరాజాత్మజపైన నింద విన్నట్లు కంకంటి పాపరాజ ప్రణీతమైన ఉత్తరరామాయణమునఁ దిక్కనచే

రచింపఁబడిన నిర్వచనోత్తర రామాయణమున నుద్దిష్టములు. ఈ కథనము వాల్మీకిరామాయణమునకు సన్నిహితమే.

9. భవభూతి మహాకవి ఉత్తరరామచరిత నాటకములో నొక యద్భుత సంవిధానము గావించినాఁడు. చిత్రదర్శనమందిరమున శ్రీరాముఁడాయా విశేషములఁ బటములం జూపించుచుండఁగా సీతాదేవి యలసి పతి యురమందు క్షణములో నిద్రనొందును. అత్తటి నంతఃపురచారి దుర్ముఖుఁడు ప్రవేశించి కన్నీళ్ళతో సీతాపవాదమును శ్రీరాముని చెవిలోఁ జెప్పును.

శ్రీరామచంద్రుఁడా ఘోరమగు వచనదంభోళికి మూర్ఛిల్లి యూఅడిల్లి

"అకట! సీతకు నొరునింటి యంటునింద
యపుడెది శమించె నద్భుతోపాయములను
వెండి యది యిప్డు హతవిధి విలసనమున
విస్తరిల్లెను దాలర్క విషమువోలె..."

అని విలపించును.

10. భాగవతములో మూలమందు

"కదాచిల్లోకజిజ్ఞాసుర్గూఢో
రాత్ర్యామలక్షితః
చరన్ వచోఽశృణోద్రామో భార్యా
ముగ్ధస్య కస్యచిత్
నాహం బిభర్మిత్వాం దుష్టామ
సతీం పరవేశ్మగామ్
స్త్రైణోహి భిభృయాత్సీతాం
రామో నాహం భజేపునః."

అని వ్యాసమహర్షి చెప్పియున్నాఁడు. మాతృకయందు శ్రీరాముఁడు చారులను బంపించినట్లు లేదు.

సీతాదేవి నడవులకుఁ బంపఁ గృతనిశ్చయుఁడైన యనంతరము రాముఁడు తమ్ములను రావించి జనాపవాదమును విమర్శించి లక్ష్మణునితో... "రేపు ప్రభాతమున సుమంత్రుఁడు సారథిగాఁగల రథముపై సీతను గూర్చుండఁబెట్టి యడవిలో విడిచిరమ్ము... సీత పూర్వము గంగాతీరమందలి మున్యాశ్రమములను జూడఁగోరి యున్నది. దానికోరికయుఁ బూర్తి పఱిచినట్లగు నని కన్నీరుమున్నీరుగాఁ జెప్పినట్లును అందుపై లక్ష్మణుఁడు రాజగృహమునకుఁ బోయి సీతాదేవితో "అమ్మా! నీవు ప్రభువుతో నాశ్రమములు చూడఁగోరి చెప్పితివఁట. రాజుగారి యాజ్ఞయయినది. కావున నిపుడే బయలుదేఱి గంగానదీతీరమునందలి మునీశ్వరుల పుణ్యాశ్రమములను జూచివత్తువుగాక" అని చెప్పి సీతను రథమెక్కించి యతివేగముగాఁ దరలినట్లును వాల్మీకిరామాయణమునఁ గలదు. సీతాదేవి యడవులకుఁ బోవుటకుముందు శ్రీరామచంద్రునిఁ జూడకయే యరదము నారోహించుట యసంభవము. ఆమె భర్తకుఁ గృతజ్ఞతయేనిం జెప్పక వనములకేఁగుట పాతివ్రత్య ధర్మముగాదేమో! లక్ష్మణుఁడు ప్రయాణమున కెంత "త్వర పెట్టినను" సీతాదేవి హుటాహుటి నగరమువీడి తరలిపోవుట న్యాయముగాఁ గాన్పించుటలేదు. అదియునుంగాక లక్ష్మణుఁడు సీత యొంటరిగానున్నప్పుడు రాజగృహముఁ బ్రవేశించుట యించుక యనుచితముగాఁ దోఁచుచున్నదేమో!

పిల్లలమఱ్ఱి పినవీరభద్రుఁడు సీతాదేవి రాముని మణిపాదుకలు నరదంబుపై నమర్చినట్లు, తదనంతరము

......అత్తలం గదిసి సాష్టాంగంబుగా మ్రొక్కి యి
క్కౌసల్యం గని నాదుకోర్కి నెఱపం గాకుత్స్థుఁ డంపెన్ సుమి
త్రానూనుం బయనంబుచేసి దివిషద్గంగావసన్మౌనికాం
తాసందోహముఁ జూడఁబోయెదఁ బ్రమోదంబార మీ రంపినన్.

అన విని కోసలాధిప వరాత్మజ జానకిఁ జూచి యెట్టుగాఁ
జనియెద వమ్మ కంటకవిశంకటఘోరకాననం
బునకు భవన్ముఖాంబురుహముల్ రదనచ్ఛదముల్ మలీమసం
బును గడునీరసంబునయి పొల్పఱెఁ బోవుటగాదు నావుఁడున్.

వనవాసియోఁ గంటకము
ర్దనుఁడును నగు దాశరథి నిరంతరమును నె
మ్మనమున నుండఁగ రానే
ర్చునె? యశుభములెందు మీ కరుణగల నాకున్.

అనవుఁ డీఁక మీ మనము సందియంబు దక్క
యని మహీజాత యత్తల కర్థి మ్రొక్కి
పెనఁచి పయ్యెద నీవితో బిగియఁజెక్కి
హరితఘోటకయుతమైన యరద మెక్కె...

అని సందర్భశుద్ధి లోకానుగుణముగాఁ గడిందినైపుణితో సూచించినాఁడు. రథములో భద్రపఱచిన 'పతిమణిపాదుకలు' భర్త తనతో నుండినట్లుగానే సీతాదేవి భావించినది; అదియుంగాక 'వనవాసియగు దాశరథి నిరంతరము నెమ్మనమున' నుండుటచే జనకతనయ ప్రత్యేకముగాఁ బతికడ కేఁగి యనుజ్ఞ తీసికొనవలసిన యగత్యములేదు. అత్తల యాశీర్వాదము పొందినఁ జాలుగదా?

భాగవతమున

"ఇతిలోకాద్బహు ముఖాద్దురా రాధ్యాదసంవిదః
పత్యా భీతేన సా వ్యక్తా ప్రప్తా ప్రాచేతసాశ్రమం

అని మాత్రమున్నది. శ్రీరాముఁడు సీత నేవిధముగా నడవులకుఁ బంపినది సూచింపఁబడు లేదు. కాని శ్రీ శతఘంటము వేంకటరంగశాస్త్రి గారి ఘట్టమును

"ఆ ద్దేవి పాతివ్రత్యము దనకు విదితంబైయున్నను లోకాపవాదమునకు వెఱచి జానకింబిలిచి...పరగృహమునఁ గళంక మొందిన నిన్ను భరింపఁగోరను. స్త్రీవశుఁ డట్టిపనులకుఁ దెగించుగాని రాముఁ డియ్యకొను నే యని పలికి గర్భవతి సతియునైన విదేహరాజతనయ నడవులకుఁ బంపెను..."

అని యాంధ్రీకరించిరి. దీనికి మాతృక నాకుఁ గానరాదు. శ్రీరాముఁడు స్వయముగా జానకితో లోకాపవాదవిషయముం జెప్పి యామెను

కాఱడవులకుం బంపినట్లున్నది. ఇందు నిజమగు కారణము చెప్పకయే సీతాదేవిని మోసగించి శ్రీరాముఁడు కానలకుఁ బంపలేదు; ఆత్మనిశ్చయమును సీతకుఁ జెప్పుటకు వెనుకంజవేయలేదు.

పోతనమహాకవి

'సీత నిద్రవోవఁ జెప్పక వాల్మీకి
పర్ణశాలఁ బెట్టఁ బనిచె రాత్రి......'

అని చిత్రించినాఁడు. ఇది యమూలకము. "సీత నిద్రవోవఁ జెప్పక" అను మాటలకు నాధారము భవభూతి విరచితోత్తరరామచరితనాటకము కాఁబోలును బరిశీలింపుఁడు:—

"సీత:—[నిద్రను నటించుచు] ఆర్యపుత్రుఁడా! ఉన్నది యిది, ఉన్నది యిది.

రాము:— ఏమి! ప్రియవచన నాయురమందు క్షణములో నిద్ర చెందినది!

[రాముఁడు నిష్క్రమించును.]

సీత:— హా! సౌమ్యుఁడా! ఆర్యపుత్రుఁడా, ఎక్కడ నున్నావు? (తటాలున లేచి) అయ్యయ్యో! దుస్స్వప్నముచేత వంచితనై నేను ఆర్యపుత్రుఁడు లేనిదానినిగా నన్నుఁ దలఁచుకొంటిని (చూచి) అయ్యయో! అయ్యయో! నన్ను నిద్రితను ఒంటిగా విడిచి ఆర్యపుత్రుఁడు పోయినాఁడు! కానీ, ఆయనం గన్నప్పుడు నేను నావశమనయేని ఆయనపై కోపించెను. ఎవరక్కడ పరిజనుఁడు?

దుర్ముఖుఁడు ప్రవేశించి:—దేవి! లక్ష్మణకుమారుఁడు విన్నపంచేస్తున్నాఁడు. తేరు సిద్ధముగా నున్నది. దేవిగారు ఎక్కుదురుగాక" అని.

సీత:— ఇదె ఎక్కుచున్నాను. [అని లేచి పరిక్రమించి] అదురుచున్న దే నా గర్భభారము! కావున మెల్లఁగా నడువుము.

దుర్ము:— ఇటు ఇటు దేవి.

సీత:— నమస్కారము రఘుకులదేవతలకు."

[అని అందఱు నిష్క్రమింతురు.]

(ఉ.రా.చ.నా. ప్రథమాంకము)

## X

రావణసంహారానంతరము విభీషణునిచే రావణునకు దహనాదిసంస్కారములం గావింపంజేసి, విభీషణునకుఁ బట్టాభిషేకం బొనర్చిన తదుపరి శ్రీరామచంద్రుఁడు హనుమంతుని సీతాదేవియొద్దకుఁ దన విజయముఁ దెల్పుటకుఁ బంపెను. ఆవల శ్రీరాముఁడు విభీషణుం గాంచి

"విభీషణా! నీవుపోయి మంగళస్నానముచేసి కమ్మనిగంధము నలంది మేటినగల నలంకరించుకొనిన సీత నిచ్చటికి వేగఁ దోడ్తెమ్ము" అని యానతిచ్చెను. అప్పుడు విభీషణుఁ డంతిపురము సొచ్చి తన కాంతలం బిలిచి వారిచే సీతాదేవికి మంగళస్నానము చేయించి యమూల్యాభరణముల నలంకరించి, మేటి దువ్వలువఁ గట్టి క్రొంబట్టుముపఱచినట్టి పల్లకిఁ గూర్చుండఁజేసి రాము కడకుఁ గొనివచ్చినట్లు వాల్మీకిరామాయణములోఁ గానవచ్చెడిని.

భాగవతమున

"తతో దదర్శ భగవాన శోకవనికాలమే
క్షామాం స్వవిరహవ్యాధిం శింశుపామూలాశ్రితామ్
రామః ప్రియతమాం భార్యాం దీనాం వీక్ష్యాన్వకంపత
ఆత్మసందర్శనాహ్లాదవికసన్ముఖపంకజామ్
ఆరోప్యా దురుహే యానం భ్రాతృభ్యాం హనుమద్యుతః
విభీషణాయ భగవాన్ దత్త్వా రక్షోగణేశనామ్..."

అని యభివర్ణితము.

అనఁగా "శ్రీరాముఁ డశోకవనమున శింశుపాతరుమూలమున నున్న జానకి నాత్మవిరహవ్యాధినిఁ గృశించినదానిం గాంచి తన్నుఁ గనుఁగొన్నమాత్రన పరమాహ్లాదమున వదనవికాసం బెనసిన యా ప్రియతమయుఁ దాను లక్ష్మణసుగ్రీవులతోఁ బుష్పక మధిరోహించి విభీషణునకు లంకారాజ్యాధిపత్యంబును రక్షోగణేశ్వరత్వంబును ప్రసాదించెను." శ్రీరాముఁడు కదనరంగమందు రావణుని సంహరించినతోడ్తో నాతని శవమునకు దహనాది క్రియలను గావించుట యుక్తమే. వెంటనే యాతఁడు సీతాదేవియొద్దకుఁ దానై చని యచ్చోట శింశుపావృక్షముక్రింద కృశించి జీవమాత్రావశేషయై యున్న ధర్మపత్నినిఁ గాంచుట మిక్కిలి యుచితముగా నున్నదిగదా?

సీతాదేవికి స్నానముచేయించి యలంకరించి రక్తసిక్తాంగమైన యుద్ధభూమిలో "స్నానముచేయక" వేచియున్న శ్రీరాముని యొద్దకుఁ బల్లకీలోఁ దీసికొనివచ్చుట యెందులకో! బహుశః యుద్ధరంగము బహిరంగప్రదేశము కాఁబట్టి యచ్చట సీతాదేవి యగ్నిప్రవేశమునకు నర్హస్థలమని కవిహృదయమేమో! విభీషణుని పట్టాభిషేకము సీతాదర్శనానంతరమే శ్రీరాముఁడొనర్చినట్లు భాగవతమునఁ గలదు. ఈ క్రమచర్య సంభావ్యమని చెప్పక తప్పదు. సహృదయు లీయంశమును జర్చించి నిర్ణయింతురుగాత. భాగవతమున సీత యగ్నిప్రవేశమైన వెనకనే విభీషణుని పట్టాభిషేకము గావింపఁబడెను.

పీఠికామిషచే నొక్కించుక విమర్శించితినేగాని, వాల్మీకిమహర్షికిఁ గల్పనాకౌశల్యము కొఱతవడినదిగాని, తక్కినవారు రామకథను మెఱుఁగు వెట్టినారనిగాని నుడువుట నాకప్రస్తుతము. పురాకృతసుకృతఫలమున నా నోటనిలిచిన పలుకువెలందిని రామాయణరచనచే సార్థకను గావింపనెంచిన నా చిరకాలవాంఛితము నేఁటి కీతీరున నీడేరినది; ధన్యుఁడను. నా రచన పాఠకలోకప్రశంసార్హమైనచో ధన్యతరుఁడను! పండితజనాహ్లాదకరమైనచో నా జన్మము తరించినదేకదా!

---/o/---

# అభినందనము

~~~/0/~~~

బహుజన్మకృతసుకృతపరిపాకంబునంగాక కవితాలత యంకురింపదు. రసికవతంసుల యౌదార్యామృతసేచనముననే యయ్యది వర్ధిల్లఁగలదు. ఆంధ్రవాఙ్మయప్రపంచమున సువర్ణాక్షరలిఖితములైన కవిసన్మానోత్సవము లెన్నియేనిఁ గలవు. అనన్యాదృశమైన రెడ్డిఱేండ్ల యౌదార్యలక్ష్మీకటాక్షముననే పెక్కు రసవత్తరకృతు లుద్భవించి వన్నెదీరినవి.

కంఠగతప్రాణయై నిలిచిన ఆంధ్రకవితాసరస్వతిని పునరుద్ధరించిన ధీమంతులలో శ్రీ తిక్కవరపు రామిరెడ్డిగారు ప్రముఖులు. అడిగినదే తడవుగా ముద్రణార్థము ద్రవ్యమొసంగి వీరు ప్రచురింపఁజేసిన కృతులు సంఖ్యచేతనేగాక సారముచేతఁగూడ నద్వితీయములు. అట్లగుటచే వీరి వితరణశీలమును గుఱించి నేనెట్టి ప్రశంస యొనరించినను అయ్యది పునరుక్తిదోషమునకు నాకరమే యగును. ప్రత్యుపకృతి నపేక్షింపకయే నా యీ రచనకు ముద్రణార్థము నొసంగిన శ్రీ రామిరెడ్డిగారిపట్ల, లబ్ధోపకారుఁడనయ్యు మిన్నకుండుట పాడిగాదు గనుక నా నేర్చినంతలో వారి నభినందించుచున్నాను.

''ఘన మైశ్వర్యము దానిమించిన వివే
కప్రాభవస్ఫూర్తి మే
లున దానిం దలమీఱు సంతతియు న
ల్లుండైన గోపాలరె
డ్డి నిదేశించు ప్రభుత్వమంత్రి - యిటులై
ఠీవుల్ విరాజిల్ల నిం
త నిరాడంబరుఁ డీతఁ డింత సులభుం
డా! యింత భావజ్ఞుఁడా!''

తిక్కనార్యునకు గురునాథుండువోలె, నాకు లేఖకుఁడుగా సహకరించి కార్యభారమును నెఱవేర్చిన శ్రీ జి. రామమూర్తి B.A., గారికి నేనెంతయుఁ గృతజ్ఞుఁడను.
~~~

శ్రీరాముని చరిత్ర ముద్రాప్రదాతలు

# శ్రీ తిక్కవరపు రామిరెడ్డిగారి ప్రశంస

---:o:---

శ్రీరంజిల్లఁగ సప్తభూధరశిఖా
సీమన్ స్థిరుండై విప
ద్దారిద్ర్యాదికతప్తచిత్తులగు భ
క్తశ్రేణి రక్షించి మో
క్షౌదార్యాఢత్వ మొసంగు స్వామి సదయుం
డై రామిరెడ్డిన్ మహో
దారున్ దిక్కవరాన్వయాబ్ధివిధు ని
త్యశ్రీయుతుం జేయుతన్.

కవి యన్నవాని కక్షరలక్ష లిచ్చిన
ధారాధినాథుని త్యాగగరిమ
గండపెండారంబు కవికాలఁ దొడిగిన
శ్రీకృష్ణరాయల స్థిరయశంబు
కవిసార్వభౌమునిఁ గనకాభిషిక్తుఁ జే
సిన రెడ్డిఱేండ్ల సుశ్రీబలంబు
అవధానులను మెచ్చి హస్తి నెక్కించిన
సంస్థానపతుల భాషాప్రసక్తి
మూర్తి దాల్చి పినాకినీపూతసలిల
వర్ధితంబగు నెల్లూరుపట్టణమునఁ

గవులపాలిటి కల్పవృక్షంబొ యనఁగ
రహి నెసఁగుఁ దిక్కవరపు రామిరెడ్డి.

పారావారపరీతసర్వధరణీ
పర్యంతముల్ వేలకుల్
లేరో! అంబరచుంబిహర్మ్యతలకే
ళీమందిరావాసులై
కారే వారు కుబేరతుల్యధనికుల్;
కానీ, భవత్తుల్యు లు
న్నారా? యన్నదె సందియంబు మది నె
న్నన్ రామిరెడ్డిప్రభూ!

ధారాధీశుఁ డొసంగె లక్షలు కవీం
ద్రశ్రేణికం చెన్నఁడో
వీరల్ వారను జెప్పఁగా వినుటయే,
వీక్షింపఁగా లేదహో!
స్వారాట్తుల్యుఁడు రామిరెడ్డి కవికిం
బ్రత్యబ్దముల్ బ్రీతితో
నూరల్ మీఁదఁ బదాఱులిచ్చుటయె క
న్గోనయ్యె మాకియ్యెడన్.

'కవులన బిచ్చగాండ్రె యని
కాలవశంబున రూఢిమై నిఘం
టువులకు నెక్కెనా' యను మ
నోవ్యథతోఁ గృశియించు కావ్యకృ

త్పాత్రివరులఁ బ్రోవ నెంచెడు వ
        దాన్యుఁడు నీవలె రామిరెడ్డి! యీ
భువిపయి నుండుటెల్లఁ గవి
        పుణ్యము, కోటికి నొక్కఁడేనియున్.

నిండారుపంటల నిలువెల్ల నెక్కొన్న
        పొలములు కొన్నివందలు గడించి
చదలేటి జలముల ధౌళితంబు లగుచు
        వెలినిగ్గు లొలయు మేడల వసించి
పిదికిన నమృతంపుఁ జేఁపుసోనయును బోలె
        పాలొసఁగు పశుసంపదను మించి
నట్టింటి దివ్వెల యట్టుల కళలీను
        ప్రతిమ లేనట్టి సంతతినిఁ బడసి

పలుకుఁ దొయ్యలి సిరిచెల్వ గలసిమెలసి
నిత్యమును స్వీయగృహమున నృత్యమాడ
నిరతసౌభాగ్య సంపత్తి నెగడుచుండు
రమ్యగుణుఁడు తిక్కవరపు రామిరెడ్డి.

వేవేలు రూప్యముల్ వెచ్చించి ముద్రించె
        నలవోకఁ 'గంబ' రామాయణంబు
బంగరునాణెంపు వర్షంబు గురియించి
        ప్రకటించె శ్రీ 'శివభారతంబు'
కవికి క్షేత్రమొసఁగి కడగి యచ్చొత్తించెఁ
        జేవదేలిన 'కాందిశీక' కృతిని

శృంగారవేదాంతసిద్ధినిఁ జవి చూప
నచ్చువేయించె 'సిద్ధార్థ' చరిత

ఎందఱెందఱో కవులు రచించినట్టి
కావ్యములకు నిత్యము జీవగఱ్ఱ యగుచుఁ
బొలుచు నెల్లూర నభినవభోజుఁ డనఁగ
రమ్యగుణుఁడు తిక్కవరపు రామిరెడ్డి.

కృతికర్త భాస్కరుఁడు మఱి
కృతిభర్త సుధామరీచి, యిరువురికీర్తి
ద్యుతులు ధర శాశ్వతమ్ములు
గతులందప్పని రవీందుకాంతుల మాడ్కిన్.

కవితాలతికావికస
న్నవపద్యప్రసవగుచ్ఛనానానంద
ప్రసహామోదము దెసలన్
ససరించెడు గంధవహులు సరసుల్ దాతల్

నా కావ్యంపుఁ దెఱంగుఁ జెప్పిన మహా
నందాన ముద్రింపఁగా
సౌకర్యం బొనగూర్చెఁ దత్ క్షణమె ధీ
సాంద్రుం డితం డక్లియా!
'లా' కేత్వంబును 'బా'కుఁ గొమ్మునిడి ప
ల్కంబోని యౌదార్యమే
లోకారాధ్యము; కానిచో నిదియె యా
లోచింపఁగా హేయమౌ.

V

అదిగో యిదిగో యని 'వా
యిదాల' వేసి యరచేయి నేదో మిఠచేఁ
దుదఁజూపించెడు దాతల
మది నోఁపఁడు రామిరెడ్డి మాన్యుండగుటన్.

నవలలు నాఁటికల్ కథలె
నవ్య చమత్కృతులంచు వానినే
పవళులు రేల్ పఠింపఁ బరి
పాటినిఁగాంచిన నేఁడు బ్రహ్మత
త్త్వవిదిత పోతనార్య రచి
తంబగు రామచరిత్ర కర్థమున్
వివరణమున్ లిఖింప మది
నిం గడు మెచ్చెను రామిరెడ్డియే!

ప్రత్యుపకారమెన్నక శు
భప్రతిపాదకమైన యట్టి స
త్కృత్యము నిర్వహించిన సు
ధీతిలకుండగు రామిరెడ్డి సాం
గత్యమునన్ వచోమయయజ
గంబున రాయలనాఁటి వైభవౌ
న్నత్యమునంది మా తెలుఁగు
నాట వెలుంగుత నవ్యకావ్యముల్.

సిరితో నీవికిఁ జెల్మి గూరిచెడు సౌ
శీల్యంబు నార్జించి భా
స్వరసత్కావ్యలతాంతసౌరభపరి
వ్యాప్తాతివిఖ్యాతస
చ్చరితుండై తగు రామిరెడ్డి యశమా
చందార్కమై యివ్వసుం
ధరలో నెక్కొని యెల్లవారలకు నా
దర్శంబుగా నుండదే!

అక్కజపుఁ జెలిమి పెంపున
నక్కాసెల్లెంద్రవోలె ననవరతంబున్
నెక్కొనుత సిరియు వాణియుఁ
దిక్కవరపు రామిరెడ్డి ధీరునియింటన్.

గుడి జీర్ణించుఁ, దటాకమింకు, వనముం
గూలాఱు నిక్షేప మె
ప్పుడో క్షీణించును నగ్రహారము చెడుం,
బుత్రుండు ప్రాణంబులన్
విడుచుం గాని సదాతనంబగుచుఁ బృ
థ్వీమండలంబందు ని
ల్చెడు సంతానము కావ్యమొక్కటియె ప్రా
లేయాచలప్రాయమై.

కావున కృతులన్ నిల్పెడు
నీవియె శ్రేష్ఠంబఁటంచు నెన్నిరి బుధు లి

ట్లీవు లసత్కావ్యంబులఁ
బ్రోవఁగ, శ్రీరామిరెడ్డి! పుణ్యప్రదమా.

చెన్నపట్టణమునఁ జెలఁగు 'విద్యోదయ'
పాఠశాలకు సాయపడితి వీవు;
'కావలికాలేజి' కట్టడములఁ బెద్ద
భవనంబు నిర్మించి వఱలితీవు;
'కస్తూరిబా' బాలికా 'హాయిస్కూలుకు'
నర్థలక్ష యొసంగి యలరితీవు;
అల 'ఆంధ్రవిశ్వవిద్యాలయ' సీమను
బృఘులవాసము గట్టి వెలసి తీవు;

ఇట్టి దానంబులెన్నియో యెవరికెఱుక!
అణువు మొదలుగా బ్రహ్మాండ మంతదాఁక
నీ కరుణలేక యే సంస్థ నెగడనేర్చుఁ?
ప్రథితకీర్తి! తిక్కవరపు రామిరెడ్డి!

వ్రాయఁగా వలయును సువర్ణాక్షరముల
సత్కవీంద్రుండు భవదీయ సచ్చరిత్ర;
అట్లుగాకున్న విబుధుల కాదరంబు
లోటుగాదె సారస్వతలోకమందు?

చెక్కఁగా వలయును శిల్పి చిత్రగతుల
శాశ్వతముగ నీదు చరిత శాసనములఁ

గానిచోఁ గళాకారుల గౌరవంబు
లోటుగాదోటు సత్కళాలోకమందు?

పాడఁగావలె గొంతెత్తి పాటకుండు
దివ్యమగు నీదుచరితంబు భవ్యరీతి;
నటులకాదేనిఁ బ్రథితగాయకుల కెల్ల
లోటుగాదొక్క సంగీతలోకమందు?

ప్రవిమల మానసుండు ప్రతి
భాయుతుఁ డద్భుతనవ్యకల్పనా
ప్రవణుఁడు వాక్చమత్కృతవి
భాసితధీబలుఁడున్ సభాస్థలీ
ప్రవచనభూషితుండు కవి
పాలిటి వేల్పులగిడ్డియైన తి
క్కవరపు రామిరెడ్డి కిడుఁ
గాత మహేశుఁ డనంతసౌఖ్యముల్.

నెల్లూరు
23–5–57

విద్వద్విధేయుఁడు,
కె. నారాయణరావు.

# శ్రీరాముని చరిత్రము

~~~/o/~~~

అమరేంద్రాశకుఁ బూర్ణచంద్రుఁ డుదితుం
డైనట్లు నారాయణాం
శమునం బుట్టె మదాంధరావణశిర
స్సంఘాతసంఛేదన
క్రమణోద్దాముఁడు రాముఁ డాగరితకుం
గౌసల్యకున్ సన్నుతా
సమనైర్మల్యకతుల్యకంచితజను
స్సంసారసాఫల్యకున్. 1

టీక. అమర + ఇంద్ర + ఆశకున్ = తూర్పుదిక్కునకు (ఇంద్రుని దిక్కు), పూర్ణచంద్రుఁడు = నిండు చందురుఁడు, ఉదితుండు + ఐన + అట్లు = పుట్టినరీతిఁగా, నారాయణ + అంశమునన్ = శ్రీమన్నారాయణుని యవతారవిశేషముగా, మదాంధ.....ద్దాముఁడు, మద + అంధ=పొగరుచే గ్రుడ్డివాఁడైన, రావణశిరస్ + సంఘాత = రావణుఁడను రాక్షసుని తలల మొత్తమును (రావణాసురుఁడు దశకంఠుఁడు), సంఛేదన + క్రమణ = చీల్చుటకొఱకు నడుగిడుటలో, ఉత్ + దాముఁడు = భయంకరుఁడగు, రాముఁడు = శ్రీరాముఁడు, ఆగరితకున్ = సుప్రసిద్ధయైన యిల్లాలును, సన్నుతా...నైర్మల్యకున్, సత్ + నుత = కొనియాడఁబడిన, అసమ = సాటిలేని, నైర్మల్యకున్ = పవిత్రతఁ బొందినదియు, అతుల్యకున్ = సాటిలేనిదియు, అంచిత = ప్రసిద్ధమైన, జనుస్ = పుట్టువుగల, సంసార =
~~~

కుటుంబముయొక్క, సాఫల్యకః=సఫలత్వము కలదియు,(అగు) కౌసల్య కుః=(దశరథుని పట్టపురాణియగు) కౌసల్యాదేవికి, పుట్రైః=జన్మించెను.

తా. సరయూతీరంబునఁ గోసలదేశము గలదు. దానికి నయోధ్యానగరము రాజధాని. అది పండ్రెండు యోజనంబుల నిడుపును, మూఁడు యోజనంబుల వెడల్పును గలిగి యుండెను. ఆ నగరమును దశరథుఁడను మహారాజు ఏలుచుండెను. ఆ రాజునకు నెనమండ్రుగురు మంత్రులును, వసిష్ఠవామదేవులను గురుముఖ్యులు నుండిరి. దశరథుని యేలుఁబడి ధర్మరక్షితమై యుండుటంజేసి, దేశము సకలసంపదలతోఁ దులఁదూఁగుచుండెను. దశరథునకు ముగ్గురు భార్యలుండిరి. అందుఁ గౌసల్యాదేవి పట్టమహిషి; సుమిత్ర రెండవభార్య; కైకేయి ప్రియురాలు. ఇందుఁ గౌసల్య సాటిలేని మేటిగుణములు గలది. దశరథుఁడు తనకు సంతానము లేనందునఁ జింతించి, గురువగు వసిష్ఠుని యానమేరకు ఋష్యశృంగుఁడను మహర్షినిఁ దోడ్కొనివచ్చి, అశ్వమేధయాగమును సమాప్తము గావించెను. తదనంతర మాతఁడు పుత్రకామేష్టి యను హోమమాచరించెను. అగ్నికుండమునుండి పెనుభూతమొం డుదయించి దశరథునకుఁ బాయసపాత్ర నొసంగి, 'రాజా! ఈ పాయసమును నీ పత్నులకు నొసంగిన వారు పుత్రులను బడయుదు'రని చెప్పి యంతర్ధానమయ్యెను. దశరథుఁ డా పాయసమును గొంపోయి కౌసల్యకు సగమొసంగెను; మిగిలిన సగములో సుమిత్రకు సగమొసంగెను. తక్కుంగల సగములోఁ గైకేయికి నిడి, అందు శేషించిన సగము సుమిత్ర కొసంగెను. ముగ్గురుపత్నులు గర్భవతులైరి. శుభసమ

యంబున శ్రీమన్నారాయణమూర్తి కౌసల్యాదేవిగర్భమునఁ బున్నమనాఁడు తూర్పుదిక్కునఁ బుట్టిన పూర్ణచంద్రునట్లు, శ్రీరామచంద్రుఁడుగా భూలోకమున జన్మించెను. ఈ రాముఁడే గర్వాంధుఁడైన దశగ్రీవుని సంహరించుటకు ముందంజవేసిన భయంకరమూర్తి. కైకేయికి భరతుఁడును, సుమిత్రకు లక్ష్మణశత్రుఘ్నులును బుట్టిరి. ఆ రాజపుత్త్రులు నలువురు శుక్లపక్షచంద్రునివలె దినదిన ప్రవర్ధమానులై యుక్తకాలమున నెల్లవిద్యలు నేర్చిరి.

సవరక్షార్థము దండ్రి పంపఁ జని వి
  శ్వామిత్రుఁడుం దోడరా
నవలీలం దనుమాడె రాముఁ డదయుం
  డై బాలుఁడై కుంతల
చ్ఛవిసంపజ్జితహాటకం గపటభా
  షావిస్ఫురన్నాటకన్
జవభిన్నార్యమఘాటకం గరవిరా
  జత్ఖేటకం దాటకన్. 2

టీ. సవ + రక్ష + అర్థము = యజ్ఞమును రక్షించుటకొఱకు, తండ్రి = (శ్రీరాముని తండ్రియైన) దశరథుఁడు, పంపన్ = పంపఁగా, (ఆ శ్రీరాముఁడు), చని = పోయి, విశ్వామిత్రుఁడున్ = యజ్ఞమునుజేయు విశ్వామిత్ర మహర్షి, తోడన్ + రాన్ = తన వెంటరాఁగా, బాలుఁడు + ఐ = చిన్నవాఁడైనను, రాముఁడు, అదయుండు + ఐ = దయలేనివాఁడై, కుంతల... హాటకన్, కుంతల = జుట్టుయొక్క, ఛవిసంపత్ = కాంతి సంపదచే, జిత = జయింపఁబడిన, హాటకన్ = బంగారము కలదానిని, కపట......నాటకన్, కపటభాషా = మోసపుమాటలచే, విస్ఫురత్ =

తెలియవచ్చు, (స్ఫురింపఁజేయు), నాటకన్ = నటనము కలదానిని, జవ... ఖేటకన్, జవ = వడిచే, భిన్న = ఛేదింపఁబడిన (జయింపఁబడిన), అర్యమ = సూర్యునియొక్క, ఘోటకన్ = గుఱ్ఱములు కలదానిని, కర = చేతియందు, విరాజత్ = ప్రకాశించు, ఖేటకన్ = డాలుకలదానిని, తాటకన్ = "తాటక" యను పేరుగల రాక్షసిని, అవలీలన్ = మిక్కిలి సులువుగా, తునుము + ఆడెన్ = చంపెను.

తా. ఇది యిట్లుండఁగా, విశ్వామిత్రమహర్షి తపోయజ్ఞము గావించుచుండెను. కామరూపులగు రాక్షసులు రుధిరమాంసముల వర్షించి, యజ్ఞమునకు విఘ్నమాచరించుచుండిరి. విశ్వామిత్రుఁడంత దశరథమహారాజుకడ కేఁగి క్రతురక్షణార్థము శ్రీరామునిఁ బంపఁగోరెను. ముక్కుపచ్చలారని ముద్దుబిడ్డలను బంపుటకుఁ దొలుత దశరథుఁడు సంకోచించినను వసిష్ఠుని యాజ్ఞమేరకు రామలక్ష్మణులను విశ్వామిత్రుని వెంటఁ బంపెను. సరయూతీరమున గాధేయుఁడు రామునకు 'బలాతిబల' విద్యలను బ్రసాదించెను. తదుపరి వారికిఁ ద్రోవలో 'మలినరూశదేశము' కాన్పించెను. అందు నూఱేనుంగుల బలముగల తాటకయను రాక్షసాంగన సుందుఁడను వానిఁ బెండ్లాడి, మారీచుఁడను సుతునిఁ బడసెను. తాటక వికృతస్వరూపిణి. ఆ రాక్షసి కేశములు మిక్కిలి దట్టములై, దీర్ఘములై బంగారువన్నె కలిగి యుండెను. ఆ రక్కసి కపటములగు మాటలచే నటనంబొనర్చి మోసగించు దిట్ట. సూర్యునిగుఱ్ఱములను దిరస్కరించునంత వేగముగలది. చేతియందెల్లప్పుడు డాలును ధరించి చూపఱకుఁ గరము వెఱపు గొలుపుచుండెడిది. ఆ యసురను గాంచినంతనే శ్రీరాముఁడు నిశితశరమును దాని యుర

మునఁ గొట్టెను. వెంటనే ఆ రాక్షసి నేలఁగూలి యసువులు దొఱఁగెను. దేవతలు పరమానందభరితులై పుష్పవృష్టిని గురిసిరి. శ్రీరాముని పరాక్రమమునకు విశ్వామిత్రుఁడు మెచ్చి నానాస్త్రప్రదానము చేసెను.

గారామునఁ గౌశికమఖ
మా రాముఁడు గాచి దైత్యు నధికు సుబాహున్
ఘోరాజిఁ ద్రుంచి తోలెను
మారీచున్ నీచుఁ గపటమంజులరోచున్. 3

టీ. ఆ రాముఁడు, గారామునన్=గౌరవముతో (లేక ప్రేమతో), కౌశికమఖము=విశ్వామిత్రుని యజ్ఞమును, కాచి=రక్షించి, ఘోర+ఆజిన్=భయంకరమగు యుద్ధమునందు, దైత్యున్=రక్కసుని, అధికున్=దీర్ఘమైనవానిని, సుబాహున్=సుబాహుఁడను పేరుగల రాక్షసుని, త్రుంచి=చంపివైచి, నీచున్=అధముఁడైనవానిని, కపట...రోచున్, కపట=కృత్రిమమైన, మంజుల=మనోహరమైన, రోచున్=కాంతికలిగినవానిని, మారీచున్='మారీచు'ఁడను రక్కసుని, తోలెన్=పాఱఁదోలెను.

తా. విశ్వామిత్రుఁడు తన యజ్ఞమును ఐదుదినములు నిర్విఘ్నముగా సాగించెను. ఆఱవనాఁడు ఎక్కడనుండియో రక్తధారలు వేదిపై వర్షించెను. శ్రీరాముఁ డందులకుఁ గోపోద్దీపితుఁడై శరము సంధించి, నెత్తురువానను గురిసిన మారీచుని యురముం గుఱిచేసి యేసెను. మారీచుఁడను రాక్షసుఁ డతినీచుఁడు. మాయచే మనోహరమైన కపట వేషము దాల్పఁగలవాఁడు. శ్రీరాముఁ డేసిన కోల వానిం గొని పోయి నూఱామడ దూరముగా సముద్రమునఁ ద్రోసెను.

అంత రాముఁడు సుబాహుఁడను రాక్షసునిఁ దార్కొని భయంకరయుద్ధ మాచరించి, ఆ దీర్ఘకాయునిఁ దీక్ష్ణబాణముచేఁ గూలియించెను. విశ్వామిత్రుఁడు యజ్ఞశేషమును బూర్తిగావించి యమందానందముతో శ్రీరాముని దీవించెను.

ఒకమున్నూఱు గదల్చి తెచ్చిన లలా
టోగ్రాక్షుచాపంబు, బా
లకరీంద్రంబు సులీలమైఁ జెఱకుఁగో
లం ద్రుంచు చందంబునన్
సకలోర్వీశులు సూడఁగా విఱిచె దో
శ్శక్తిన్ విదేహక్షమా
పకగేహంబున సీతకై గుణమణి
ప్రస్ఫీతకై లీలతోన్.

టీ. ఒక + మూఁడు + నూఱు = మూఁడువందలమంది, కదల్చి = కదలించి, తెచ్చిన, లలాట + ఉగ్ర + అక్షుచాపంబున్ = నొసట భయంకరమైన నేత్రముగలవాఁడైన శివునివింటిని, బాలకరీంద్రంబు = గున్నయేనుఁగు, సులీలమైన్ = మిక్కిలి తేలికగా, చెఱకు + కోలన్ = చెఱుకుగడను, త్రుంచు చందంబునన్ = విఱుగఁ గొట్టువట్లుగా, సకల + ఉర్వీశులు = రాజులందఱును, చూడఁగాన్ = వీక్షించుచుండఁగా, (రాముఁడు), దోః + శక్తిన్ = బాహుబలముచే, విదేహ + క్షమాపక + గేహంబునన్ = విదేహనృపతియగు జనకుని యింటిలో, గుణమణి + ప్రస్ఫీతకున్ + ఐ = ఉత్తమగుణములచే నొప్పునట్టిదైన, సీతకున్ + ఐ = సీతాదేవికొఱకై, లీలతోన్ = క్రీడావిలాసముతో, విఱిచెన్ = త్రుంచెను.

తా. తెల్లవాఱినంత, రామలక్ష్మణులు ఆహ్నికములుదీర్చి ఋషిసత్తమునకు మ్రొక్కిరి. వారందఱు

మిథిలాధీశుఁడగు జనకమహారాజునొద్దకుఁ బయనమైరి. మార్గమధ్యమున శ్రీరామపాదధూళి సోఁకి యంతదనుక శిలగానున్న అహల్య, స్వస్వరూపముదాల్చి శ్రీరాముని వేనోళ్ళఁబొగడి యందఱకు నాతిథేయసత్కారము లొనర్చెను. గౌతమమహర్షియు నటకువచ్చి, రామపదస్పర్శనమునఁ బవిత్రమైయున్న తనగృహిణి యహల్యను గ్రహించి, విశ్వామిత్రునకు దాశరథికి యథోచితమర్యాదలు గావించెను. జనకమహారాజు విశ్వామిత్రాగమనంబు విని యెదురేఁగి, యా ఋషిసత్తమునకు రామలక్ష్మణులకు స్వాగతమిచ్చెను. మఱునాఁడు జనకమహారాజేర్పఱిచిన సభకు నానాదేశాగతులైన రాజచంద్రులు విచ్చేసిరి. విశ్వామిత్రుఁడు రామలక్ష్మణులతోవచ్చి యుచితాసన మలంకరించెను. జనకుఁడు సభాస్తారులకు మ్రొక్కెను. అంతట మున్నూర్గురుభటులు చని యెనిమిది చక్రములబండినిఁ గదలించి లాగుకొని వచ్చిరి. దానిపైఁ బెద్ద యినుపపెట్టె యమర్పఁబడి యుండెను. జనకుఁడు సదస్యుల నుద్దేశించి, "ఈ ముక్కంటి వింటిని ఎవ్వఁడు మోపెట్టునో యా వీరుఁడు నా పుత్రికయగు సీతను బడయఁగలఁ"డని విన్నవించెను. విశ్వామిత్రుని యానచే శ్రీరామచంద్రుఁడు ఏనుఁగుగున్న చెఱకుగడను ద్రుంచునట్లనవలీలగా రాజులందఱబ్బురంపడి చూచుచుండ, స్వీయబాహుబలముచే మిక్కిలి విలాసముగా నా శివధనువునెత్తి యద్దానిఁ ద్రుటిని భగ్నము గావించెను.

భూతలనాథుఁడు రాముఁడు
ప్రీతుండై పెండ్లియాడెఁ బృథుగుణమణిసం

ఘాతన్ భాగ్యోపేతన్
సీతన్ ముఖకాంతివిజితసితఖద్యోతన్. 5

టీ. భూతలనాథుఁడు = పుడమిఱేఁడు (అయిన) రాముఁడు, ప్రీతుండు + ఐ = సంతోషించినవాఁడై, పృథుగుణమణిసంఘాతన్ = ఉత్తమగుణములకుఁ బ్రోవైనదియు, భాగ్య + ఉపేతన్ = అదృష్టముతోఁ గూడినదానిని, ముఖ...ఖద్యోతన్, ముఖకాంతి = ముఖముయొక్క కాంతిచే, జిత = జయింపఁబడిన, సితఖద్యోతన్ = చంద్రుఁడు (తెల్లని కాంతిగల వాఁడు) కలదియు (అగు) సీతన్, పెండ్లి + ఆడెన్ = పెండిలిసేసికొనియెను,

తా. మహాద్భుతమైన రాముని బాహుబలంబునకు నెల్లరు విస్మయమందిరి. జనకరాజు పంపున మంత్రులు అయోధ్యచేరి దశరథుని మిథిలానగరమునకుఁ దోడ్కొని వచ్చిరి. మఱునాఁటి యుదయంబున దశరథుఁడు సుతుల వివాహంబులకుఁ బూర్వాంగ కర్మములెల్లఁ గావించి, విశ్వామిత్రాది ఋషులతోడ యజ్ఞశాల కరుదెంచెను. రామలక్ష్మణభరతశత్రుఘ్నులు మంగళస్నాతులైరి. వసిష్ఠులవారేతెంచినవెంటనే దశరథుఁడు శ్రీరాముని వివాహవేది మ్రోల నిలిపెను. జనకుఁడు తన సుతను గొనివచ్చి యగ్ని యెదుట నుంచెను. ఆ సీత శ్రేష్ఠములగు గుణములకు నిధి; సర్వసంపదలచేఁ దులఁదూఁగు బాలారత్నము; పూర్ణచంద్రుని కాంతినిసైతముఁ దిరస్కరించు ముఖవర్చస్సుగల సౌందర్యరాశి. శ్రీరాముఁడామెను మిక్కిలి ప్రీతితో మంగళమధురగీతంబులు చెలరేఁగ, నానాతూర్యరావంబులు విస్తరిల్లఁ గల్యాణమాడెను. అనంతరము, లక్ష్మణునకు నూర్మిళను, భరతునకు మాండవిని, శత్రుఘ్నునకు శ్రుత

కీర్తిని నిచ్చి జనకుఁడు పెండ్లి చేసెను. కుసుమవృష్టి కురిసెను; దివ్యదుందుభులు మ్రోసెను; సభాసదు లెల్లరు సంతోషాబ్ధి నోలలాడిరి.

రాముఁడు నిజబాహుబల
స్థేమంబున భంగపఱిచె దీర్ఘకుఠారో
ద్దాముఁ విదళీకృతనృప
భాముఁ రణరంగభీము భార్గవరాముఁ. 6

టీ. రాముఁడు, నిజ...స్థేమంబునఁ, నిజ = తనయొక్క, బాహుబల = బాహుబల సమన్వితమైన, స్థేమంబునఁ = శరీరబలముచే, దీర్ఘ... ద్దాముఁ, దీర్ఘ = పొడుగైన, కుఠార = గండ్రగొడ్డలి (ధరించుట)చే, ఉద్దామున్ = భయంకర వ్యాపారముగల వాఁడును, విదళీ...భాముఁ, విదళీకృత = బాధపెట్టఁబడిన, నృప = రాజులయొక్క, భాముఁ = భార్యలు గలవాఁడును, (పరశురాముఁడు క్షత్రియులను నిర్మూలించుటచే వారి భామ (భార్య)లు వైధవ్యమున బాధపడినారని భావము), రణరంగ = యుద్ధరంగమందు, భీముఁ = భయంకరమైన వాఁడును (అగు), భార్గవరాముఁ = పరశురాముని, భంగపఱిచెఁ = ఓడించెను.

తా. కళ్యాణానంతరము, దశరథుఁడు తనయులను గోడండ్రను వెంటఁగొని, తరలి కొంతదూరము చనెను. త్రోవలోఁ బరశురాముఁడు వారికిఁ గాన్పించెను. ఇతఁడు దీర్ఘమగు గండ్రగొడ్డలిని ఆయుధముగా ధరించిన భయంకర మూర్తి; క్షత్రియవంశనిర్మూలనమునకై ప్రతిన పట్టిన వాఁడు; యుద్ధరంగమందు దిట్టదిట్టుఁడు. అతఁడు శ్రీరాముం దిలకించి 'రామా! నీవు శివుని విల్లువిఱిచిన ధీరుండవఁట! ఇదిగో నా చేతి చాపంబును జూడుము. ఇద్దానిని నా తండ్రి

జమదగ్ని నాకుఁ బ్రసాదించెను. దీనిని మోపెట్టి నీ బలమును జూపుము' అని గద్దించెను. శ్రీరాముఁడు భార్గవరాముని మాటలకుఁ గోపింపక వాని చేతివిల్లు నందుకొనెను. కార్ముకగ్రహణముతోడఁ బరశురామునిశక్తి రామునిఁ జేరెను. రాముఁడు విల్లందుకొని శరసంధానము గావించి "భార్గవా! ఈ శరము వైష్ణవంబు గావున వ్యర్థము కాఁగూడదు. నీ పాదగతి శక్తియో, నీ తపోబలసమార్జితమైన లోకంబులో రెంటనొకటి గుఱి కావలయును. ఇందేది వలతువు" అని వినయపూర్వకంబుగాఁ బ్రశ్నించెను. భార్గవుఁడు నివ్వెఱపడి "రామా! నా పరాజయము నొప్పుకొనుచున్నాఁడను. నా జయించిన పుణ్యలోకంబును బడవేయు"మని ప్రత్యుత్తరమిచ్చెను. రాముఁడు శరవిమోచనము గావించెను. అది క్షణములోపల పరశురాముని పుణ్యలోకమును హరించెను. గర్వభంగమునొందిన జామదగ్న్యుఁడు రామునకుఁ బ్రదక్షిణించి, మహేంద్రగిరికిఁ జనెను. దశరథాదులమందానందముతోఁ బయనము సాగించి యయోధ్యానగరమును జేరిరి.

దశరథుఁడు మున్నుఁ గైకకు
వశుఁడై తానిచ్చినట్టి వరముకతన వా
గ్దశ సెడక యడవి కనిచెను
దశముఖముఖకమలతుహినధామున్ రామున్. 7

టీ. దశరథుఁడు, మున్ను=పూర్వము, కైకకున్, వశుఁడు+ఐ = లోఁబడినవాఁడై, తాన్ = తాను, ఇచ్చినట్టి వరముకతనన్ = వరమిచ్చిన

కారణముచే, వాక్ + దశ = మాటయందలి యవస్థను (సత్యసంధత), చెడక = తప్పకుండుటకై, దశ..... ధాముఁ, దశముఖ = పదితలలు కలిగిన రావణాసురునియొక్క, ముఖకమల = ముఖము అను పద్మమునకు, తుహినధాముఁ = చంద్రునివంటివాఁడగు, రాముఁ, అడవికిఁ, అనిచెను = పంపెను.

తా. శ్రీరాముఁ డెల్లరకుఁ బ్రియుఁ డగుటచే దశరథుఁ డాతనిఁ బట్టాభిషిక్తునిఁ గానొనర్ప సంకల్పించెను. అందులకు మంత్రు లియ్యకొనిరి; పౌరజను లామోదించిరి. వసిష్ఠులవారు వల్లె యనిరి. నగరవాసులు భక్తిసంతోషంబులు పెనఁగొనఁ బురమునంతయు సింగారించిరి. మంథర యను దాసి కైకేయికి నాప్తురాలు. ఆమె యకారణముగ రాముని పట్టాభిషేకమునకు సహింపనేరక, కైకేయిని డాసి, శ్రీరాముఁడు పట్టాభిషిక్తుఁ డైనచోఁ గౌసల్య రాజమాత యగుననియు, దానివలనఁ గైకేయికి నలువురలోఁ దలవంపు ఘటిల్లుననియుఁ బెక్కుతెఱంగులఁ గైకమనస్సును గలుషిత మొనరించి, యామె రామపట్టాభిషేకమునకు విఘ్న మొనరించునట్లు చేసెను. తత్ఫలితముగాఁ గైకేయి రాముఁడు జటావల్కలధారియై పదునాల్గేండ్లు వనవాస మొనరించునట్లును దన కుమారుఁడగు భరతుఁడు పట్టాభిషిక్తుఁడగునట్లుగను, దశరథమహారాజును రెండువరము లడిగెను. కైకకుఁ దా నిదివఱకే రెండువరము లిచ్చియుండుటచే దశరథుఁడు లొంగిపోయి చేయునదిలేక సత్యావాక్పరతుఁ డగుటచే దశముఖుని ముఖకమలమునకుఁ జంద్రుఁడగు శ్రీరామచంద్రుని అడవులకుఁ బంపెను.

జనకుఁడు వనిచిన మేలని
జనకజయును లక్ష్మణుండు సంసేవింపన్
జనపతి రాముఁడు విడిచెను
జనపాలారాధ్య ద్విషదసాధ్య నయోధ్యన్. 8

టీ. జనకుఁడు = తండ్రి (అగు దశరథుఁడు) పనిచినన్ = పంపఁగా, మేలు + అని = మంగళకరమని, జనకజయున్ = సీతయు, లక్ష్మణుండున్ = తమ్ముఁడైన లక్ష్మణుఁడును, సంసేవింపన్ = తన్ను సేవించుచు వెంటరాఁగా, జనపతి = రాజైన, రాముఁడు, జనపాల = (ప్రజలను పాలించునట్టి) రాజులచే, ఆరాధ్యన్ = పూజింపఁబడునట్టిదియు, ద్విషత్ = శత్రువులకు, అసాధ్యన్ = (జయించుటకు) సాధ్యముకానిదియు (అగు), అయోధ్యన్ = అయోధ్యా నగరమును, విడిచెను = విడిచిపెట్టి పోయెను.

తా. తండ్రిమాట జవదాఁటని శ్రీరాముఁడు తా నడవులకుఁబోవుటయే మంగళకరమని యెంచి, సోదరుండగు లక్ష్మణుఁడు దన్ను సేవింప సీతాసహితుఁడై వల్కలములఁ దాల్చి నయోధ్యను వీడిపోయెను. శ్రీరాముని వియోగము వలన రాజులచేఁ బూజింపఁబడి, శత్రువుల కసాధ్యమైన యీ అయోధ్యానగరము విన్నఁబోయెను. కౌసల్య విలపించెను. దశరథుఁడు మూర్ఛిల్లెను. ప్రజలెల్లరు దుఃఖాబ్ధిలో మునింగిరి.

భరతున్ నిజపదసేవా
నిరతున్ రాజ్యమున నునిచి నృపమణి యెక్కెన్
సురుచిరరుచిపరిభావిత
గురుగోత్రాచలముఁ జిత్రకూటాచలమున్. 9

టీ. నృపమణి = రాజులలో శ్రేష్ఠుఁడగు శ్రీరాముఁడు, నిజపద = తనపాదములను, సేవా = సేవించుట (పూజించుట)యందు, నిరతుఁ = ఆసక్తికలవాఁడగు భరతుఁ, రాజ్యమునకుఁ, ఉనిచి = ఉంచి, సురుచిర... చలముఁ, సురుచిర=మిక్కిలి యొప్పిదమైన, రుచి= కాంతిచే, పరిభావిత = కొనియాడఁబడినదగు, గురు = ఘనమైన, గోత్రాచలముఁ = సప్త కుల పర్వతములలో నొకటియగు, చిత్రకూట + అచలముఁ = చిత్రకూటమను పేరుగల పర్వతమును, ఎక్కెఁ = ఎక్కెను.

తా. రాముఁడు కోసలనువీడి గుహునిసాయమున గంగానదిని దాఁటిపోయెను. దశరథుఁడు పుత్రశోకమున పరలోకగతుఁ డయ్యెను. గిరివ్రజపురమునుండి భరతుఁ డయోధ్యనుజేరి, తన తల్లి కైకేయివలన జరిగిన వృత్తాంతము విని, మొదలునఱికిన యరఁటివోలె నేలఁగూలెను. ఆతఁడు తెప్పిఱిల్లఁగనే వసిష్ఠునానతిపై దశరథునికి దహనాదిక్రియల నిర్వర్తించెను. రాజకర్తలు భరతునిఁజేరి, రాజ్య మరాజక ముగా నుండకూడదని చెప్పఁగా భరతుఁడు రామునికొఱకుఁ దరలిపోయెను. శ్రీరాముఁ డప్పటికే చిత్రకూటపర్వతము చేరియుండెను. భరతుఁడు పాదచారియై సీతారాముల దర్శించి రామపట్టాభిషేకమును ప్రార్థించెను. శ్రీరాముఁ డందుల కియ్యకొనక భరతుని కోరికప్రకారము తన పాదుకల నిచ్చెను. భ్రాతృభక్తిభరితుఁడగు భరతుఁ డా పాదుకల నయోధ్యకుఁ గొంపోయి వానికిఁ బట్టాభిషేకము గావించెను. పాదుకానియుక్తుఁడై, భరతుఁడు రాజకార్యముల నిర్వర్తించుచు, శ్రీరాముని రాకకై నిరీక్షించుచుండెను.

పుణ్యుఁడు రామచంద్రుఁ డట
వోయి ముదంబునఁగాంచె దండకా

రణ్యము దాపసోత్తమ శ
రణ్యము నుద్ధతబర్హిబర్హలా
వణ్యము గౌతమీవిమల
వాఃకణపర్యటనప్రభూత సా
ద్గుణ్యము నుల్లసత్తరుని
కుంజవరేణ్యము నగ్రగణ్యముఁ. 10

టీ. పుణ్యుఁడు, రామచంద్రుఁడు, అటపోయి = ఆ చిత్రకూట పర్వతమునకుఁ జని, ముదంబునన్ = సంతోషముతో, తాపస + ఉత్తమ = ఋషిపుంగవులకు, శరణ్యము = రక్షణకుఁదగినదియు (ఉనికిపట్టైనదియు), ఉద్ధత = పైకెత్తఁబడిన, బర్హి = నెమిళ్ళ, బర్హ = పింఛములయొక్క, లావణ్యము = విలాసముగలదియు, గౌతమీ = గౌతమీనదియొక్క, విమల = నిర్మలమైన, వాఃకణ = నీటిబిందువులయొక్క, పర్యటన = తిరుగుటచే (ప్రవాహముచే), ప్రభూత = కలిగిన, సాద్గుణ్యము = సద్గుణసంపత్తి (ప్రభావము)కలదియు, ఉల్లసత్ = మిక్కిలి ప్రకాశించు, తరునికుంజ = చెట్లపొదరిండ్లచే, వరేణ్యము = శ్రేష్ఠమైనదియు, అగ్రగణ్యమున్ = అరణ్యములలోఁ జేరెన్నికగాంచినదియు, (అగు), దండక + అరణ్యము = దండక అను పేరుగల అరణ్యమును, కాంచెన్ = చూచెను.

తా. అంత శ్రీరామచంద్రుఁడు దండకారణ్యమున ప్రవేశించెను. అందు ఋషిసత్తము లనేకులు సురక్షితముగ జపతపము లొనర్చుకొనుచుండిరి. నెమిళ్ళు పలువన్నెల నలరారు పింఛముల విప్పి విలాసముగా నృత్యము సేయుచుండెను. గౌతమీనది నిర్మలాంబుబిందువు లెల్లెడ ప్రసరించుటచే దట్టంపుఁజెట్లు, మవ్వంపుఁ బొదలు, కన్నుల పండువు గూర్చుచుండెను.

ఆ వనంబున రాముఁ డనుజసమేతుఁడై
సతితోడ నొక పర్ణశాల నుండ
రావణుచెల్లెలు రతిఁగోరి వచ్చిన
మొగి లక్ష్మణుఁడు దాని ముక్కుఁగోయ
నది విని ఖరదూషణాదులు పదునాల్గు
వేలువచ్చిన, రామవిభుఁడు గలన
బాణానలంబున భస్మంబుగావింప
జనకనందన మేని చక్కఁదనము
విని దశగ్రీవుఁ డంగజవివశుఁ డగుచు
నర్థిఁబంచినఁ బసిఁడిఱ్ఱియై నటించు
నీచు మారీచు రాముఁడు నెఱివధించె;
నంతలో సీతఁ గొనిపోయె నసురవిభుఁడు. 11

టీ. ఆ వనంబునన్, రాముఁడు, అనుజసమేతుఁడు + ఐ = తమ్మునితోఁ గూడినవాఁడై, సతితోడన్ = భార్యయైన సీతతోడ, ఒక పర్ణశాలన్, ఉండన్ = ఉండఁగా, రావణుచెల్లెలు = రావణాసురుని సహోదరి, రతిన్ = సంభోగమును, కోరి, వచ్చినన్, లక్ష్మణుఁడు, మొగిన్ = పూని, దాని = ఆ శూర్పణఖయొక్క, ముక్కున్, కోయన్, అది విని, ఖరదూషణ + ఆదులు = ఖరుఁడు దూషణుఁడు మొదలగు రాక్షసులు, పదునాలుగువేలు, వచ్చినన్ = రాఁగా, (వారిని) రామవిభుఁడు, కలనన్ = యుద్ధమందు, బాణ + అనలంబునన్ = బాణాగ్నిచే, భస్మంబుగావింపన్ = బూడిదగాఁ జేయఁగా, దశగ్రీవుఁడు = పదికంఠములుగల రావణాసురుఁడు, జనకజనందన = జనకమహారాజు కూఁతురగు సీతయొక్క, మేని = శరీరము, చక్కఁదనము = అందమును, విని, అంగజ = మన్మథునికి, వివశుఁడు + అగుచున్ = లొంగిపోయినవాఁడగుచు, అర్థిన్ = కోరి, పంచినన్ = పంపఁగా, పసిఁడి + ఇఱ్ఱి + ఐ = బంగారుజింకయై, నటించు = కపటముగాఁ బ్రవర్తించు, నీచున్ = నీచుఁడగు, మారీచున్ = మారీచుఁడను రక్కసుని, నెఱిన్ =

పరాక్రమముచే, వధించెన్ = చంపివేసెను, అంతలోన్ = ఆలోపల, అసుర విభుఁడు = రాక్షసులరాజైన రావణాసురుఁడు, సీతన్, కొనిపోయెన్ = అపహరించెను.

అట్లు రాముఁడు సీతాలక్ష్మణులఁగూడి దండకారణ్యంబునఁ బోవుచుండఁగాఁ ద్రోవలో విరాధుఁడను రాక్షసుఁడు రామలక్ష్మణులను శిశువులవలెఁ దన భుజంబులపై నిడుకొని వనములోఁ బాఱిపోయెను. సీతాదేవి దుఃఖించుచు వెనుక నిలువఁబడెను. రామలక్ష్మణులు సీతారోదనంబు విని నంతనే విరాధుని భుజంబులు చెరియొకటి ఖండించిరి. విరాధుఁడు పెనుఁగొండవలెఁ గూలెను. అనంతర మా రాక్షసుఁడు తుంబురుండుగాఁ దన పూర్వరూపమునుదాల్చి వెడలిపోయెను. శరభంగ, ధర్మభృత్మ, సుదర్శన, సుతీక్ష్ణ మహర్షుల దర్శించిన తరువాత వా రగస్త్యాశ్రమమున కేఁగిరి. ఆవల నందఱు పంచవటినిఁ జేరిరి. అచ్చట లక్ష్మణుఁడు మట్టితో గోడలుకట్టి వెదురుకంబంబులునాటి తెల్లుగప్పి యొక పర్ణశాల నిర్మించెను. ప్రక్కనే గోదావరి ప్రవహించుచుండెను. అచ్చటికి నొకనాఁడొక్క రక్కసి రామునిఁ జెంతకువచ్చి, 'రామా! నన్ను శూర్పణఖ యందురు, నిన్ను భర్తగా వరించితిని. నన్ను గ్రహింపుము' అని ప్రార్థించెను. రాముఁ డందుల కియ్యకొనక యామెను లక్ష్మణుని చెంతకుఁ బంపెను. లక్ష్మణుఁడు సైత మా శూర్పణఖను నిరాకరించెను. శూర్పణఖ కోపోద్దీపితయై, సీతాదేవిని మ్రింగఁ బూనెను. అది గమనించి లక్ష్మణుఁడు రాముని యాజ్ఞపైఁ గత్తిదూసి యా రక్కసి ముక్కును జెవులును దఱిగెను.

అది రక్తధారలు విపరీతముగా స్రవింప, నేడ్చుచుఁ దన యన్నయగు ఖరునియొద్దకుఁ జనెను.

తన చెలియలికి జరిగిన యవమానమునకుఁ గన్నెఱ్ఱఁ జేసి ఖరుఁడు రోషభీషణుఁడై, పదునల్వురు రక్షోవీరుల శర వేగంబున పంచవటియందలి పర్ణశాలకుఁ బనిచెను. వారందఱు రాముని గాంచి, తమ శూలంబులను విసరిరి. రాముఁడు వానిని స్వీయశరంబులఁ ద్రుంచి పదునాల్గు బాణంబుల రాక్షసులపైకి వదలెను. రాక్షసులెల్ల రొక్కుమ్మడి శ్రీ రాముని బాణాగ్నిజ్వాలలచే భస్మమైరి. అంత ఖరుఁడు తన సేనాని యగు దూషణునితో రథ మారోహించి రాము నితో ఘోరయుద్ధ మొనరించెను. ఆజిలో దూషణుఁడు భుజంబులు తెగి బిట్టఱచుచు నసువులఁ బాసెను. ఖరుఁడు రాముని డీకొని వానిపయి శరవర్షము గురియఁజేసెను. రాముఁడు విజృంభించి శరత్రయంబున ఖరునిశిరంబును ఛేదిం చెను. దేవర్షిగంధర్వాదులు పరమసంతోష మంది శ్రీరాముని వేనోళ్ళ స్తుతించిరి.

అకంపనుఁడను రావణచారుఁడు ఖరదూషణాదులు మరణించుటఁ గూర్చి రావణునకుఁ జెప్పెను. శ్రీరామునిసతి యత్యంతసౌందర్యరాశియనియు నా యింతిని హరించిన ఆమె వియోగమునకు రాముఁడు చివికి నుసియగు ననియు నకంపనుఁ డెఱింగించెను. దశకంఠుఁడు సీతాలావణ్యమునకు ముగ్ధుఁడై, మన్మథవివశుఁడై వెంటనే యామె నపహరింప సమకట్టెను. ఇందులకు రావణుఁడు మారీచుని సాయము గోరెను. మారీచుఁడు క్షణము లోపల బంగారుజింకగా

మాఱి సీతాదేవి చూచునట్లు పర్ణశాలయొద్ద తిరుగాడు చుండెను. సీత యావింత లేడిని దిలకించి దానిని బట్టి తెమ్మని భర్తను గోరెను. ఆ మాయామృగంబును బట్టుటకు వెన్నంటి యది చిక్కనందున, దివ్యాస్త్రము సంధించి రాముఁడు దానిని గుఱిచేసి వైచెను. అప్పుడు నీచుఁడగు మారీచుఁడు నిజరూపముఁ దాల్చి 'హా! సీతా! హా! లక్ష్మణా!' యని రామ స్వరంబున నెలుంగెత్తి యఱచి ప్రాణంబుల విడిచెను. ఆ కేకలు చెవి సోఁకినంతనే సీత లక్ష్మణునిఁ జూచి యన్నను రక్షించుటకుఁ బొమ్మని వేఁడెను. శ్రీరామునకు నేవిధమగు నాపద రాదని లక్ష్మణుఁడెంత చెప్పినను సీత యంగీకరింప లేదు. అందుచే లక్ష్మణుఁ డచటు వాసి యన్న కడకుఁ బోయెను.

లక్ష్మణుం డట్లుపోవుటయే తడవుగా రావణుఁడు సన్యాసివేషము ధరించి సీతను డగ్గఱి యామెను గన్నారఁ గాంచి విస్మయ మందెను. అమాయకురాలగు సీతాదేవి కపటసన్యాసిని సత్కరింపఁగా రావణుఁడు తన్నెఱింగించుకొని స్వీయాభిలాషను వెలిపుచ్చెను. సీతాదేవి కన్నెఱ్ఱచేసి రావణునిఁ గఠినముగాఁ దిరస్కరించెను. కాని రావణుఁ డా పతివ్రతామణి నెత్తికొని తన రథంబునఁ గూరుచుండఁబెట్టి యాకాశమార్గమును ద్రొక్కెను. సీత గుండియ లవియునట్లుగా విలపింప సాగెను.

ఆ యసురేశ్వరుండు వడి
నంబరవీథి నిలాతనూజ న
న్యాయముసేసి నిష్కరుణుఁ
డై కొనిపోవఁగ నడ్డమైన ఘో

రాయతహేతిఁ ద్రుంచె నస
హాయత రామనరేంద్రకార్యద
త్తాయువుఁ బక్షవేగపరి
హాసితవాయువు నజ్జటాయువున్. 12

టీ. ఆ + అసుర + ఈశ్వరుండు = ప్రసిద్ధుఁడగు రాక్షసరాజు (రావణుఁడు), అంబరవీథిన్ = ఆకాశమార్గమున, ఇలా తనూజన్ = పుడమి తనయ యగు సీతను, అన్యాయముచేసి, నిష్కారుణుఁడు + ఐ = దయలేని వాఁడై, కొనిపోవఁగన్ = ఎత్తుకొనిపోఁగా, అడ్డము + ఐన = దారికి నడ్డమువచ్చినట్టి, రామ...దత్తాయువున్, రామ + నర + ఇంద్ర = రాముఁడను రాజుయొక్క, కార్య = పనికిఁగా, దత్త + ఆయువున్ = సమర్పింపఁబడిన ప్రాణములుగలదియు, పక్ష . ...వాయువున్, పక్ష = రెక్కల యొక్క, వేగ = వడిచే, పరిహాసిత = అవమానింపఁబడిన, వాయువున్ = వాయువేగము కలదియు (అగు), ఆ + జటాయువున్ = ఆ జటాయు వను పక్షిరాజును, అసహాయతన్ = ఏవిధమగు సాయములేకున్నను, ఘోర = క్రూరమైనట్టియు, ఆయత = నిడుపైనట్టియు, హేతిన్ = ఆయుధముతో (కత్తితో), త్రుంచెన్ = చంపెను.

తా. రాక్షసరాజైన రావణుఁడు, ఆకాశమార్గమునఁ గరుణవీడి పుడమితనయ నెత్తుకొని పోఁగా నామె రోదనము నాలకించి జటాయువను గృధ్రరాజడ్డుపడెను. ఆపక్షీంద్రుఁడు శ్రీరాముని పనికిఁగాఁ బ్రాణముల నర్పింప సమకట్టెను. జటాయువు బలవంతుఁడు. వాయువును సైతము నవమానించునంతటి త్వరితగమనము గలవాఁడు. కాని రావణునిఁ దలఁకి నప్పుడతని కెట్టి సాయము లేదు. అందుచే రాక్షసేంద్రుఁడు తనయొద్దనున్న కత్తితో జటాయువును గొట్టి క్రిందఁ బడఁద్రోసి, దక్షిణదిశఁబట్టి వెడలిపోయెను.

అంత నా రామచంద్రుఁడు లక్ష్మణసహితుండై సీతను వెదక
నరుదెంచి నిజకార్యనిహతుండైన జటాయువునకుఁ బర
లోకక్రియలు కావించి ఋశ్యమూకంబునకుం జని. 13

టీ. అంతన్, ఆ రామచంద్రుఁడు, లక్ష్మణసహితుండు + ఐ = లక్ష్మణునితోఁ గూడినవాఁడై, సీతన్, వెదకన్, అరుగు + తెంచి=వచ్చి, నిజ = తనయొక్క, కార్య = కార్యమునందు, నిహతుండు + ఐన=చంపఁబడినట్టి, జటాయువునకున్, పరలోకక్రియలు = దహనసంస్కారాదులు, కావించి, ఋశ్యమూకంబునకున్=ఋశ్యమూకము అను పేరుగల పర్వతము చెంతకు, చని = పోయినవాఁడై.

తా. అట రాముఁడు మాయామృగంబును వధించి, సీతను జూచుటకు హుటాహుటిగఁ దిరిగివచ్చెను. ఒంటరిగా సీతను విడిచివచ్చినందులకుఁ దన తమ్ముని నిందించెను; పర్ణశాలకు రాఁగా నందు సీత కనఁబడలేదు. రాముఁడు సీతావియోగము సహింపఁజాలక విలపింపసాగెను. చెట్లను, లతలను, బత్తులను, మృగములను సీతజాడను గుఱించి యడిగి యడిగి వెలుంగెత్తి యేడ్వసాగెను. లక్ష్మణుండు మంచి మాటలచే నన్నను గొంత యోదార్చెను. ఇరువురు సీతాన్వేషణకై బయలుదేఱిరి. వారు త్రోవలో నెత్తుటఁ దోఁగుచుఁ బడియున్న జటాయువును గాంచిరి. ఆ గృధ్రరాజము రామునిఁజూచి 'రామా! ఆశ్రమంబున నీవు లేనివేళ రావణాసురుఁడు సీతాదేవిని హరించి తీసికొనిపోయెను. ప్రతిఘటించిన న న్నాయసురుఁడు తెగటార్చెను. నీవు సీతను శీఘ్రకాలములోనే పడయుదువు' అని కాళ్ళుసాఁచి ప్రాణంబులు వదలెను. తన కార్యంబు కొఱకుఁ జనిపోయిన జటాయువును

శ్రీరాముఁడు గవుంగలించి కరము శోకించి దారువును మథించి రగిల్చిన యగ్నిచేత వానికి దహనక్రియ లొనర్చెను. జటాయువు పుణ్యలోక మొందెను.

అంత రాముఁడు సీతాన్వేషణార్థము తరలి, జనస్థానము దాఁటి క్రౌంచారణ్యమును బ్రవేశించెను. అచ్చట లక్ష్మణుఁడు అయోముఖి యను రక్కసి నుక్కడంచెను. త్రోవలో రామలక్ష్మణులు కబంధుఁడను వికృతరాక్షసునిఁ బొడఁ గాంచిరి. స్థూలశిరుండను మహర్షి శాపవశంబునఁ గబంధుఁడు ఘోరరూపము దాల్చియుండెను. అతఁడు దనుజవంశ సంజాతుఁడైన శ్రీ యనువానికిఁ బుత్త్రుఁడు. రామలక్ష్మణులు ఆ దనుజుని హస్తంబుల రెంటిని ఛేదించిరి. భూనభోఽంత రాళంబులు పిక్కటిల్లునట్లుగా ఆ రక్కసి బొబ్బలిడి, నేలఁ బడి నెత్తుట జొత్తిల్లుచు నిజచరిత్రను రామునకు విన్నవించి "రామా! సుగ్రీవుఁడను వానరముఖ్యుఁడు తన అన్నవలనఁ దఱుమఁబడి కపివీరులఁ బలువురఁ దోడఁగొని, ప్రస్తుతము ఋశ్యమూకపర్వతము నాశ్రయించి యున్నాఁడు. ఆతనితో మైత్రిసేయుము. నీ కార్యము చక్కఁబడు" నని వాక్రుచ్చి స్వస్వరూపము దాల్చి విమానమెక్కి పోయెను. రామలక్ష్మణులు సుగ్రీవుని చెలిమి నభిలషించి పంపాసరోవరంబునకుఁ దరలిరి.

నిగ్రహము వలదు నీకిఁక
నగ్రజు వాలిన్ వధింతు నని నియమముతో
నగ్రేసరుఁగా నేలెను
సుగ్రీవుం జరణఘాతచూర్ణగ్రావున్. 14

టీ. ఇఁకన్=ఇఁకమీఁదట, నీకున్, (సుగ్రీవు నుద్దేశించి), నిగ్రహము = బెదరుట, వలదు = పనిలేదు, అగ్రజున్ = అన్నయైన (పెద్దవాఁడైన), వాలిన్, వధింతున్ = చంపెదను, అని = అని, శ్రీరాముఁడు చెప్పి, నియమముతోన్ = ప్రతిజ్ఞతో (లేక ఏర్పాటుతో), చరణ...గ్రావున్, చరణ = పాదములయొక్క, ఘాత=దెబ్బ (రాపిడిచే) చూర్ణ=పొడియైన, గ్రావున్ = కొండలు కలవాఁడగు, సుగ్రీవున్, అగ్రేసరున్ + కాన్ = మొదటివానిఁగా (గొప్పవానినిఁగా), ఏలెన్ = మన్నించెను.

తా. పంపాసరోవరంబు నందలి ప్రకృతిసౌభాగ్యమునకు శ్రీరామచంద్రుఁడు మురిసిపోయెను. రామలక్ష్మణులు ఋశ్యమూకపర్వతమును సమీపింపఁగనే నిజమంత్రులఁ గూడి పచరించుచుండిన సుగ్రీవుఁడు వారలకు నమస్కరించెను. హనుమంతుఁడు కేలుమోడ్చి "మహాత్ములారా! మా ఱేఁడగు సుగ్రీవునకు వాలి యనుపేరి జ్యేష్ఠభ్రాత గలఁడు. అన్నదమ్ములకు వైరము పొడమెను. అందుచే వాలి తమ్మునిభార్య నపహరించి యాతని గుట్టలకుఁ దఱిమెను. సుగ్రీవుఁడు సూర్యనందనుఁడు. తన యిక్కట్టును దప్పించుకొన మీ సాయ మభిలషించుచున్నాఁ"డని చెప్పెను. లక్ష్మణుని యంగీకారముపై రాముఁడు సుగ్రీవు నాదరించి 'సుగ్రీవా! ఇఁకమీఁద నీవు బెదరవలసిన పనిలేదు. నీ యన్నయగు వాలి దుష్టవర్తనుఁ డగుటచే వానిని వధించి నీ భార్యను నీ కిప్పింతు'నని నమ్మఁ బలికి ప్రతిజ్ఞ గావించెను. సుగ్రీవుఁడు పరమసంతోష మంది శ్రీరామచంద్రునకు నమస్కరించి 'రఘునందనా! ఒకనాఁడు నా సచివులతో నీ పర్వతంబున నుండఁగా "హా! రామా! హా! లక్ష్మణా!"యని దీనరోదనము చేయుచు, మింటితెరవునఁ బోవుచు నెవరో యొక నగల

మూటను గ్రిందికిఁ బడవైచిరి. ఆ మూటను దాఁచి యుంచితిని". అని తెలిపి, ఆ మూటను తత్‌క్షణమే తెప్పించెను. ఆ మూటను గాంచినంతనే రాముని కన్నులఁ గన్నీరు గ్రమ్మెను. ప్రతిదినము వదినె పాదకమలములకు వందన మాచరించు లక్ష్మణుఁడు సీతాదేవి కాలియందెలను మాత్రము గుర్తించెను.

సుగ్రీవుఁడు మహాబలిష్ఠుఁడు. తన కాలిదెబ్బచేఁ గొండలను బిండి గావించునట్టి దిట్ట. కాని యన్నయగు వాలి ఢాక కోర్వలేక పఱతెంచెను. శ్రీరాముని పంపున సుగ్రీవుఁడు కిష్కింధకుఁబోయి వాలిని రెచ్చఁగొట్టి వానితో ద్వంద్వయుద్ధ మాచరించెను. రాముఁడా పోరిలో వాలిని గుర్తింపఁజాలక మిన్నకుండెను. వాలి వ్రేటులకు సుగ్రీవుఁడు వెఱఁగొంది పాఱిపోయెను. రాముఁడు వానింజూచి 'సుగ్రీవా! రూపాలంకార వేషంబుల మీ రిరువు రొక్కటిగా నున్నందున నేను వాలినిఁ జంపలేకపోయితిని; ఈ సారి పొమ్ము; ఈ పూల దండను నీ కంఠమున నలంకరింపుము' అని నచ్చఁబల్కెను. సుగ్రీవుఁడు బిలమును డాసి గర్జించెను. వాలి మిక్కిలి కోపించి భార్యయగు తార చెప్పిన హితవచనంబుల సరకు గొనక బయటకువచ్చి సుగ్రీవునిఁ దార్కొనెను.

లీలన్ రామవిభుం డొక
కోలం గూలంగనేసె గురునయశాలిన్
శీలిన్ సేవితశూలిన్
మాలిన్ వాలిన్ దశాస్యమానోన్మాలిన్. 15

టీ. రామవిభుండు, లీలన్ = విలాసముగా, గురునయశాలిన్ = అధికమైన నీతిగలవాఁడును, శీలిన్ = సద్గుణములు కలవాఁడును, సేవిత = సేవింపఁబడిన, శూలిన్ = శివుఁడు గలవాఁడును (శివభక్తుఁడని అర్థము), దశ + ఆస్య = పదిముఖములుగల రావణాసురునియొక్క, మాన + ఉన్మూలిన్ = గర్వమును హరించినవాఁడును (అగు), వాలిన్ = వాలిని, ఒకకోలన్ = ఒక బాణముచే, కూలన్ + కన్ = మరణించునట్లుగా, ఏసెన్ = కొట్టెను.

తా. వాలిసుగ్రీవుల పోరుచే భూనభోఽంతరాళములు దద్దరిల్లెను. వాలి బలగర్వితుఁడు. ఒకప్పుఁడు దశకంఠుని దర్పము నడంచి బుద్ధిచెప్పిన యోధుఁడు. నీతినిఁ బాటించువాఁడు; సద్గుణములు గలవాఁడు; ఎల్లప్పుడు శివుని సేవించు భక్తుఁడు. రెండవ ద్వంద్వయుద్ధమున సుగ్రీవునిబలము క్రమక్రమముగా సన్నగిలసాగెను. అదిచూచి శ్రీరాముఁడు దివ్యశరంబును సంధించి వాలి ఱొమ్మునఁ గొట్టెను. వాలి క్షణమాత్రమున నేలఁబడెను. అది విని, తార వాలిని సమీపించి యేడ్చెను. రాముని మాటపై సుగ్రీవుఁ డన్నకు దహనసంస్కారములు గావించెను. అనంతరము రాముఁడు సుగ్రీవునకుఁ బట్టాభిషేకము గావించెను.

ఇలమీఁద సీత వెదకఁగ
నలఘుఁడు రాఘవుఁడు పనిచె హనుమంతు నతి
చ్ఛలవంతున్ మతిమంతున్
బలవంతున్ శౌర్యవంతుఁ బ్రాభవవంతున్. 16

టీ. అలఘుఁడు = గొప్పవాఁడైన, రాఘవుఁడు, ఇలమీఁదన్ = భూమిమీఁదన్, సీతన్, వెదకఁగన్, అతి + ఛల + వంతున్ = మహామాయావియు, (మాయావులయెడ మాయను బ్రయోగింపఁగలవాఁడు), మతి

మంతున్ = సునిశితబుద్ధికలవాఁడును, బలవంతున్ = బలముగలవాఁడును, శౌర్యవంతున్ = పరాక్రమము గలవాఁడును, ప్రాభవవంతున్ = ఉన్నత వంశ సంజాతుఁడును (అగు) హనుమంతున్, పనిచెన్ = పంపెను.

తా. అప్పుడు వర్షాకాల మైనందున శ్రీరాముఁడు ప్రస్రవణగిరియందు నివసించెను. తదుపరి సుగ్రీవుఁడు వానర వీరుల రావించి శ్రీరాముని దర్శించెను. సీతాన్వేషణార్థము పుడమి నంతయు గాలింపఁ బెక్కురు బయలు దేఱిరి. శ్రీరాముఁడు వానరులలో సమర్థుఁడగు హనుమంతుని లంకకై పునకంపెను.

అలవాటుకలిమి మారుతి
లలితామితలాఘవమున లంఘించెను శై
వలినీగణసంబంధిన్
జలపూరితధరణిగగనసంధిం గంధిన్. 17

టీ. అలవాటు కలిమిన్ = అభ్యాసముకలిగి యుండుటచే, మారుతి = హనుమంతుఁడు, లలిత = ఒప్పిదమైన (విలాసయుక్తమైన), అమిత = మిక్కిలి లాఘవమునన్ = తేలికగా, శైవలినీ + గణ = నదీసమూహముతో, సంబంధిన్ = సంబంధముకలదియు, జలపూరిత = జలముచే నింపఁబడిన, ధరణి = భూమికిని గగన = ఆకాశమునకును గల, సంధిన్ = కలయికకలదియు (అగు) కంధిన్ = (జలమునకు స్థానమైన) సముద్రుని, లంఘించెను = దాఁటెను.

తా. మారుతి మహేంద్రగిరి నారోహించి కట్టెదుట సముద్రునిఁ గాంచెను. భూలోకమునఁ బ్రవహించు నదులెల్ల నా విశాలజలనిధిం జొచ్చును. భూమ్యాకాశములను నీరముచే సంధించినట్లు గాన్పించెను. హనుమంతుఁడు సీతాదేవిని వెదకు కోరికతో లంఘించుటయందు నభ్యాసముగలవాఁడు

గానఁ జులకనగా నా సముద్రుని దాఁటెను. త్రోవలో వాయు నందనుఁడు దేవతలపంపునఁ దనకడ్డమువచ్చిన సురస నోటి నుండి దూఱి, మార్గమధ్యమున సింహికను భర్జించి, ముఖ ద్వారముననున్న లంకిణిని నిర్జించి, రావణాంతఃపురమును బ్రవేశించెను. అచ్చట సీత కనఁబడలేదు. నగరమంతయు హనుమంతుఁడు గలయఁజూచి యశోకవనమందు నొక వృక్షముక్రింద మలినవస్త్రము దాల్చి, కన్నీరొలికించుచున్న స్త్రీనిఁ గాంచి చెట్టుపైని డాఁగెను. రావణుఁ డచ్చోటికి వచ్చి సీతను దన్నుఁ బ్రేమింపం బరిపరివిధములఁ గోరి యామెచేఁ దిరస్కరింపఁబడి యామెకు రెండునెలలు గడు విచ్చి వెడలిపోయెను. సీత నిజనాథునిఁ దలంచి వాపోయెను. హనుమంతుఁడంత వృక్షమునుండి దుమికి నిజస్వరూపమును సీతాదేవి కెఱుకపఱిచి శ్రీరాముఁ డానవాలుగాఁ బంపిన ముద్దుటుంగరము నామె కొసంగి "తల్లీ! అలంతికాలమున నీవు నీపతినిఁ జేరఁగలవు. చింత వీడుము. రామలక్ష్మణులకు నేఁ జెప్పఁదగిన దేమియో సెలవిమ్ము" అని విన్నవించెను. సీత కొంగుముడి విప్పి చూడామణిని మారుతి కొసంగి, "నా దుర వస్థను శ్రీరామలక్ష్మణులకు నివేదింపుము. ఈ చూడామణిఁ గాంచినంతనే నాపతి నీ సందేశమును సత్యముగా నెఱుంగును. నాకు దశకంఠుఁడు రెండునెలలుమాత్రము గడువిచ్చెనని నా భర్తతో నొక్కివక్కాణింపుము. నీకు శుభంబగుఁగాక!" అని చెప్పెను.

ఇట్లు సముద్రంబుదాఁటి సీతంగని, హనుమంతుండు దిరిగి
చనుదెంచుచు నక్షకుమారాదుల వధియించి. 18

టీ. ఇట్లు, సముద్రంబు, దాఁటి, సీతన్, కని, హనుమంతుఁడు, తిరిగి, చను + తెంచుచున్ = వచ్చుచు, అక్షకుమార + ఆదులన్ = అక్షకుమారుఁడు మొదలైన రాక్షసులను, వధియించి = చంపి.

తా. హనుమంతుఁడంతఁ బ్రమదావనంబును ధ్వంసము గావించెను. అది విని రావణుఁడు కినిసి విరూపాక్షాదిరాక్షసవీరులను అంజనీసూనునిపైకిఁ బంపెను. వారు ఆంజనేయుని ధాటికోర్వలేక తిరిగివచ్చిరి. రావణుఁడంత తన పుత్రుఁడగు నక్షకుమారునిఁ బనిచెను. ఆతని పాదంబులను హనుమంతుఁ డొడిసిపట్టి నేలబాదెను. అక్షకుమారుఁడు బాహువులు విఱిగి తొడలు చీలి శిరస్సు వ్రీలి ముద్దయి కూలెను. అందుపై రావణుఁడు తన పుత్త్రుఁడగు నింద్రజిత్తును రావించి యాతని యుద్ధమునకుఁ బురికొల్పెను. ఇంద్రజిత్తు సింహనాదం బొనర్చి బ్రహ్మాస్త్రముచే హనుమంతుని బంధించి రావణుని చెంతకుఁ గొనివచ్చెను. సభలోని రాక్షసులెల్లరు మారుతినిఁ జంపుమనిరి కాని, రావణుని తమ్ముఁడగు విభీషణుఁడు దూతను జంపకూడదని హితోపదేశము గావించెను. రావణుఁడు వాయుసుతున కంగవికృతినిఁ బొరయించు నుద్దేశముతో నాతని తోఁకకు నిప్పుపెట్టి తఱుమున ట్లాజ్ఞాపించెను.

సముద్రగత ననిలసుతుం
డమరాహితదత్త వాలహస్తాగ్నుల భ

స్మము సేసె నిరాతంకఁ
సమదాసురసుభటవిగతశంకఁ లంకఁ. 19

టీ. అనిలసుతుండు = హనుమంతుఁడు, సముదగ్రతన్ = మిక్కిలి భయంకరముగా, అమర + అహిత = దేవతలకు వైరులైన రాక్షసులవలన, దత్త = కూర్పఁబడిన, వాల + హస్త + అగ్నులన్ = తోఁక చేతులు-వీనినిఁ జుట్టుకొనియున్న యగ్నిజ్వాలలచే, నిరాతంకఁ = భయములేనట్టిదియు, సమదా......శంకన్, సమద = గర్వముతోఁగూడిన, అసురసుభట = రాక్షసులలోని యోధశ్రేష్ఠులవలన, విగతశంకన్ = పోఁగొట్టఁబడిన విచారము కలిగినదియు (అగు) లంకఁ = లంకాపట్టణమును, భస్మము చేసెను = బూడిద గావించెను.

తా. రక్కసులు వెంటనే నూనెలోఁ దడిపిన చింపి గుడ్డలు హనుమంతుని తోఁకకుఁ జుట్టి నిప్పంటించి తఱిమివైచిరి. హనుమంతుఁడు కడింది బెట్టిదముగా నార్చి లంకను గలయఁజూచెను. రాక్షసులు తన వాలహస్తముల రగిల్చిన యగ్నిజ్వాలలచే లంకానగరమందలి సుందరభవనములను గోటలను వనములను గాల్చి బూడిదగావించెను. పాతివ్రత్య మహిమమున సీతకుమాత్ర మెట్టికీడును గలుగలేదు. లంకను వీడుటకు ముందు హనుమంతుఁడు సీతాదేవినిఁజూచి యామె యాశీర్వాదములఁ బడసి శరవేగంబున సముద్రుని లంఘించి కిష్కింధకుఁ జేరెను.

ఇట్లు లంకాదహనంబు సేసివచ్చి వాయుజుండు సీతాకథనంబు సెప్పిన విని రామచంద్రుండు, వనచరనాథయూథంబులుం దానును జని చని. 20

టీ. ఇట్లు, లంకాదహనంబుసేసి = లంకను కాల్చివైచి, వచ్చి, వాయుజుండు = హనుమంతుఁడు, సీతాకథనంబు = తాను సీతనుగాంచిన విధము, చెప్పినన్, విని. రామచంద్రుఁడు, వనచరనాథ = కోఁతులఱేని యొక్క (సుగ్రీవుని) యూథంబులున్ = సేనలును, తానును, చనిచని = పోయిపోయి.

తా. సముద్రుని కటుప్రక్క మారుతిరాకకు నంగదాదులు కాచుకొని యుండిరి. హనుమంతుఁడు కనఁబడఁగనే వానరవీరులు తహతహపడి యొక్కుమ్మడి మూఁగిరి. "కంటిన్ జానకి"ని అని వాయుసుతుఁడు బిగ్గఱగా నఱచెను. ఎల్లరు సంతోషముతో గంతులిడిరి. హనుమంతుఁ డంత సీతాదేవి వృత్తాంతంబును దన చరిత్రను సంగ్రహముగాఁ జెప్పి యంగదునిఁ గౌఁగిలించెను. అందఱు సుగ్రీవునికడ కేఁగి యీ శుభవార్తను దెలిపిరి. సుగ్రీవాదులు శ్రీరాముని డాసిరి. హనుమంతుఁడు "చూచితిని సీతాదేవిని; ఆ తల్లి సుఖమున్న"దని శ్రీరామునకుఁ జెప్పి ఆమె దుఃస్థితిని వర్ణించి చూడామణి నొసంగెను. ఆ రతనంబు నక్కునఁ గదించి సీతాపునస్సంగమసుఖం బబ్బినట్లు శ్రీరాముఁడు తలపోసెను. వానరసేనలు యుద్ధసన్నద్ధము లయ్యెను. శ్రీరాముఁడు లక్ష్మణునితో సుగ్రీవాదులఁగూడి వానరబలఁగముతో సముద్రుని చెంతకుఁ బయన మయ్యెను.

ఆ రాజేంద్రుఁడు గాంచె భూరివిధర
త్నాగారముం మీనకుం
భీరగ్రాహకఠోరమున్ విపులగం
భీరంబు నభ్రభ్రమ

ఘోరాన్యోన్యవిభిన్నభంగభవని
ర్ఘోషచ్ఛటాంభఃకణ
ప్రారుద్ధాంబరపారమున్ లవణపా
రావారముం జేరువన్. 21

టీ. ఆ రాజ + ఇంద్రుఁడు=ఆ నృపశ్రేష్ఠుఁడు, చేరువన్=దగ్గఱనే, భూరివిధ = అనేకవిధములైన, రత్న + ఆగారమున్ = రత్నములకు స్థానమైనదియు, మీన = చేఁపలు, కుంభీర = మొసళ్ళు, గ్రాహ = ఒకవిధమైన నీరుపాములచే, కఠోరమున్=భయంకరమైనదియు, విపులగంభీరంబున్ = మిక్కిలి లోఁతైనదియు, అభ్ర=ఆకాశమందు భ్రమత్=తిరుగుచుండుటచే, ఘోర = భయంకరముగా, అన్యోన్య = పరస్పరము, విభిన్న = మిక్కిలి విరిసిన (విస్తరించిన) భంగ = అలలనుండి, భవ = పుట్టిన, నిర్ఘోష + ఛట= శబ్దసమూహముగల, అంభః + కణ = నీటి తుంపురలచే, ప్రారుద్ధ=లెస్సగా నరికట్టఁబడిన, అంబర = ఆకాశముయొక్క, పారమున్=అవధిగలదానిని, లవణ పారావారమున్ = ఉప్పుసంద్రమును, కాంచెన్ = చూచెను.

తా. శ్రీరాముఁడు సముద్రుని సమీపించెను. సాగరుఁడు పెద్దవియు ననేకవిధములైన రత్నములకు స్థానమైనవాఁడు. చేఁపలు మొసళ్ళు నీటిపాములచే మిక్కిలి భయంకరమైనవాఁడు. కడిఁది లోఁతైనవాఁడు. అత్తఱి నాకాశమును స్పృశించు బెట్టిదంపుటలలనుండి పుట్టిన సవ్వడి మొత్తమ్ములుగల నీటితుంపురులచే నింగి పార మరికట్టఁబడినట్లుండెను.

కని తనకుఁ ద్రోవ యిమ్మని వేఁడిన నదియు మార్గంబు సూపక
మిన్నందిన యూరాచపట్టి రెట్టించిన కోపంబున. 21

టీ. కని = శ్రీరాముఁడా సముద్రునిఁ గాంచి, తనకున్, త్రోవ = దారి, ఇమ్ము + అని, వేఁడినన్ = ప్రార్థించిన, అదియున్ = ఆ సముద్రము, మార్గంబు, చూపక, మిన్ను + అందినన్ = ఆకాశమంటినట్లు గర్వింపఁగా, ఆరాచపట్టి = ఆ రాజకుమారుఁడు, రెట్టించిన = రెండింతలైన, కోపంబునన్ = కోపముతో.

తా. శ్రీరాముఁడు సముద్రునితోఁ దాను లంకకేఁగుటకు దారియిమ్మని ప్రార్థించెను. సముద్రుఁడు గర్వించి మార్గంబు చూపకుండెను. అందుమీఁద రామునికోపము రెండింత లయ్యెను.

మెల్లని నగవున నయనము
లల్లార్చి శరంబు విల్లు నందినమాత్రన్
గుల్లలు నాఁచులుఁ జిప్పలుఁ
బెల్లలునై జలధి పెద్దబీడై యుండెన్. 22

టీ. మెల్లని నగవునన్ = చిఱునవ్వుచే, నయనములు = కన్నులు, అల్లార్చి = కదలించి, శరంబు = బాణమును, విల్లు + అందిన + మాత్రన్ = వింటియందుఁ బెట్టఁబడిన మాత్రముననే, గుల్లలు = కప్పచిప్పలు, నాఁచులు = తీఁగ పాఁచిచిప్పలు, పెల్లలు = మట్టితునకలు, (గలదియై) జలధి = సముద్రము, పెద్దబీడు + ఐ = పెద్ద బీటినేలవంటిదై, ఉండెన్.

తా. కొంతతడవునకు శ్రీరాముఁడు చిఱునవ్వు నవ్వి కన్ను లల్లార్చి తనవింటను బ్రహ్మాస్త్రము సంధించెను. అంత మాత్రమునకే సముద్రములోనున్న కప్పచిప్పలు, తీఁగపాచి, పలువిధములగు చిప్పలధికములై యా జలనిధి పెద్దబీడుగాఁ బొడకట్టెను. జలధిలోని నీరంతయు నింకిపోయెను!

ఇట్లు విపన్నుండగు సముద్రుండు నదులతోఁగూడి మూర్తి మంతుండయి చనుదెంచి రామచంద్రుని చరణంబులు శరణంబుఁ జొచ్చి యిట్లని స్తుతియించె. 22

టీ. ఇట్లు, విపన్నుండు + అగు = ఆపద నొందినట్టి, సముద్రుండు, నదులతోన్, కూడి, మూర్తిమంతుండు + అయి = నిజస్వరూపము నొందినవాఁడై, చనుదెంచి = వచ్చి, రామచంద్రుని చరణంబులు = శ్రీరాముని పాదములను, శరణంబు = దిక్కు, చొచ్చి, ఇట్లు + అని = ఈ క్రిందివిధముగా స్తుతియించెన్ = పొగడెను.

తా. ఆపదలో మునింగిన సముద్రుఁడు తనలో సంగమించు నదులు వెంటరా స్వస్వరూపముతో వచ్చి శ్రీరాముని పాదపద్మములపై వ్రాలి శరణుచొచ్చి ఇట్లని పొగడెను.

ఓ కాకుత్స్థకులేశ! యో గుణనిధీ!
యో దీనమందార! నే
నీ కోపంబున కెంతవాఁడ, జడధిన్
నీవేమి భూరాజవే!
లోకాధీశుఁడ వాదినాయకుఁడ వీ
లోకంబు లెల్లప్పుడున్
నీ కుక్షిం బ్రభవించుచుండు నడఁగున్
నిక్కంబు సర్వాత్మకా! 23

టీ. ఓ కాకుత్స్థకుల + ఈశ = కకుత్స్థవంశమునందు శ్రేష్ఠుఁడవైన ఓ రామా! ఓ గుణనిధీ = సద్గుణముల కాకరమైనవాఁడా! ఓ దీనమందార! = దిక్కు లేనివారికిఁ గల్పవృక్షము వంటివాఁడా! నేన్ = నేను, నీ కోపంబున కున్, ఎంత వాఁడన్ = ఏమాత్రపువాఁడను, జడధిన్ = (మందబుద్ధిని)

నీటికి స్థానమైనవాఁడను, నీవు + ఏమి = నీవన్ననో, భూరాజవు + ఏ = భూమిని పరిపాలించు ప్రభుఁడవు మాత్రమే కాదు, లోక + అధీశుఁడవు = లోకములకెల్ల నాథుఁడవు, ఆదినాయకుఁడవు = సృష్టికిఁ బూర్వమునుండి యధిపతివి, ఎల్లప్పుడున్, ఈ లోకంబులు, నీ కుక్షిన్ = నీ కడుపునందు, ప్రభవించున్ = పుట్టును, ఉండున్, అడఁగున్ = నశించిపోవును, సర్వ + ఆత్మకా = అన్నిటియందు జీవముకలవాఁడా! నిక్కంబు = ఇది నిజము.

తా. శ్రీరామా! నీవు కకుత్స్థవంశశ్రేష్ఠుఁడవు; సద్గుణములకు నాకరమైనవాఁడవు; దిక్కులేనివారికిఁ గల్పవృక్షమువంటి వాఁడవు; నేను నీ కోపమునకు నెంతమాత్రపు వాఁడను? నేను నీటికి స్థానమైన క్షుద్రుఁడను. నీవన్ననో భూచక్రమేలెడి మహారాజవు మాత్రమే కాదు; నీ గర్భమందు సర్వచరాచరంబులు పుట్టుచున్నవి; మనుచున్నవి; తుదకు నశించిపోవుచున్నవి; నీవు సర్వాత్మకుఁడవు; ఇది సత్యము.

ధాతల రజమున, దేవ
వ్రాతము సత్త్వమున, భూతరాశి దమమునన్,
జాతులఁగా నొనరించు గు
ణాతీతుఁడ వీవు గుణగణాలంకారా! 24

టీ. గుణగణ = సుగుణముల మొత్తము, అలంకారా = అలంకారముగాఁ గలవాఁడా! ధాతలన్ = బ్రహ్మలను, రజమునన్ = రజోగుణమునందును, దేవవ్రాతమున్ = దేవ గణములను, సత్త్వమునన్ = సత్త్వ గుణమునందును, భూతరాశిన్ = సర్వ భూతములను (జీవములను) తమమునన్ = తమోగుణమునందును, జాతులన్ + కాన్ = పుట్టినవారినిఁగా, ఒనరించు = చేయు, గుణ + అతీతుఁడవు = నిర్గుణబ్రహ్మ స్వరూపుఁడవు.

తా. సుగుణములచే నలంకృతుఁడవైన ఓ రామా! బ్రహ్మలను రజము నందును, దేవగణములను సత్త్వము నందును, సర్వభూతములను దమ మందును బుట్టునట్లుచేయు గుణాతీతుఁడవు; నీవు మహాత్ముఁడవు.

కట్టుము సేతువ, లంకం
జుట్టుము, నీ బాణవహ్ని సురవైరి తలల్
గొట్టుము నేలఁబడఁ, జే
పట్టుము నీయబల నధికభాగ్యప్రబలన్. 25

టీ. సేతువు + అ = నీటికట్టను (వంతెనను), కట్టుము = నిర్మింపుము, లంకన్, చుట్టుము = ముట్టడివేయుము, నీ బాణవహ్నిన్ = నీయొక్క బాణములను అగ్నిచే, సురవైరితలల్ = రాక్షసుని (దశకంఠుని) శిరస్సులను, నేలన్ + పడన్ = భూమిమీఁదఁ బడునట్లుగా, కొట్టుము, నీ అబలన్ = నీ భార్యయగు సీతను, అధికభాగ్యప్రబలన్ = మిక్కిలి సంపదచే నతిశయించుదానిని, చేపట్టుము = స్వీకరింపుము.

తా. "నాపైన వంతెనను నిర్మింపుము. లంకా పట్టణమును ముట్టడివేయుము. నీ శరాగ్నిచే రక్కసుల శిరస్సులు నేలమీఁదఁబడి దొరలునట్లుగాఁ గొట్టుము. నీ భార్యను స్వీకరింపుము".

హరికి మామ నగుదు, నటమీఁద శ్రీదేవి
తండ్రి, నూరకేల తాగడింపఁ?
గట్టఁగట్టి దాఁటు కమలాప్తకులనాథ!
నీ యశోలతలకు నెలవుగాఁగ. 26

టీ. హరికిన్ = విష్ణువునకు, మామన్, అగుదున్, అటమీఁదన్ = ఆ పైన, (నేను) శ్రీదేవితండ్రిన్ = లక్ష్మీదేవియొక్క తండ్రిని అగుదును, ఊరక + ఏల, తాకు + గడింపన్ = పీడించుట, కట్టన్ = సేతువును, కట్టి, కమల + ఆ ప్తకుల = సూర్యకులమునకు, నాథ = ప్రభువైనవాఁడా! నీ = నీయొక్క, యశస్ + లతలకు = కీర్తియను తీఁగెలకు, నెలవు కాఁగన్ = స్థానము కాఁగా, దాఁటు = దాఁటుము.

తా. "విష్ణువునకు నేను మామ నగుదును. అదిగాక లక్ష్మీదేవి తండ్రిని. నన్నుఁ బీడించుట యెందులకు? ఓ సూర్యవంశవిభూ! సేతువును నిర్మించి నీ యశోవల్లికకుఁ దగినట్లు నన్ను లంఘింపుము. మీలో సేతుబంధనంబునకు నీలుఁడు సమర్థుఁడు. ఆతఁడు వాని తండ్రియైన విశ్వకర్మ వలన సమస్తశిల్పవిద్యలు నేర్చియున్నాఁడు. నీవు నిర్మించు సేతువును మునుఁగకుండునట్లు నేను భరింతును.

అని విన్నవించిన రామచంద్రుండు సముద్రునిం బూర్వ ప్రకారంబున నుండు పొమ్మని వీడుకొల్పెను. అంత. 27

టీ. అని, విన్నవించిన = మనవి పూర్వకముగాఁ జెప్పిన, రామచంద్రుండు, సముద్రునిన్, పూర్వప్రకారంబునన్, ఉండు, పొమ్ము + అని, వీడుకొల్పెను = పోవ ననుజ్ఞ ఇచ్చెను. అంత = ఆ పిమ్మట.

తా. అని మనవిపూర్వకముగా సముద్రుఁడు చెప్పిన మీఁద శరణాగతవత్సలుండగు శ్రీరామచంద్రుఁ డాతనిఁ గరుణించి పూర్వమట్లు స్వస్థానమున నుండు పొమ్మని యనుజ్ఞ యిచ్చెను.

ఘనశైలంబులుఁ దరువులు
ఘనజవమునఁ బెఱికి తెచ్చి కపికులనాథుల్
ఘనజలరాశిం గట్టిరి
ఘనవాహప్రముఖదివిజగణము నుతింపన్. 28

టీ. కపికులనాథుల్=కపివంశశ్రేష్ఠులు, ఘన=గొప్పవైన, శైలంబులున్ = కొండలను, తరువులున్ = చెట్లను, ఘనజవమునన్ = మిక్కిలి వేగముతో, పెఱికి, తెచ్చి, ఘనవాహ = మేఘము వాహనముగాఁ గల యింద్రుఁడు, ప్రముఖ = మొదలుగాఁ గల, దివిజగణము = దేవతాసమూహము, నుతింపన్=పొగడఁగా, ఘనజలరాశిన్= పెద్దసముద్రునిపై, కట్టిరి= సేతువును నిర్మించిరి.

తా. అటు పిమ్మటఁ గపివంశశ్రేష్ఠులెల్లరు సన్నాహపడి, పెద్దపెద్ద కొండలను, చెట్లను, మిక్కిలి వేగముతోఁ బెఱికి తెచ్చి నీలుని సాయముచే ఘనుఁడగు సముద్రునిపై సేతువును గట్టిరి. ఐదు దినంబులలో నిర్మాణము పూర్తియయ్యెను. అనంతరము రాముఁడు లక్ష్మణసుగ్రీవసహితుఁడై సేనాగ్రభాగంబునఁ దరలెను. వానరసైన్యము వారివెంట నడచెను. దేవేంద్రదేవతాగణములు సేతునిర్మాణమునకు నబ్బురంపడి పుష్పవృష్టి గురిసి స్తుతింప సాగిరి. ఎల్లరు సురక్షితముగా దక్షిణాతీరమును జేరిరి.

ఇట్లు సముద్రంబు దాఁటి రామచంద్రుండు రావణు తమ్ముండైన
విభీషణుండు శరణంబు వేఁడిన నభయం బిచ్చి కూడుకొని
లంకకుఁ జని విడిసి వేడెపెట్టించి, లగ్గలు పట్టించిన. 29

టీ. రామచంద్రుఁడు, ఇట్లు, సముద్రంబు, దాఁటి, రావణు, తమ్ముండు + ఐన, విభీషణుండు, శరణంబు, వేఁడినన్ = ప్రార్థింపఁగా,

అభయంబు + ఇచ్చి, సూడుకొని, లంకకుఁ, చని, విడిసి = దారిలో నొక చోట నిలిచి, వేడెము + పెట్టించి = పరివేష్టింపఁజేసి, లగ్గలు + పట్టించిన = ప్రాకారములను దాఁటుటకై యేర్పాటులు చేయించిన.

తా. లంకాదహనానంతరము రావణుఁడు సమస్త రాక్షసవీరుల రావించి సభచేసెను. అందఱును రామునితో యుద్ధముచేయుటయే కర్తవ్యమని బోధించిరి. కాని రావణుని తమ్ముఁడు విభీషణుఁడు మాత్రము సీతను గొనిపోయి రామున కర్పించి శరణువేఁడుట ధర్మమని వచించెను. దురాత్ముఁడగు రావణుఁ డద్దాని కియ్యకొనక కినిసి సోదరుని లంకనుండి తఱిమివైచెను. విభీషణుఁడు శ్రీరాముని పాదకమలంబులపై వ్రాలి శరణు గోరెను. శ్రీరాముఁడు విభీషణుని వృత్తాంతము సమగ్రముగా నాలకించి యాతని కభయమిచ్చెను. ఎల్లరును లంకఁ జేరిరి. ఒకచో విశ్రాంతిగొఱకు పరివేష్టించిరి. ఆవల లంకానగరమందలి ప్రాకారములను దాఁటిపోయిరి.

ప్రాకారములు ద్రవ్వి పరిఖలు పూడిచి
కోటకొమ్మలు నేలఁగూలఁద్రోచి
వప్రంబు లగలించి వాకిళ్ళు వెకలించి
తలుపులు విఱిచి యంత్రములు సెఱిచి
ఘనవిటంకంబులు ఖండించి పడవైచి
గోపురంబులు నేలఁగూలఁదన్ని
మకరతోరణములు మహిఁగూల్చి కేతనం
బులు సించి సోపానములు గదల్చి
గృహములెల్లవ్రచ్చి గృహరాజములఁ జొచ్చి
భర్మకుంభచయము పాఱవైచి

కరులు కొలను సొచ్చి కలఁచిన కైవడిఁ
గపులు లంకఁ జొచ్చి కలఁచి రపుడు. 30

టీ. కపులు = కోఁతులు, కరులు = ఏనుఁగులు, కొలను = తటాకమును, చొచ్చి = ప్రవేశించి, కలఁచిన కైవడిన్ = కలపెట్టిన విధముగా, ప్రాకారములు = చుట్టుగోడలను, త్రవ్వి, పరిఖలు = అగడ్తలును, పూడిచి = మూసివేసి, కోటకొమ్మలు = కోటబురుజులు, నేలన్ = భూమిమీఁద, కూలన్ = కూలునట్లుగా, త్రోచి = త్రోచివైచి, వప్రంబులు = కోటలను, అగలించి = పగులఁగొట్టి, వాకిళ్ళు, పెకలించి, తలుపులు విఱిచి, యంత్రములు, చెఱిచి, ఘనవిటంకంబులు = గువ్వగూఁడులను, ఖండించి = నఱికి, (తుంటలుగాఁ జేసి), (వానిని), పడవైచి, గోపురంబులు, నేలన్, కూలన్, తన్ని, మకరతోరణములు = మొసలి యాకృతిగల తోరణములు, మహిన్ = భూమిపైన, కూల్చి = నాశనముచేసి, కేతనంబులు = టెక్కెములను, చించి, సోపానములు = (మిద్దె) మెట్లులను, కదల్చి, గృహములు + ఎల్లన్ = అన్ని గృహములను, వ్రచ్చి = బ్రద్దలుచేసి, గృహరాజములను = పెద్దపెద్ద యిండ్లను, చొచ్చి = ప్రవేశించి, భర్మ = బంగారుతోఁ జేయఁబడిన, కుంభచయము = కుండల మొత్తములను, పాఱవైచి, లంకన్, చొచ్చి, కలఁచిరి = క్షోభిల్లఁజేసిరి.

తా. ఏనుఁగులు కొలను బ్రవేశించి కలపెట్టినవిధముగాఁ గపివీరులు లంకానగరమును జొచ్చి చుట్టుగోడలను ద్రవ్విరి; అగడ్తలను బూడ్చివైచిరి; నగరమునకుఁ జుట్టియున్న యెత్తైన గోడలను బెకలించిరి; కోటకొమ్మలను నేలమీఁదఁబడి దొరలునట్లుగాఁ ద్రోచివైచిరి; కోటలను బగులఁగొట్టిరి; ఇంటి వాకిళ్ళను బెఱికిరి; తలుపులను విఱిచిరి; మేడలందు నిర్మించిన జలయంత్రములను జెఱిచి చెండాడిరి; గువ్వగూఁడులను దుంటలుతుంటలుగా ఖండించి క్రిందకుఁ ద్రోసిరి; గోపురంబులు భూమిపైఁ బడునట్లుగాఁ దన్నిరి; గృహమందుఁగట్టిన

పచ్చని మకరతోరణములను బూత్రిగాఁ ద్రెంచివైచిరి; బెక్కెములను జించిరి; మిద్దెమెట్లను గదల్చి యిండ్లను బ్రద్దలు చేసిరి; ధనికగృహములలోని బంగారుకుండలను బాఱవైచి లంకాపట్టణమును గగ్గోలు గావించిరి.

అంత నయ్యసురేంద్రుండు పంచినఁ గుంభనికుంభధూమ్రాక్ష విరూపాక్షసురాంతకనరాంతకదుర్ముఖప్రహస్తమహాకాయ ప్రముఖులగు దనుజవీరులు శరశరాసనతోమరగదాఖడ్గ శూలభిందిపాలపరశుపట్టిసప్రాసముసలాదిసాధనంబులు ధరి యించి మాతంగతురంగస్యందనసందోహంబుతోఁ బవ రంబు సేయ సుగ్రీవపవనతనయపనసగజగవయగంధమాదన నీలాంగదకుముదజాంబవదాదు లా రక్కసుల నెక్కటి కయ్యంబులందుఁ దరుల గిరుల గదాఘాతంబుల నుక్కడంచి త్రుంచి రంత. 31

టీ. అంతన్, ఆ+అసుర+ఇంద్రుఁడు = ఆ రాక్షసులరాజైన రావణుఁడు, పంచినన్ = పంపఁగా, కుంభ, నికుంభ, ధూమ్రాక్ష, విరూపాక్ష, సురాంతక, (దేవతలకు యమునివంటివాఁడు), నరాంతక (మానవులకు యమునివంటివాఁడు), దుర్ముఖ, ప్రహస్త, మహాకాయ, ప్రముఖులు = లోనగు, దనుజవీరులు = రాక్షసయోధులు, శర = బాణములను, శరాసన = విల్లులను, తోమర = చిల్లకోలలను, గదా = గదలను, ఖడ్గ = పెద్దకత్తులను, శూల = త్రిశూలములను, భిందిపాల = విడిచివాటు గుదియలను, పరశు = గండ్రగొడ్డళ్ళను, ప్రాస = ఈఁటెలను, ముసల = రోఁకళ్ళను, ఆది = మొదలగు, సాధనంబులు = ఉపకరణములను, ధరించి = తాల్చి, మాతంగ = ఏనుఁగులు, తురంగ = గుఱ్ఱములు, స్యందన = రథములయొక్క, సందోహముతో = మొత్తముతో, బవరంబు = యుద్ధము, చేయన్ = చేయఁగా, సుగ్రీవ, పవనతనయు = హనుమంతుఁడు. పనస, గజ, గవయ, గంధమాదన,

నీల, అంగద, కుముద, జాంబవత్, ఆదులు = మొదలగువారు, ఆ రక్కసులన్ = ఆ రాక్షసులను, నెక్కొటి = తీవ్రమైన, కయ్యంబులందున్ = యుద్ధములందు, తరులన్ = చెట్లచేతను, గిరులన్ = కొండలచేతను, గదాఘాతంబులన్ = గదదెబ్బలచేతను, ఉక్కడంచి = మొక్కపోవునట్లుగా, త్రుంచిరి = చంపిరి, అంతన్ = అటుతరువాత.

తా. ఈ కోలాహలమును రావణుఁడు గాంచి నివ్వెఱఁబోయి, వెంటనే యనేక రాక్షసవీరులను రప్పించి నిజసైన్యమును దీర్చెను. మఱునాఁడు రావణుఁడు లంకాగోపుర శిఖర మారోహించియుండఁగా, సుగ్రీవుఁ డాతని మార్కొని ద్వంద్వయుద్ధ మాచరించెను. సుగ్రీవుఁడు రావణు నొంచి నింగి కెగసి శ్రీరాముని సన్నిధిని వ్రాలి, యీ వృత్తాంతము నివేదించెను. శ్రీరాముఁడు రావణునొద్దకు నంగదుని రాయబారిగాఁ బంపెను. "సీతాదేవిని రామున కర్పించి శరణు వేఁడు"మని చెప్పిన యంగదుని పల్కులకు, రావణుఁ డామోదింపలేదు. తదుపరి రాక్షససేనలకుఁ గపిసైన్యములకు ఘోరమగు ద్వంద్వయుద్ధము జరిగెను. దుర్ముఖుఁడు, ప్రహస్తుఁడు, మహాకాయుఁడు మొదలగు రాక్షసయోధులు బాణముల నెక్కుపెట్టిన ధనుస్సులను, చిల్లకోలలను, గదలను, ఖడ్గములను, త్రిశూలములను, విడిచివాటుగుదియలను, గండ్రగొడ్డళ్ళను, ఈఁటెలను, రోఁకళ్ళను, వెండియు నితర సాధనంబులను దాల్చి యేనుంగులు, గుఱ్ఱములు పూన్చిన రథంబుల నెక్కి యుద్ధమున కేఁగిరి. కుంభుఁడు, నికుంభుఁడు ధూమ్రాక్షుఁడు, విరూపాక్షుఁడు లోనగు రాక్షసవీరులు కదనరంగమును బ్రవేశించిరి. అత్తఱి జరిగిన ఘోరయుద్ధమందు సుగ్రీవుఁడు, హనుమంతుఁడు, గజుఁడు, గవయుఁడు,

గంధమాదనుఁడు, నీలుఁడు, అంగదుఁడు, కుముదుఁడు, జాంబవంతుఁడు మొదలగు కపివీరులు చెట్లతోను గొండల తోను గదదెబ్బలతోను రాక్షసయోధులను జావమోఁదిరి. ఇంద్రజిత్తు వజ్రాయుధముతో నంగదునిఁ బ్రహరించెనుగాని యంగదుఁ డా వ్రేటు తప్పించుకొనెను. ఆనాఁటిరాత్రి రణ రంగమెల్ల మహాభీభత్సముగా నుండెను.

ఆయెడ లక్ష్మణుఁ డుజ్జ్వల
సాయకములఁ ద్రుంచె శైలసమకాయు సురా
జేయు ననర్గళమాయో
పాయుఁ నయగుణవిధేయు నయ్యతికాయున్. 32

టీ. ఆ + ఎడన్ = అప్పుడు, లక్ష్మణుఁడు, ఉత్ + జ్వల=ప్రకాశించు, సాయకములన్ = బాణములచే, శైల = పర్వతముతో, సమ = సమానమైన, కాయున్ = దేహము గలవాఁడును, సుర + అజేయున్ = దేవతలకుసైతము జయింపరానివాఁడును, అనర్గళ = అడ్డములేని, మాయ= మాయయందు, ఉపాయున్ = యుక్తిగలవాఁడును, నయగుణవిధేయున్ = వినయము విధేయత కలవాఁడును (అగు) ఆ + అతికాయున్ = సుప్రసిద్ధుఁడైన అతికాయుఁడను పేరుగలవానిని, త్రుంచెన్ = చంపెను.

తా. మఱునాఁడు, అతికాయుఁడను రాక్షసవీరుఁడు వీరారావంబులు గావించుచు వానరసైన్యమును జొచ్చెను. తన్నెదుర్కొన్న కపిసైనికులను దీవ్రబాణముల నొప్పించెను. అతికాయుఁడు పర్వతముతో సమానమైన శరీరము గల వాఁడు.

ఆతని గెలుచుటకు దేవతలకేని సాధ్యము గాకుండెను. మాయోపాయము పన్ని యుక్తిచే శత్రువుల ఖండించుట

యందితఁడు దిట్ట. రాక్షసుఁడయ్యు నతఁడు, నయగుణసంప న్నుఁడు. అతికాయుఁడు రామునొద్దకు స్వయముగాఁ బోయి కయ్యమునకుఁ జీరెను. వాని వ్యర్థప్రలాపములకు లక్ష్మణుఁడు గినిసి జ్వాజ్వల్యమానమైన బ్రహ్మాస్త్రమును సంధించి యభి మంత్రించి వైచెను. ఆ బ్రహ్మాస్త్రము అతికాయుని శిరస్సును ఖండించెను. రావణుఁ డీ వార్తను విని దుఃఖితుఁడయ్యెను.

రామచంద్రవిభుఁడు రణమున ఖండించె
మేటి కడిమి నీలమేఘవర్ణు
బాహుశక్తిపూర్ణుఁ బటుసింహనాదసం
కుచితదిగిభకర్ణుఁ గుంభకర్ణు. 33

టీ. రామచంద్రవిభుఁడు, రణమునన్ = యుద్ధమందు, మేటికడిమిన్ = మిక్కిలి పరాక్రమముతో, నీల = నల్లనైన, మేఘవర్ణున్ = మేఘము వంటి వన్నెగలవాఁడును, బాహుశక్తిపూర్ణున్ = రెండుబాహువులయొక్క బలముచే నిండినవాఁడును, పటుసింహనాద = పటిష్ఠమైన సింహగర్జనముచే, సంకుచిత = సంకోచము నందఁజేసిన, దిక్ + ఇభ + కర్ణున్ = అష్టదిగ్గజ ముల చెవులు గలవాఁడును (అగు), కుంభకర్ణున్ = కుంభకర్ణుఁడను రాక్ష సుని, ఖండించెన్ = చీల్చెను.

తా. రావణుని పంపున మఱునాఁడు కుంభకర్ణుఁడు ప్రళయమేఘగర్జనంబు లొనర్చుచు రణరంగమున దూఁకెను. అతని దేహము నల్లనిమబ్బువలె వికృతవర్ణము కలదిగా నుండెను; నిండుబలముగల బాహువు లుద్దండముగాఁ గాన్పిం చెను; ఆతం డొనరించిన పెద్ద సింహనాదంబుచే దిగ్గజముల కర్ణములు తూఁటుపడెను. వానిం గాంచి వానరు లెల్లరు భయమునఁ బరువెత్తఁ దొడంగిరి. కుంభకర్ణుఁడు చేఁజిక్కిన

వారినెల్ల మ్రింగఁజొచ్చెను. రాముఁ డది గాంచి ధనుష్టంకార మొనరించెను. కుంభకర్ణుఁ డాధ్వని సహింపక రాముని మీఁదికి విజృంభించెను. శ్రీరాముఁడు కనలి యనేకశరంబుల విడిచి వాని హస్తములను బాదములను దునిమి కొన్ని బాణముల నోటఁ గుప్పించి, దివ్యబాణంబుచే వాని శిరంబును ద్రుంచెను. ఆ శిరస్సు కోటగోడపయిఁ దటాలునఁ బడెను. దానిపాటునకు లంకలోని పురద్వారప్రాకారంబు విఱిగి కూలెను.

అలవున లక్ష్మణుఁ డాజి
స్థలిఁ గూల్చెన్ మేఘనాదుఁ జటులాహ్లాదున్
బలభేదిజయవినోదున్
బలజనితసుపర్వసుభటభావవిషాదున్. 34

టీ. లక్ష్మణుఁడు, అలవునన్ = శ్రమచే, ఆజిస్థలిన్ = యుద్ధరంగమున, చటుల + ఆహ్లాదున్ = మిక్కిలి సంతోషముగలవాఁడును, బలభేది = ఇంద్రుని, జయ = గెలుచుటయను, వినోదున్ = వినోదము గలవాఁడును, బల = తన బలముచే, జనిత = కలిగిన, సుపర్వ = దేవతలయొక్క, సుభట = యోధాగ్రేసరులయొక్క, భావ = మనస్సునందలి, విషాదున్ = దుఃఖము గలవాఁడును, (అగు) మేఘనాదున్ = ఇంద్రజిత్తును, కూల్చెన్ = చంపివైచెను.

తా. అంత రావణుఁడు ఇంద్రజిత్తును రామలక్ష్మణుల మీఁదికిఁ బంపెను. ఇంద్రజిత్తు పుంఖానుపుంఖముగాఁ బఱచు బాణంబులకు వానరులు గుంపులుగాఁ గూలఁజొచ్చిరి. ఇంద్రజిత్తు సామాన్యవీరుఁడు గాఁడు. అతఁడు మేఘనాదుఁడు.

ఇంద్రుని విలాసముగా జయించిన యోధుఁడు; అతని బాహుశక్తింగూర్చి విన్నంతనే దేవతలలోఁ గొమ్ములు తిరిగిన యోధులుసయితము మృత్యుభయముచే దుఃఖ మొందుచుండిరి; లక్ష్మణుఁ డింద్రజిత్తు మాయాయుద్ధమును గాంచి వానిపై శరపరంపరలఁ గురియించెను. ఇంద్రజిత్తును, వెనుదీయక లక్ష్మణునితో హోరాహోరిగఁ బోరఁ దొడంగెను. ఇంద్రజిత్తు రథమునుండి నేలకు దుమికి కన్నుల నిప్పుకలు రాల్చుచు నాసురాస్త్రంబును లక్ష్మణుని మీఁదికి విడిచెను. లక్ష్మణుఁడు దానిని మహేశ్వరాస్త్రంబున వారించి, యైంద్రాస్త్రమును సంధించి రావణాత్మజుని మీఁద వదలెను. ఆ బాణము ఇంద్రజిత్తు శిరస్సును ఛేదించెను. వెంటనే లక్ష్మణుఁడు రాముని చెంత కేఁగి ప్రదక్షిణనమస్కారము గావించెను. రాముఁడు తన తమ్ముని పరాక్రమమును భూషించి యాశీర్వదించెను.

అంత. 35

టీ. అంతన్ = ఆ తరువాత.

తా. హతశేషులైన రక్కసు లింద్రజిత్తు దుర్మరణమును రావణున కెఱింగించిరి. ఆ కఠోరవార్త చెవిసోఁకినంతనే రావణుఁడు మూర్ఛిల్లి దీర్ఘకాలంబునకుఁ దెప్పఱిల్లి సీతాదేవిని నఱుకుటకు నద్యమించెఁగాని సుపార్శ్వుని హితోపదేశమున నా పని మాని తన మూలబలమునంతయు యుద్ధరంగమునకుఁ బనిచెను. క్షణమాత్రంబున నా మూలబలంబు

వానరులచే విధ్వంసమయ్యెను. ఈమాట విని రాక్షసాంగనలు రోదనము సల్పిరి.

తనవా రందఱు మ్రగ్గిన
ననిమిషపతివైరి పుష్పకారూఢుండై
యనికి నడచి రామునితో
ఘనరౌద్రముతోడ నంపకయ్యము సేసెన్. 38

టీ. తనవారు, అందఱు, మ్రగ్గినన్ = చనిపోఁగా, అనిమిషపతివైరి = దేవేంద్రునకు శత్రువైన రావణాసురుఁడు, పుష్పక + ఆరూఢుండు + ఐ = పుష్పకమను విమానము నెక్కినవాఁడై, అనికిన్ = యుద్ధమునకు, నడచి, ఘన రౌద్రముతోడన్ = మిక్కిలి కోపముతో, రామునితోన్, అంపకయ్యము = బాణయుద్ధము, చేసెన్ = ఒనర్చెను.

తా. లంకానగరమున రాక్షసాంగనలు మిన్నుముట్టఁ జేయు రోదనమును రావణుఁ డాలకించి నయనంబులఁ గ్రోధానలకణంబులు వర్షింపఁ బుష్పకమను తన విమానము నెక్కి యుద్ధభూమినిఁ జొచ్చెను. తన మూలబలము రాక్షసయోధులు గతించినందులకు వాపోయి, తృటిలో ధైర్యము చిక్కఁబట్టి శ్రీరాముని రూపుమాపు దృఢసంకల్పముతోఁ బ్రళయకాలరుద్రుని భంగిఁ గోపము వహించి తీక్ష్ణశరయుద్ధము గావించెను.

మును పట వచ్చియున్న లక్ష్మణుఁడు వాఁడియమ్ములచే రావణుని ధ్వజమును దుండించి యొక్కకోల వాని సారథి తలఁ దెగటార్చెను. రావణుఁడు క్రోధమూర్తియై రెట్టించిన పూనికతో మహాశక్తిని విసరివైచెను. ఆశక్తి లక్ష్మణుని

వక్షోభాగముఁ జొచ్చెను. సౌమిత్రి నేల వ్రాలెను. శ్రీరాముఁడు తమ్ముని దురవస్థకుఁ గన్నీరునించి, తృటిలో వ్యసనంబు నడంచి దేదీప్యమానంబులైన శరంబులను రావణునిపై జడివానవలెఁ గురియించెను. ఆ ధాటికోర్వక దనుజేంద్రుఁడు పలాయితుఁ డయ్యెను.

హనుమంతుఁడు ఓషధిపర్వతంబును గొని రాఁగా సుషేణుఁడు మూలికల ప్రభావంబున లక్ష్మణుని మూర్ఛ దేర్చి యెల్లరకు నానందముఁ గూర్చెను.
అయ్యవసరంబున 39

టీ. ఆ + అవసరంబునన్ = అట్టి సమయమునందు.

సురపతి పంపున మాతలి
గురుతరమగు దివ్యరథముఁ గొనివచ్చిన నా
ధరణీవల్లభుఁ డెక్కెను
ఖరకరుఁ డుదయాద్రి నెక్కు కైవడిఁ దోఁపన్. 40

టీ. సురపతి=దేవేంద్రుని, పంపునన్=ఆజ్ఞచే, మాతలి, (దేవేంద్రుని సారథి) గురుతరము + అగు = పెద్దదియగు, దివ్యరథమున్=దేవతాసంబంధమగు రథమును, కొనివచ్చినన్ = తీసికొనిరాఁగా, ఆ + ధరణీవల్లభుఁడు = ఆ భూనాథుఁడైన రాముఁడు, ఖరకరుఁడు = సూర్యుఁడు, ఉదయ + అద్రిన్=పొడుపుఁ గొండను, ఎక్కు కైవడిన్=ఎక్కు రీతిగా, తోఁపన్ = తోఁచునట్లు, ఎక్కెను.

(39, 40) తా. అట్టి సమయమందు, దేవేంద్రుని యాజ్ఞచే మాతలి యను రథచోదకుఁడు ఉన్నతమగు దివ్య

రథమును బూన్చి కదనరంగమునకుఁ దీసికొనిరాఁగా భూనాథుండగు శ్రీరాముఁడు తీక్ష్ణకరుఁడు తూర్పుకొండ నెక్కిన రీతిగా నా రథమును అధిష్ఠించెను.

ఇట్లు దివ్యరథారూఢుండయి రామచంద్రుండు రావణున కిట్లనియె. 41

టీ. ఇట్లు = ఈ ప్రకారము, దివ్య + రథ + ఆరూఢుండు + ఐ = దివ్యరథమును ఎక్కి, రామచంద్రుండు, రావణునకున్, ఇట్లు + అనియెన్.

చపలత్వంబున డాఁగి హేమమృగమున్
సంప్రీతిఁ బుత్తెంచుటో
కపటబ్రాహ్మణమూర్తివై యబల నా
కాంతారమధ్యంబునం
దపలాపించుటయో మదీయశితది
వ్యామోఘబాణాగ్నిసం
తపనంబేగతి నోర్చువాఁడవు దురం
తంబెంతయున్ రావణా! 42

టీ. రావణా! చపలత్వంబునన్=రాగద్వేషాదులచేఁ బనులయందుఁ గలుగు తబ్బిబ్బుచే, డాఁగి = దాఁగి, హేమమృగమున్=బంగారు జింకను, సంప్రీతిన్ = మిక్కిలి ప్రేమతో, పుచ్చు + తెంచుట + ఓ=పంపుటయో, కపట బ్రాహ్మణమూర్తివి + ఐ = మాయాబ్రాహ్మణ రూపమునుదాల్చి ఆ కాంతారమధ్యంబునన్ = ఆ అడవిమధ్యలో, అబలన్=అసహాయయైన (ఒంటరిగానున్న) సీతను, అపలాపించుటయో=దొంగిలించుటయో, (కాదు) మదీయ...సంతపనంబు, మదీయ = నా యొక్క, శిత = తీక్ష్ణమైన, దివ్య= ఒప్పుచున్నట్టియు, అమోఘ = వ్యర్థము కానట్టియు, బాణ + అగ్ని=శరాగ్ని

యొక్క, సంతపనంబు = సంతాపమును, ఏ గతిన్ = ఏ విధముగా, ఓర్చు వాఁడవు = ఓర్వఁగలవు? (అది) ఎంతయున్ = ఎంతయో, దురంతంబు = సహింపరానిది.

(41, 42) తా. ఇట్లు దివ్యరథంబునెక్కి శ్రీరాముఁడు కట్టెదుటనున్న రావణు నుద్దేశించి యిట్లనియెను.

"ఓ రావణా! రాగ ద్వేషాదులచేఁ దబ్బిబ్బై దొంగవలె దాఁగి, బంగారుజింకను బంపుటగాదు; మాయా బ్రాహ్మణుని వేషము ధరించి యటవీమధ్యంబునఁ జిక్కియున్న యబలను అపహరించుటగాదు. నిలువుము; వ్యర్థము కానట్టియు దివ్యములునైన నా తీక్ష్ణబాణాగ్నికి గుఱియైనదాన నీకుఁగల్గు సంతాపము నేరీతి నోర్వఁగలవో చూచెదనుగాక."

నీ చేసిన పాపములకు
నీచాత్మక! యముఁడు వలదు; నేఁ డిట నా నా
రాచములఁ ద్రుంచివైచెద
ఖేచరభూచరులు గూడి క్రీడం జూడన్. 43

టీ. నీచ + ఆత్మక = మోసగాఁడా! నీ చేసిన = నీ వొనర్చిన, పాపములకున్, యముఁడు, వలదు = అవసరములేదు, నేఁడు + ఇటన్, నా = నాయొక్క, నా రాచములన్ = బాణములచే, ఖేచర = ఆకాశమున సంచరించు వేలుపులు, భూచరులు = భూమిపైఁదిరుగు మానవులు, కూడి = చేరి, క్రీడన్ = వినోదముతో, చూడన్ = చూచుచుండఁగ, త్రుంచివైచెదన్ = చంపివైతును.

అని పలికి 44

తా. ''నీచాత్ముఁడా! ఇంతవఱకు నీ వార్జించిన పాపములకు నిన్ను శిక్షించుటకు యముఁడు రానలసిన పని లేదు. ఇదిగో తీక్ష్ణములగు నా బాణపరంపరలచే నాకాశమందు సంచరించు వేల్పులు భూమిపైఁదిరుగు మానవులెల్లరు చూచు చుండఁగా వినోదముగా నిన్నుఁ ద్రుంచివైచెదను. కాచుకొమ్ము'' అని పలికి.

బలువింటన్ గుణటంకృతంబు నిగుడన్
బ్రహ్మాండభీమంబుగాఁ
బ్రళయోగ్రానలసన్నిభంబగు మహా
బాణంబు సంధించి రా
జలలాముం డగు రాముఁ డేసె ఖరభా
షాశ్రావణున్ దేవతా
బలవిద్రావణు వైరిదారజనగ
ర్భస్రావణున్ రావణున్. 45

టీ. బలువింటన్=పటిష్ఠమైన ధనుస్సునందు, బ్రహ్మాండ భీమంబుగాన్ = బ్రహ్మాండమునకు భయముగొల్పునట్లుగా, గుణటంకృతంబు = ధనుష్టంకారము, నిగుడన్ = వ్యాపింపఁగా, ప్రళయ = కల్పాంతమందలి, ఉగ్ర + అనల + సన్నిభంబు + అగు = భయంకరమైన యగ్నివంటిదైన, మహా బాణంబు = గొప్పబాణము, సంధించి = కూర్చి, రాజలలాముండు + అగు = రాజశ్రేష్ఠుఁడగు, రాముఁడు, ఖర = కఠినములైన, భాషా = వాక్కులను, శ్రావణున్ = వినుపించువాఁడును, దేవతాబల = దేవబలములను, విద్రావణున్ = యుద్ధములందుఁ బాఱిపోవునట్లు చేయువాఁడును, వైరి=శత్రువుల యొక్క, దారజన = భార్యలయొక్క, గర్భస్రావణున్ = గర్భస్రావము కూర్చువాఁడును (అగు) రావణున్ = రావణాసురుని, ఏసెన్ = కొట్టెను.

తా. శ్రీరాముఁడు బ్రహ్మాండము భయంకరముగా మాఱుమ్రోఁగునట్లు పటిష్ఠమైన ధనుష్టంకార మొనర్చెను. రావణుండు చెలరేఁగి యిరువది హస్తంబులతోను బాణ పరంపరలు ప్రయోగింపసాగెను. వాని నన్నింటిని శ్రీరాముఁడు చెదరఁగొట్టెను. తదుపరి నా రాక్షసుఁ డేసిన మహాశూలంబును శ్రీరాముఁడు తనకు మాతలి తెచ్చియిచ్చిన శక్తిచేఁ దుత్తునియ లొనర్చెను. రావణుఁడు లోకకంటకుఁడు; కఠినమైన మాటలచేఁ బరులను దూలనాడు స్వభావము గలవాఁడు; యుద్ధమందు శత్రువులను బాఱు నట్లొనర్చు విక్రమశాలి; పగతుఱ పడంతులకుఁ దలఁచుకొన్నమాత్రన గర్భస్రావము గలిగించు నంతటి భయంకరమూర్తి. అట్టి పాపాత్ముని, శ్రీరాముఁడుఁ దడవుసేయక ప్రళయకాలాగ్నితో సమానమైన మహాబాణంబును సంధించి కొట్టెను.

దశరథసూనుం డేసిన
విశిఖము హృదయంబుఁదూఱ వివశుం డగుచున్
దశకంధరుండు గూలెను
దశవదనంబులను రక్తధారలు దొరఁగన్. 46

టీ. దశరథసూనుండు=దశరథుని పుత్త్రుఁడగు రాముండు, ఏసినన్ = బాణముతోఁ గొట్టఁగా, విశిఖము = ఆ బాణము, హృదయంబున్, తూఱన్ = ప్రవేశింపఁగా, వివశుండు + అగుచున్=స్వాధీనముతప్పినవాఁడగుచు, దశకంధరుండు = రావణాసురుఁడు, దశవదనంబులను = పది ముఖములనుండి, రక్తధారలు, దొరఁగన్ = స్రవింపఁగా, కూలెను=చని పోయెను.

అంత నా రావణుండు దెగుట విని. 47

టీ. అంతన్, ఆ రావణుండు, తెగుటన్ = చనిపోవుట, విని = ఆలకించి.

తా. దాశరథి యశ్లేసిన బాణము హృదయమందుఁ బ్రవేశించి గ్రుచ్చుకొనఁగా దశకంఠుఁడు స్వాధీనము తప్పి దశముఖంబులనుండి రక్తధారలు స్రవింపఁగా నేలపైఁ గూలి పోయెను. దేవతలు దివ్యదుందుభులు మ్రోఁగించిరి. వానరులు హర్షధ్వానములు గావించిరి. విభీషణుఁడు తన యన్న మరణంబునకు దుఃఖింపఁగా శ్రీరాముఁ డాతని నోదార్చెను. రావణుని మరణమును శుద్ధాంతకాంతలు విని గగ్గోలుగా విలపించిరి.

కొప్పులు బిగి వీడి కుసుమమాలికలతో
నంసభాగంబుల నావరింప
సేసముత్యంబులు సెదరఁ గర్ణిక లూడఁ
గంఠహారంబులు గ్రందుకొనఁగ
వదనపంకజములు వాడి వాతెఱలెండఁ
గన్నీళ్ళవఱద లంగములు దడుప
సన్నపు నడుములు జవ్వాడఁ బాలిండ్ల
బరువులు నడుములఁ బ్రబ్బికొనఁగ

నెత్తిమోఁదికొనుచు నెఱిఁబయ్యెదలు జాఱ
నట్టునిట్టుఁ దప్పటడుగు లిడుచు
నసురసతులు వచ్చిరట భూతబేతాళ
సదనమునకు ఘోరకదనమునకు. 48

ప్ర. అసురసతులు = రాక్షసుల భార్యలు, కొప్పులు, బిగిపిడి=సడలి పోయి, కుసుమమాలికలతోఁ=పువ్వులదండలతోడ, అంసభాగంబులన్ = మూఁపుల పై, ఆవరింపన్ = క్రమ్ముకొనఁగా, సేసముత్యంబులు = పాపటలోఁ గూర్చుకొనిన ముత్యంబులు, చెదరన్ = చెదరిపోఁగా, కర్ణికలు= చెవికమ్మలు, ఊడన్=ఊడిపోఁగా, కంఠహారంబులు=మెడలోని దండలు, క్రందుకొనఁగన్ = రాలిపోఁగా, వదనపంకజంబులు = తామరను బోలు ముఖములు, వాడి = ఎండిపోయి, వాయి + తెఱలు = పెదవులు, ఎండన్ = ఎండఁగా, కన్నీళ్ళవఱదలు = కన్నీటి ప్రవాహములు, అంగములు = దేహములను, తడుపన్ = తడుపఁగా, సన్నము + నడుములు=సూక్ష్మమైన నడుములు, జవ + ఆడన్=చలింపఁగా, పాలిండ్లబరువులు= స్తనభారములు, నడుములన్ = నడుములయందు, ప్రబ్బికొనంగన్ = వ్యాపింపఁగా, నెత్తి = శిరస్సును, మోఁదికొనుచున్=బాఁదుకొనుచు, నెఱిన్=చక్కని, పయి + ఎదలు=పైఁటలు, జాఱన్=జాఱఁగా, అట్టు, ఇట్టున్, తప్పు + అడుగులు = తబ్బిబ్బులగు నడుగులు, ఇడుచున్ = వేయుచు, అటన్, భూత + బేతాళ + సదనమునకున్=పిశాచాదులుండు ప్రదేశమైన, ఘోర కదనమునకున్ = భయంకర యుద్ధస్థలమునకు, వచ్చిరి.

తా. రాక్షసులు నిశ్శేషముగా గతించిపోవుటచే వారి భార్య లంతఃపురమును వీడి వెలికివచ్చి బిగ్గఱగా నేడ్చిరి. పాపము! వారి కొప్పులలోని బిగువు సడలిపోయెను; వెంట్రుకలలోఁ దుఱిమిన పూవుదండ లూడిపోయి మూఁపులపైఁ బడి క్రమ్ముకొనెను; పాపటలోఁ గ్రువ్విన ముత్తెంబులు చెదరిపోయెను; చెవికమ్మ లూడిపోయెను; మెడలోని హారములు చిక్కువడెను; తామరలంబోలు ముద్దుమొగంబులు వాడిపోయెను; పెదవు లెండిపోయెను; కంటినుండి జాఱు నశ్రువులు దేహములఁ దడపివైచెను; సన్నని నడుములు చలించెను; పాలిండ్లబరువుచే నడుములు వడంకెను. అందఱు నెత్తి మొత్తుకొనుచుఁ, బైఁటలు జాఱిపోవ, దిగ్భ్రమచే నటునిటుఁ

దబ్బిబ్బులుగా నడుగులఁ బెట్టుచు భూతబేతాళాదుల కాటపట్టయిన యుద్ధరంగమునకు నేతెంచిరి.

ఇట్లు వచ్చి తమతమ నాథులం గని శోకించిరి. అందు మందోదరి రావణుం జూచి యిట్లని విలపించె. 49

టీ. ఇట్లు, వచ్చి, తమతమ నాథులన్ = తమ భర్తలను, కని, శోకించిరి = దుఃఖించిరి, అందున్, మందోదరి (రావణుని భార్య), రావణున్, చూచి, ఇట్లు + అని = ఈ క్రింద విధముగా, విలపించెన్ = ఏడ్చెను.

తా. తమతమ నాథులను వీక్షించి రాక్షస కాంతలు గుండెలు బాదుకొని దుఃఖించుచుండఁగా, రావణుని భార్య మందోదరి శవమై పడియున్న తన భర్తను కౌఁగిలించుకొని యిట్లు విలపించెను.

హా దనుజేంద్ర! హా సురగ
ణాంతక! హా హృదయేశ! నిర్జరేం
ద్రాదులగెల్చి నీవు కుసు
మాస్త్రుని కోలల కోర్వలేక సో
న్మాదముగన్ రఘుప్రవరు
మానిని నేటికిఁదెచ్చి తప్పుడేఁ
గాదని చెప్పినన్ వినక
కాలవశంబును బొంది తక్కటా! 50

టీ. దనుజ + ఇంద్ర = ఓ రాక్షసశ్రేష్ఠా! హా! = అయ్యో! చనిపోయితివా? సురగణ + అంతక = దేవసమూహములకు యమునివంటివాఁడా! హా! = అక్కటా, హృదయ + ఈశ = ప్రాణేశ, నీవు, నిర్జర + ఇంద్ర + ఆదులన్ = దేవేంద్రాదులను, గెల్చి = జయించి, కుసుమ + అస్త్రుని = పుష్ప

బాణుఁడగు మన్మథునియొక్క, కోలలకుఁ = శరములకు, ఓర్వలేక = ఓర్చుకొనలేక, స + ఉన్మాదముగఁ = చిత్తవిభ్రమముతో, రఘుప్రవరుమానినిఁ = శ్రీరాముని భార్యను, ఏటికిఁ, తెచ్చితివి? = ఎందులకు తీసికొనివచ్చితివి? అప్పుడు, ఏఁ = నేను, కాదు + అని = వలదని, చెప్పినఁ = చెప్పినప్పటికిని, వినక, కాల + వశంబును = యమునికి లొంగిపోవుట, పొందితి(వి) = ప్రాప్తినొందితివి, అక్కటా! = అయ్యో!

తా. ఓ రాక్షసేశ్వరా! నీవు గతించితివా? కటకటా! దేవసమూహమునకు నీవు యమునివంటివాఁడవు; హృదయేశా! నీవు దేవేంద్రాదులను గెల్చిన దిట్టవయ్యు, మన్మథబాణము నోర్చుకొనలేక మనోవికారమునొంది రఘురాముని మానిని నన్యాయముగా నెందులకుఁ దెచ్చితివి? తెచ్చినప్పుడే యట్టికార్య మక్రమమని గ్రుచ్చిగ్రుచ్చి చెప్పినను వినక నేఁటి కిట్టి దుర్గతిపాలైతివిగదా!

ఎండఁగాయ వెఱచు నినుఁడు, వెన్నెలగాయ
వెఱచువిధుఁడు, గాలివీవ వెఱచు
లంకమీఁద, నిట్టి లంకాపురికి మాకు
నధిప! విధవభావ మడరె నేఁడు. 51

టీ. లంకమీఁదఁ = లంకా పట్టణముపైన, ఇనుఁడు = సూర్యుఁడు, ఎండఁ, కాయఁ = కాయుటకు, వెఱచుఁ = భయపడును, విధుఁడు = చంద్రుఁడు, వెన్నెలఁ, కాయఁ, వెఱచుఁ, గాలి, వీవఁ = వీచుటకు, వెఱచుఁ, అధిప! = ఓ రాజా! ఇట్టి లంకాపురికిఁ, మాకుఁ, నేఁడు = ఈ నాఁడు, విధవభావము = అనాథస్థితి (దిక్కులేని దశ), అడరెఁ = కలిగెను.

తా. నీవలని భయమునకు లంకాపట్టణముపై సూర్యుఁడు ఎండఁ గాయ నోఁపఁడు; చంద్రుఁడుసైతము

తన వెన్నెలఁ బ్రకటించుటకు వెఱపొందును; గాలి వీచుటకు నీయాజ్ఞ గొనుచుండును; ఓ రాజా! అట్టి నగరమున నేఁడు మాకు వైధవ్యము ప్రాప్తించినది. ఎంత విపరీతము!

దురితముఁ దలఁపరు గానరు
జరుగుదు రెటకైన నిమిషసౌఖ్యంబులకై
పరవనితాసక్తులకును
బరధనరక్తులకు నిహముఁ బరముంగలదే. 52

టీ. పరవనితా + ఆసక్తులకును = ఇతరుల భార్యలయందు నపేక్ష గలవారును, పర + ధన + రక్తులకున్ = ఇతరుల ద్రవ్యముపైఁ గోరికగల వారును, దురితమున్ = పాపమును, తలఁపరు = ఆలోచింపరు, కానరు = మంచిచెడ్డ చూడఁజాలరు, నిమిష + సౌఖ్యంబులకున్ + ఐ = క్షణకాల సౌఖ్యములకై, ఎటకున్ + ఐనన్ = ఏచోటకైనను, జరుగుదురు = కదలి పోయెదరు, (వారికి) ఇహమున్ = ఇహలోకమును, పరమున్ = పరలోక మును, కలదు + ఏ = కలదా? (లేదని భావము.)

తా. ఇతరుల భార్యలయం దపేక్షగలవారు, ఇతరుల ధనమును గోరువారు పాపమును దలంపరు; మంచిచెడ్డలను జూడఁజాలరు. క్షణకాల సౌఖ్యమునకై యెచ్చటికైనను గదలిపోయెదరు. అట్టివారి కిహపరలోకములు నిశ్చయ ముగా లేవుగదా?

అని విలపింప నంత విభీషణుండు రామచంద్రుని పంపువడసి రావణునకు దహనాదిక్రియలు గావించె. అంత రాఘ వేంద్రుండు నశోకవనంబున కేఁగి శింశుపాతరుసమీపంబు నందు. 53

టీ. అని = పైవిధముగా, విలపింపఁగా=రాక్షసస్త్రీలు ఏడ్వఁగా, అంతఁ, విభీషణుండు, రామచంద్రుని, పంపు + వడసి = ఆజ్ఞగొని, రావణునకుఁ, దహన + ఆది + క్రియలు = పీనుఁగును గాల్చుట మొదలగు కార్యములు, కావించెఁ = నిర్వర్తించెను, అంతఁ, రాఘవ + ఇంద్రుండు =రఘుకుల శ్రేష్ఠుఁడైన రాముఁడు, వనంబునకుఁ, ఏఁగి=పోయి, శింశుపాతరు = శింశుపావృక్షము, సమీపంబునందుఁ = దగ్గఱ ప్రదేశమందు.

తా. మండోదరి యిట్లు విలపించుచుండఁగా రాముఁడా దృశ్యమునుగాంచి విభీషణుని రప్పించి చనిపోయిన రావణునకు నుత్తరక్రియలు గావించుట కాజ్ఞాపించెను. విభీషణుఁడు తన యన్న మరణమునకు బిట్టువగచి శవమునకు దహనసంస్కారాదులఁ గావించెను.
అంత రాఘవేంద్రుఁ డశోకవనంబునకుఁ బోయి శింశుపా వృక్షము చెంత సీతను గాంచెను.

దైతేయప్రమదాపరీత నతిభీ
తన్ గ్రంథిబంధాలక
వ్రాతన్ నిశ్శ్వసనానిలాశ్రుకణజీ
వంజీవదారామభూ
జాతన్ శుష్కకపోలకీలితకరా
బ్జాతం బ్రభూతం గృశీ
భూతం బ్రాణసమేత సీతఁ గనియెన్
భూమీశుఁడా ముందటన్ . 54

టీ. భూమి + ఈశుఁడు = పుడమిఱేఁడయిన రామచంద్రుఁడు, ఆ ముందటన్, దైతేయ + ప్రమదా = రాక్షసస్త్రీలచే, పరీతన్=చుట్టఁబడినదియు, అతిభీతన్ = మిక్కిలి భయమునందినదియు, గ్రంథి... వ్రాతన్,

గ్రంథి = ముడులుగా, బంధ = పెనఁగొనిన, అలక + వ్రాతన్ = ముంగురుల మొత్తములుగలదియు, నిఃశ్వసనా...భూజాతన్, నిశ్శ్వసన + అనిల = నిట్టూర్పు గాడ్పులచేతను, అశ్రుకణ = కన్నీటి బొట్టులచేతను, జీవంజీవత్ = జీవించుచున్న, ఆ రామ + భూజాతన్ = ఉద్యానవనములోని వృక్షములు గలదియు, శుష్క...బ్జాతన్, శుష్క = పలుచఁబాఱిన, (వివర్ణమైన) కపోల = చెక్కిలియందు, కీలిత = చేర్పఁబడిన, కర + అబ్జాతన్ = హస్తకమలము కలదియు, ప్రభూతన్ = ప్రఖ్యాతి గన్నదియు, కృశీభూతన్ = స్రుక్కినదియు ప్రాణసమేతన్ = ప్రాణముతోఁ గూడినదియు (అగు) సీతన్, కనియెన్ = వీక్షించెను.

తా. ఆ సమయంబున సీతాదేవి వికృతలగు ననేక రాక్షసస్త్రీలచేఁ జుట్టఁబడి యుండెను; అందుచే నామె మిక్కిలి భీతిచెంది యుండెను, ఎల్లప్పుడామె విడుచు నిట్టూర్పు గాడ్పులచేతను గన్నీటిబొట్టులచేతను అశోకవనమందలి వృక్షములు జీవించుచుండెను; పలుచఁబాఱిన చెక్కిలి యందుఁ గమలమువంటి మృదులహస్తమును జేర్చుకొని యామె దుఃఖించుచుండెను; ప్రఖ్యాతిఁగన్న యా తల్లి స్రుక్కి కొనయూపిరితో నుండెను. అట్టి సీతను శ్రీరామచంద్రుఁడు వీక్షించెను.

కని రామచంద్రుండును దాపంబు నొంది భార్యవలన దోషంబు లేకుంట వహ్నిముఖంబునం బ్రకటంబు సేసి దేవతల పంపున దేవిం జేకొని. 55

టీ. కని = (సీతాదేవి దుఃస్థితి) చూచి, రామచంద్రుఁడును = శ్రీరామచంద్రునివంటివాఁడు సైతము, తాపంబున్ = దుఃఖమును, ఒంది, వహ్నిముఖంబునన్ = అగ్నిముఖమున, భార్యవలనన్, దోషంబు = తప్పు, లేక + ఉంట, ప్రకటంబు + చేసి = వెల్లడిచేసి, దేవతల పంపునన్ = దేవతల యాజ్ఞచే, దేవిన్ = సీతాదేవిని, చేకొని = పరిగ్రహించి.

తా. సీతాదేవి దుఃస్థితినిఁ గాంచి శ్రీరామచంద్రు నంతటి ధీరోదాత్తుఁడునై తము కరము దుఃఖించెను. కాని రావణుని యింట నింతకాలమున్న సీతను బరిగ్రహించినఁ దీఱని లోకాపవాదమగునని యెంచి సీతతోఁ బరుషోక్తు లాడెను. సీత యగ్నిప్రవేశము చేయ నిశ్చయించుకొనెను. లక్ష్మణుఁ డన్న యానతి మేరకుఁ జితినిఁ బేర్చెను. సీతాదేవి రామునకుఁ బ్రదక్షిణ మొనర్చి భగభగ మండుచున్న యగ్ని హోత్రమును బ్రవేశించెను. అగ్నిదేవుఁడు మర్త్యరూపము దాల్చి చితినుండి లేచి సీత నిర్దోషియని ప్రకటించి యామెను రామున కప్పగించెను. దేవతలెల్లరు విమానారూఢులై చేతులెత్తి "సీత మహాపతివ్రత" యని ఘోషించిరి. శ్రీరాముఁ డామెను త్రికరణశుద్ధిగఁ బరిగ్రహించెను. బ్రహ్మ మహేశ్వరాదులు శ్రీరాముని స్తుతించిరి.

శోషితదానవుండు నృప
సోముఁడు రాముఁడు రాక్షసేంద్రతా
శేషవిభూతిఁ గల్పసమ
జీవిని గమ్మని నిల్పె నర్థిసం
తోషణుఁ బాపశోషణు న
దూషణు శశ్వదరోషణుఁ బ్రితా
భాషణు నార్యపోషణుఁ గృ
పాగుణభూషణు నవ్విభీషణున్. 56

టీ. శోషిత = శోషిల్లునట్లుగాఁ జేసిన, దానవుండు = రాక్షసులు గలవాఁడు, నృపసోముఁడు=రాజులలోఁ జంద్రునివంటివాఁడు, రాముఁడు,

రాక్షస = రాక్షసులయొక్క, ఇంద్రతా = రాజత్వముయొక్క, అశేష విభూతిన్ = సమస్తమైన యైశ్వర్యమువలన, కల్ప = కల్పవృక్షముతో, సమ = సమానమైన, జీవివి = జీవితము గలవాఁడవుగా (కల్పవృక్షమువంటి త్యాగశీలివిగా), కమ్ము + అని = అగుమని, అర్థి = యాచకులకు, సంతోషణు = సంతోషము గల్గించువాఁడును, పాపశోషణున్ = పాపులను స్రుక్కఁజేయువాఁడును, అ + దూషణున్ = దూషణలేనివాఁడును, శశ్వత్ + అరోషణున్ = ఎల్లప్పుడు రోసములేనివాఁడును, మిత + అభాషణున్ = మితముగా మాటలాడువాఁడును, ఆర్య + పోషణున్ = పూజ్యులను బోషించువాఁడును, కృపా + గుణ + భూషణున్ = దయాగుణము అలంకారముగాఁ గలవాఁడును, (అగు), అ + విభీషణున్ = రావణాసురుని తమ్ముఁడగు విభీషణుని, నిల్పెన్ = లంకకు నధిపతినిఁ గావించెను.

తా. శ్రీరాముఁడు రాక్షసులనెల్ల శోషిల్లఁజేసి, వారిని హతమార్చిన నృపచంద్రుఁడు; విభీషణునకు శరణు నొసంగిన శీలపరుండు. విభీషణుఁ డన్నను యితరుల కెప్పుడు సంతోషము చేకూర్చువాఁడు; పాపముల నుక్కడంచువాఁడు; దూషణలేనివాఁడు; ఏ సమయమందుఁగాని రోసములేని వాఁడు; మితభాషి; పూజ్యులను బోషించువాఁడు; దయాగుణభూషితుఁడు. శ్రీరాముఁడు విభీషణునిఁ జేరి, "మిత్రమా! రాక్షసరాజ్యమున నీవు సమస్తైశ్వర్యములకునొడయుఁడవై, త్యాగశీలివై, జీవితము గడపుమని" ఆశీర్వదించి లంకాపట్టణమునకు రాజుగా నియమించి పట్టాభిషేకము గావించెను.

ఇట్లు విభీషణసంస్థాపనుండై రామచంద్రుండు సీతాలక్ష్మణ సమేతుండై సుగ్రీవ హనుమదాదులం గూడికొని పుష్పకారూఢుండై వేల్పులు గురియు పువ్వులసోనలం దడియుచుఁ

దొల్లి వచ్చిన తెరువుజాడలు సీతకు నెఱిఁగించుచు మరలి నందిగ్రామంబునకు వచ్చెను. అయ్యవసరంబున. 57

టీ. ఇట్లు, ఈప్రకారముగా, రామచంద్రుఁడు, విభీషణ+సంస్థాపనుండు+ఐ=విభీషణుని (లంకాపురమందు) రాజుగా స్థాపించినవాఁడై, సీతా+లక్ష్మణ+సమేతుండు+ఐ=సీతాలక్ష్మణులతోఁ గూడినవాఁడై, సుగ్రీవ+హనుమత్+ఆదులన్=సుగ్రీవుఁడు హనుమంతుఁడు మొదలగువారిని, కూడికొని, పుష్పక+ఆరూఢుండు+ఐ=పుష్పకమను విమానము నెక్కినవాఁడై, వేల్పులు=దేవతలు, కురియు=వర్షించు, పువ్వుల సోనలన్=పుష్పములతోఁ గూడిన యల్పవర్షములను, తడియుచున్, తొల్లి=పూర్వము, వచ్చిన, తెరువుజాడలు=మార్గములోని గుర్తులను, సీతకున్, ఎఱిఁగించుచున్=తెలుపుచు,నందిగ్రామంబునకున్=నందిగ్రామంబను పల్లెకు, వచ్చెను, ఆ+అవసరంబునన్=అట్టి సమయమున.

తా. ఇట్లు విభీషణుని లంకాపురమునకు రాజుగాఁ జేసి సీతాలక్ష్మణులంగూడి, సుగ్రీవుఁడు హనుమంతుఁడు మొదలగు కపివీరులు వెంటరాఁగా పుష్పకమను విమానము నెక్కి దేవతలు కురియు పూలవర్షమునఁ దడియుచుఁ బూర్వమువచ్చిన కిష్కింధానగరమును ఋశ్యమూక పర్వతమును బంపాసరోవరాదుల దాఁటి నందిగ్రామంబను పల్లెకు వచ్చెను.

రామచంద్రవిభుని రాక వీనుల విని
భరతుఁ డుత్సహించి పాదుకలను
మోచికొనుచు వచ్చి ముదముతోఁ బురజను
లెల్లగొలువ నన్న కెదురు వచ్చె. 58

టీ. రామచంద్రవిభుని = శ్రీరామచంద్రప్రభువుయొక్క, రాకన్ = వచ్చుటను, వీనులన్ = చెవులతో, విని, భరతుఁడు, ఉత్సహించి = యత్నించి, పాదుకలను, మోచికొనుచున్, వచ్చి, ముదముతో = సంతోషముతో, పురజనులు=ప్రజలు, ఎల్లన్, కొలువన్, అన్నకున్=శ్రీరామునకు, ఎదురు, వచ్చెన్.

తా. రాముని పంపున హనుమంతుఁడు భరతునొద్దకుఁబోయి రాముని రాకను గూర్చి యెఱింగించెను. భరతుఁడు మహాసంతోషమంది సూర్యోదయంబులోపల నయోధ్యానందిగ్రామంబులకుఁగల బాటను జక్కఁజేసి సపరివారంబుగా మహోత్సవంబుతో శ్రీరాముని కెదురేఁగెను.

వచ్చి పాదుకల ముందట నిడికొని యెడనెడ సాష్టాంగదండ ప్రణామంబులు సేయుచు మెల్లమెల్లన డాసి రామచంద్రుని పాదంబులు దన నొసలం గదియించి తచ్చరణరేణువులు దుడిచి శిరంబునం జల్లికొని తనివి సనక మఱియు నప్పద కమలంబు లక్కున మోపికొనుచు సంతసంపుఁ గన్నీటఁగడిగి సేమంబు లరయుచుండెను. అంత సీతాలక్ష్మణ సహితుండై విభుండును దన కెదురువచ్చిన బ్రాహ్మణజనంబులకు నమస్కరించి తక్కినవారలచేత మన్ననలు వొంది వారల మన్నించెను. అయ్యవసరంబున. 59

టీ. వచ్చి, పాదుకలన్, ముందటన్, ఇడికొని=పెట్టుకొని, ఎడన్ + ఎడన్ = నడుమ నడుమ, సాష్టాంగదండప్రణామంబులు = తల నేల నంటునట్లు చేయు నమస్కారములు, చేయుచున్, మెల్లన్, మెల్లన్ + అ = మెల్లమెల్లఁగానే, డాసి=దగ్గఱకువచ్చి, రామచంద్రుని, పాదంబులు, తన = భరతునియొక్క, నొసలన్=ఫాలమునందు, కదియించి=చేర్చి, తత్ + చరణ + రేణువులు = రామచంద్రుని పాదములందలి, రేణువులు=పరాగము

(దుమ్మును), తుడిచి, శిరంబునన్ = తన తలపైన, చల్లికొని, తనివి + చనక = తృప్తిలేక, మఱియు, ఆ + పదకమలంబులు = శ్రీరాముని పాద పద్మములు, అక్కునన్ = ఱొమ్మున, మోసికొనుచున్, సంతసము + కన్నీటన్ = సంతోషముతోఁగూడిన యశ్రుధారలచే, కడిగి, సేమంబులు = కుశలములు, అరయుచున్ + ఉండెను = విచారించుచుండెను, అంతన్, సీతాలక్ష్మణసహితుండు + ఐ, విభుండును = శ్రీరామప్రభువును, తనకున్, ఎదురువచ్చిన, బ్రాహ్మణ జనంబులకున్, నమస్కరించి, తక్కినవారల చేతన్, మన్ననలన్ = సమ్మానము, పొంది, వారలన్, మన్నించెను = గౌరవించెను, ఆ + అవసరంబునన్ = ఆ సమయమందు.

తా. భరతుఁడు శ్రీరాముని పాదుకల ముందటఁ బెట్టుకొని సాష్టాంగదండప్రణామంబుల నాచరించి మెల్ల మెల్లఁగా దగ్గఱకువచ్చి రామచంద్రుని పాదంబులు తన ఫాలమందుఁ జేర్చి చరణమందలి రేణువులను దుడిచి, వానిం దన తలపైఁ జల్లికొని అంతతోఁ దృప్తినొందక శ్రీరాముని పాదపద్మములఁ దన ఱొమ్ముమీఁద మోపి వాని నానంద బాష్పములచేఁ గడిగి కుశలప్రశ్నలువేసి "రాజా! నాయొద్ద నుంచిన నీ రాజ్యము నీకే యప్పగించితిని. నీవు మరల నయోధ్యకువచ్చి రాజవగుటఁ జూడనోఁచి జన్మసాఫల్య మొందితిని". అని విన్నవించెను. శ్రీరామప్రభువు సైతము తనకు నెదురువచ్చిన బ్రాహ్మణ జనంబులకు వందన మాచ రించి తక్కినవారిచే సన్మానముపొంది వారిని గౌరవించెను. ఆ సమయంబున.

నృపవర! పెక్కునాళ్ళఁ గొలె
నిన్ గనకుండిన యట్టినేఁడు మా

తపములు పండె, నిందఱము
ధన్యులమైతి మటంచుఁ బుట్టముల్
చపలతఁ ద్రిప్పి పువ్వుల వ
సంతము లాడుచుఁ బాడుచున్ గత
త్రపులయి యాడుచుం బ్రజలు
దద్దయుఁ బండుగు సేసి రెల్లెడన్. 60

టీ. నృపవర = ఓ రాజశ్రేష్ఠా! పెక్కునాళ్ళన్ + కొలె = పెక్కు దినములనుండి, నిన్ = నిన్ను, కనక + ఉండిన = చూడకుండిన, అట్టినేఁడు = అట్టి యీనాఁడు, మా తపములు, పండెన్ = ఫలవంతము లయ్యెను, ఇందఱము, ధన్యులము = పుణ్యవంతులము, ఐతిమి + అటంచున్, ప్రజలు, పుట్టములన్ = వస్త్రములను, చపలతన్ = తబ్బిబ్బుమై, త్రిప్పి, పువ్వులన్, వసంతములు = పసుపును సున్నమును గలిపిన యెఱ్ఱనీళ్ళతో, ఆడుచున్ = ఆటలాడుచు, పాడుచున్, గత + త్రపులు + ఐ = సిగ్గును వీడినవారై, ఆడుచున్, తద్దయున్ = మిక్కిలి, ఎల్ల + ఎడన్, పండుగు, చేసిరి.

తా. "ఓ రాజశ్రేష్ఠా! చాలకాలమునుండి నిన్నుఁ జూచెడి భాగ్యము మాకు లేదు. నీవు దుష్టుల శిక్షించి, మరల నయోధ్యకు వచ్చుటచే మేమెల్లరము పుణ్యవంతుల మైతిమి. మా తపములు పండెను" అని ప్రజ లానందాతిరేకమునఁ దాము కట్టుకొన్న వస్త్రములు తబ్బిబ్బులగునట్లు తిరిగి, పువ్వులతోను బారాణితోను లజ్జ వీడి యాడుచుఁ బాడుచుఁ బెద్దపండుగుఁ గావించిరి.

కవగూడి యిరుదెసఁ గపిరాజు రాక్షస
రాజు నొక్కటఁ జామరములు వీవ
హనుమంతుఁ డతిధవళాతపత్రముఁ బట్టఁ
బాదుకల్ భరతుండు భక్తిఁ దేర

శత్రుఘ్నుఁ డమ్ములుఁ జాపంబుఁ గొనిరాఁగ
సౌమిత్రి భృత్యుఁడై చనువు సూప
జలపాత్ర చేఁబట్టి జనకజ గూడిరాఁ
గాంచన ఖడ్గ మంగదుఁడు మోవఁ

బసిఁడి కేడెమర్థి భల్లూకపతి మోచి
కొలువఁ బుష్పకంబు వెలయ నెక్కి
గ్రహము లెల్లఁ గొలువఁ గడు నొప్పు సంపూర్ణ
చంద్రుపగిది రామచంద్రుఁ డొప్పె. 61

టీ. ఇరుదెసన్ = రెండు ప్రక్కల, కవగూడి = జంటగూడి, కపిరాజు = సుగ్రీవుఁడు, రాక్షసరాజు = విభీషణుఁడు, ఒక్కటన్ = ఒక్కటిగా, చామరములు = వింజామరలు, వీవన్ = వీవఁగా, హనుమంతుఁడు, అతి + ధవళ + ఆతపత్రము = మిక్కిలి తెల్లనైన గొడుగును, పట్టన్ = పట్టఁగా, భరతుండు, భక్తిన్ = భక్తితో, పాదుకల్ = పాదుకలను, తేరన్ = తీసికొనిరాఁగా, శత్రుఘ్నుఁడు, అమ్ములు = బాణములు, చాపంబున్ = ధనుస్సు, కొనిరాఁగన్ = కొనిరాఁగా, సౌమిత్రి = లక్ష్మణుఁడు, భృత్యుఁడు + ఐ = సేవకుఁడై, చనువు + చూపన్ = అనురాగము చూపఁగా, జలపాత్రన్ = నీళ్ళుకలిగిన పాత్రను, చేన్ + పట్టి = చేతితోఁ బట్టుకొని, జనకజ = సీత, కూడి = చేరి, రాన్ = రాఁగా, అంగదుఁడు, కాంచనఖడ్గము = బంగారు కత్తిని, మోవన్ = మోచుకొనిరాఁగా, భల్లూకపతి = జాంబవంతుఁడు, అర్థిన్ = ప్రేమతో, పసిఁడి + కేడెము = బంగారుకత్తి, మోచి, కొలువన్ = సేవింపఁగా, పుష్పకంబు = పుష్పక మను విమానము, వెలయన్ = ఒప్పునట్లుగా, ఎక్కి, గ్రహములు + ఎల్లన్ = సూర్యాది గ్రహములన్ని, కొలువన్ = పూజింపఁగా, కడున్ + ఒప్పు = మిక్కిలి ప్రకాశించు, సంపూర్ణచంద్రు + పగిదిన్ = పూర్ణచంద్రుని యట్లు, రామచంద్రుఁడు, ఒప్పెన్ = ప్రకాశించెను.

తా. శ్రీరామునకు సుగ్రీవుఁ డొకప్రక్క విభీషణుఁ డొకప్రక్క జంటఁగూడి వింజామరలు వీచుచుండిరి. హను

మంతుఁడు వెల్లనిగొడుగును బట్టెను. భక్తితో భరతుఁడు పాదుకలను దీసికొనెను. శత్రుఘ్నుఁడు శ్రీరాముని ధనుస్సును బాణములను గొనితెచ్చెను. లక్ష్మణుఁడు సేనకునట్లు చనువు చూపెను. సీతాదేవి జలపాత్రనుబట్టి వచ్చెను. అంగదుఁడు బంగారుకత్తిని మోసికొనివచ్చెను. జాంబవంతుఁడు ప్రేమతోఁ గాంచనఖడ్గము చేఁగొని సేవించెను. సర్వశుభగ్రహములు దన్నుఁ బూజింపఁగా, శ్రీరామచంద్రుఁడు పుష్పకవిమానము నెక్కి నిండుచందురుని వలె నయోధ్యానగరమున కేతెంచెను.

ఇట్లు పుష్పకారూఢుండై కపిబలంబులు సేరి కొలువ శ్రీరాముం
డయోధ్యకుం జనియె, అంతకుమున్న యప్పురంబునందు, 62

టీ. ఇట్లు, పుష్పక + ఆరూఢుండు + ఐ = పుష్పకమను విమానము నెక్కినవాఁడై, కపిబలంబులు = మర్కటసైన్యములు, చేరి, కొలువన్, శ్రీరాముండు, అయోధ్యకున్, చనియెన్, అంతకు + మున్న = అంతకుఁ బూర్వమే, ఆ + పురంబునందు.

తా. ఇట్లు నందిగ్రామమునుండి పుష్పకవిమానముపై శ్రీరాముఁడు మర్కటసైన్యములు దన్ను సేవింపఁగా నయోధ్య కేతెంచెను. శుభవార్త యంతకుమున్నె ప్రజలకుఁ దెలిసిపోయినది.

వీథులు సక్కఁగావించి తోయంబులు
సల్లి రంభాస్తంభచయము నిలిపి
పట్టుఁజీరెలు సుట్టి బహుతోరణంబులుఁ
గలువడంబులు మేలుకట్లుఁ గట్టి

వేదిక లలికించి వివిధరత్నంబుల
మ్రుగ్గులు పలుచందములుగఁ బెట్టి
కలయ గోడల రామకథ లెల్ల వ్రాయించి
ప్రాసాదముల దేవభవనములను
గోపురంబుల బంగారుకుండ లెత్తి
యెల్ల వాకిండ్లఁ గానిక లేర్పరించి
జనులు గైసేసి తూర్యఘోషములతోడ
నెదురు నడతెంచి రా రాఘవేంద్రుకడకు. 63

టీ. వీధులు, చక్కఁ + కావించి = శుభ్రపఱిచి, తోయంబులు =నీళ్ళు, చల్లి, రంభా + స్తంభ + చయము= పెక్కు అరఁటి స్తంభములను, నిలిపి, పట్టు + చీరెలు, చుట్టి = మేలుకట్లు (వితానము లేక చాందిని) గాఁ గట్టి, బహుతోరణంబులుఁ = పెక్కు తోరణములును, కలువడంబులు (కలువ + వడము) = ఉత్సవాదికాలములలో ధ్వజస్తంభము లోనగువాని యందు వ్రేలఁగట్టెడు బంగారు కలువపూదండలు, మేలుకట్లు=పందిరి లోనగు వానిలోపల మీఁదఁగట్టెడు మేలుకట్టులు, కట్టి, వేదికలు=తిన్నెలు, అలికించి, వివిధరత్నంబులఁ = పలురకములగు మణులచే, మ్రుగ్గులు, పలు చందములుగఁ = అనేకరీతులుగా, పెట్టి, కలయఁ = వ్యాప్తినొందునట్లుగా, గోడలఁ = గోడలమీఁద, రామకథలు + ఎల్లఁ, వ్రాయించి, ప్రాసాదములఁ = నగరులందు, దేవ + భవనములను = దేవాలయముల యందు, గోపురంబులఁ = దేవాలయశిఖరములయందు, బంగారుకుండలు= స్వర్ణకలశములను, ఎత్తి, ఎల్ల + వాకిండ్లఁ = వాకిళ్ళయం దెల్లెడ, కానికలు = బహుమానములు, ఏర్పరించి = ఏర్పాటుచేసి, జనులు=ప్రజలు, కై సేసి=అంకరించి, తూర్య + ఘోషములతోడఁ=వాద్యముల మ్రోఁతల తోడ, రాఘవ + ఇంద్రుకడకుఁ = శ్రీరామచంద్రునొద్దకు, ఎదురు = ఎదురుగా, నడతెంచిరి = నడచివచ్చిరి.

తా. అయోధ్యానగరమందలి పెద్దలు పిన్నలు వీథుల నెల్లఁ జక్కఁగా శుభ్రపఱిచి పలుచగా నీళ్ళను జల్లిరి;

లెక్కకు మిక్కుటముగా నరఁటికంబముల నూరెల్లఁ గట్టిరి; పట్టుచీరెలును బందిళ్ళకు ఇండ్లకు వెలుపల నందముగా నిలిపిరి; విరివిగాఁ బచ్చని తోరణంబులను, బంగరునన్నె కలువపూదండలను, మేలుకట్టులను గట్టిరి. తిన్నెల నలికించి పలువిధములగు మణులచే ముగ్గుల ననేకరీతులఁ దీర్చిరి; గోడల మీఁద స్ఫుటాక్షరముల నెల్లెడల శ్రీరాముని పరాక్రమాదులఁగూర్చి యుగ్గడించి వ్రాసిరి; దేవభవనంబులందు గోపురములందు బంగారుకుండల నెత్తి వాకిళులలోఁ గానుకలేర్పాటుచేసిరి; ప్రజలెల్లరు శుభ్రవస్త్రముల ధరించి యలంకరించుకొనిరి; వాద్యముల మ్రోఁతతోడ నాబాలగోపాలము శ్రీరామునకు నెదురేఁగి ఘనమగు స్వాగతము నిచ్చిరి.

సమదగజదానధారల
దుమదుమలై యున్న పెద్దత్రోవలతోడన్
రమణీయ మయ్యె నప్పురి
రమణుఁడు వచ్చినఁ గరంగు రమణియపోలెన్. 64

టీ. సమద = మదముతోఁ గూడిన, గజ = ఏనుంగులయొక్క, దాన + ధారలన్ = కపోలములనుండి స్రవించు మదజలధారలచే, దుమదుమలు + ఐ + ఉన్న = మిక్కిలి తడిసైయున్న, త్రోవలతోడన్ = మార్గములచే, ఆ + పురి = ఆ అయోధ్యాపట్టణము, రమణుఁడు = ప్రియుఁడు, వచ్చినన్ = వచ్చినప్పుడు, కరంగు = అనురాగపులకితాంగయగు, రమణియపోలెన్ = స్త్రీ యట్లుగా, రమణీయము + అయ్యెన్ = మనోజ్ఞమయ్యెను.

తా. మదముతోఁగూడిన యేనుఁగుల చెక్కిళ్ళనుండలి మదజలముచేఁ ద్రోవలు మిక్కిలి తడిసియుండెను;

వేయేల? ప్రియుండు వచ్చినప్పుడు కరఁగు ప్రియురాలి విధమున నయోధ్యాపురము శ్రీరాముని రాకచే నేత్రోత్సవముగాఁ గన్పట్టెను.

రామచంద్రవిభుని రాకఁ దూర్యములతో
రథగజాశ్వసుభటరాజితోడ
నమరెఁ బురము చంద్రుఁ డరుదేర ఘూర్ణిల్లు
జంతుభంగమిళితజలధిభంగి. 65

టీ. రామచంద్ర + విభుని = శ్రీరామ ప్రభునియొక్క, రాకన్ = వచ్చుటచే, తూర్యములతో = వాద్యములతో, రథ + గజ + అశ్వ + సుభట = రథములయొక్కయు, ఏనుంగులయొక్కయు, గుఱ్ఱములయొక్కయు, శ్రేష్ఠులగు భటులయొక్కయు, రాజితోడన్ = సమూహముతోడ, పురము = అయోధ్యాపురము, చంద్రుఁడు, అరుగు + తేరన్ = రాఁగా, (అనఁగా నుదయింపఁగా) ఘూర్ణిల్లు = తిరుగుడుపడు, జంతు = నానావిధములగు జంతువులచే, భంగ = అలలచే, మిళిత = కలిసిన, జలధి + భంగిన్ = సముద్రునియట్లు, అమరెన్ = ఒప్పారెను.

తా. శ్రీరాముఁడు వచ్చుచున్నాఁడని యయోధ్యాపురము తూర్యములతో, రథములతో, నేనుంగులతో, గుఱ్ఱములతో, శ్రేష్ఠులగు భటులతో నిండిపోయి కోలాహలముగా నుండెను. చంద్రుఁ డుదయింపఁగనే నానావిధములగు జంతువులచేతను అలలచేతను గలిసి యుప్పొంగు సముద్రునిభంగి నగర మానందముచేఁ గళకళలాడెను.

ఇట్లొప్పుచున్న యప్పురంబు ప్రవేశించి రాజమార్గంబున రామచంద్రుం డరుగుచున్న సమయంబున. 66

టీ. ఇట్లు + ఒప్పుచు + ఉన్న = ఈ విధముగా రాజిల్లుచున్నట్టి, ఆ + పురంబు = ఆ అయోధ్యాపురమును, ప్రవేశించి = చొచ్చి, రాజమార్గంబున్ = ప్రధానమగు వీథియందు, రామచంద్రుఁడు, అరుగుచు + ఉన్న సమయంబునన్ = పోవుచున్నప్పుడు.

తా. ఈ ప్రకార మొప్పారుచున్న యయోధ్యానగరమును శ్రీరాముఁడు ప్రవేశించి రాజమార్గమునఁ బోవుచున్న సమయమందు.

ఇతఁడే రామనరేంద్రుఁ డీ యబల కా
యింద్రారి ఖండించె, న
ల్లతఁడే లక్ష్మణుఁ, డాతఁడే కపివరుం,
డా పొంతవాఁడే మరు
త్సుతుఁ డా చెంగట నా విభీషణుఁడఁటం
చుం జేతులం జూపుచున్
సతులెల్లం బరికించి చూచిరి పురీ
సౌధాగ్రభాగంబులన్. 67

టీ. పురీ + సౌధ + అగ్రభాగంబులన్ = పురమందు మేడల కొనలందు, సతులు + ఎల్లన్ = స్త్రీలందఱు, ఇతఁడు + ఏ = ఆ కనఁబడు నతఁడే రామచంద్రుఁడు, ఈ అబలకున్ = ఈ సీతాదేవికొఱకే, ఆ + ఇంద్ర + అరిన్ = ఇంద్రునకు శత్రువైన యా రావణాసురుని, ఖండించెన్ = త్రుంచెను, అల్ల + అతఁడు + ఏ, లక్ష్మణుఁడు, అతడు + ఏ, కపివరుండు = సుగ్రీవుఁడు, ఆ + పొంత + వాఁడు + ఏ = ఆ దగ్గఱనున్నవాఁడే, మరుత్ + సుతుఁడు = వాయునందనుఁడైన హనుమంతుఁడు, ఆ చెంగటన్ = ఆ సమీపమందు, (ఉన్నవాఁడు) విభీషణుఁడు, అఁట + అంచున్ = అని యనుకొనుచు, చేతులన్ = చేతులతో నిర్దేశించి, చూపుచున్, పరికించి = పరీక్షించి, చూచిరి.

తా. పురమందలి మేడ కొనభాగములందు వినోదము దిలకించుటకుఁ గూరుచున్న స్త్రీలందఱు "అదిగో! ఆ కనఁబడువాఁడు శ్రీరామచంద్రుఁడు; ప్రక్కన యాసీనయైయున్న యా సీతామహాదేవికొఱకే యాతఁడు పదితలల రక్కసుని ఖండించినది; అతఁడే లక్ష్మణుఁడు; అతఁడే సుగ్రీవుఁడు; ఆ చెంతనున్నవాఁడే వాయుసుతుండు; అతని సమీపమందున్నవాఁడే విభీషణుఁడు." అని తమలోఁ దా మనుకొనుచుఁ జేతులతోఁ నొక్కొక్కనిఁ జూపుచు సంతోషించుచుండిరి.

ఇట్లు సమస్తజనంబులు చూచుచుండ రామచంద్రుండు రాజమార్గంబునం జని చని. 68

టీ. ఇట్లు, సమస్తజనంబులు=ఎల్లప్రజలు, చూచుచున్ + ఉండన్, రామచంద్రుఁడు, రాజమార్గంబునన్, చనిచని = పోయిపోయి.

తా. అయోధ్యానగరంబులోని ప్రజలందఱుఁ దన్నుఁ జూచుచుండఁగా రాజమార్గమున శ్రీరామచంద్రుఁడు పోయి పోయి తుదకు రాజగృహంబును బ్రవేశించెను.

పటికంపు గోడలు బవడంపు వాకిండ్లు
నీలంపు టరుఁగులు నెఱయఁగలిగి
కమనీయవైడూర్యక స్తంభచయముల
మకరతోరణముల మహితమగుచుఁ
బడగల మాణిక్యబద్ధచేలంబులఁ
జిగురుఁ దోరణములఁ జెలువుమీఱి

పుష్పదామకముల భూరివాసనలను
　　బహుతరధూపదీపముల మెఱసి
మాఱువేల్పుల భంగిని మలయుచున్న
సతులుఁ బురుషులు నెప్పుడు సందడింప
గుఱుతు లిడరాని ధనముల కుప్పలున్న
రాజసదనంబునకు వచ్చె రామవిభుఁడు. 69

టీ. పటికము + గోడలు = తెల్లపటికముతోఁ జేయఁబడిన గోడలు, పవడము + వాకిండ్లు = పగడములతో (మణివిశేషము) నిర్మించిన వాకిండ్లు, నీలము + అరుఁగులు = నీలమణులచేఁ గట్టఁబడిన తిన్నెలు, నెఱయన్ = నిండుగా, కలిగి, కమనీయ = మనోహరమైన, వైడూర్యక = వైడూర్యములు చెక్కిన, స్తంభ + చయములన్ = కంబముల సమూహముచేతను, మకర + తోరణములన్ = మకరరత్నములచేఁ జేయఁబడిన (లేక మకరాకృతిగఁ దీర్చిన) తోరణములచేతను, మహితము + అగుచున్ = గొప్పదియగుచు, పడగలన్ = జెండాలచేతను, మాణిక్య + బద్ధ = మాణిక్యములచేఁ గట్టఁబడిన, చేలంబులన్ = వస్త్రములచేతను, చిగురు + తోరణములన్ = లేఁత చివుళ్ళచేఁ జేయఁబడిన తోరణములచేతను, చెలువు + మీఱి = అందముచే నతిశయించి, పుష్ప + దామకములన్ = పూవులదండలచేతను, భూరి + వాసనలను = మంచి (గొప్ప) పరిమళముచేతను, బహుతర = పలువిధములైన, ధూప = పొగలు, దీపములు = దివ్వెలచేతను, మెఱసి = వెలిఁగి, మాఱువేల్పుల = మాఱువేసముల ధరించిన దేవతల, భంగిన్ = విధముగా, మలయుచు + ఉన్న = తిరుగుచున్న, సతులున్ = స్త్రీలును, పురుషులు, ఎప్పుడున్, సందడింపన్ = సందడిచేయఁగా, గుఱుతులు + ఇడరాని + ధనములన్ = మేరచెప్పుటకు వీలుకాని ద్రవ్యములయొక్క, కుప్పలు = రాసులు, ఉన్న = ఉన్నట్టి, రాజసదనంబునకున్ = రాజగృహమునకు, రామవిభుఁడు, వచ్చెన్ = వచ్చెను.

తా. ఆ రాజగృహము తెల్లనిపటికపు గోడలచేతను, పగడముతో నిర్మింపఁబడిన వాకిండ్ల చేతను, నీలమణుల చేఁ

గట్టఁబడిన పెక్కు తిన్నెలచేతను, వైడూర్యములచేఁ జెక్కఁబడిన స్తంభములచేతను, మకరరత్నములు గూర్పఁబడిన తోరణములచేతను మనోహరముగా నుండెను. మఱియు నా యున్నతమగు రాజసదనంబునకుఁ బలువన్నియల జెండాలను గట్టిరి; మాణిక్యములచేఁ బొదుగఁబడిన శుభ్రవస్త్రములఁ జిత్రవిచిత్రములుగాఁ దీర్చిరి; లేఁజివుళ్ళ తోరణముల నందము చిందునట్లు కట్టిరి; పూవులదండలఁ జక్కఁగా నమర్చిరి; మంచిగంధము వెదఁజల్లు పలురకంపుఁ బొగలను వేసిరి; నానావిధవర్ణములగు దీపముల వెలిఁగించిరి; మాఱు వేసముల ధరించిన వేల్పులో యన స్త్రీలు, పురుషు లానంద సంభ్రమములతో నిటునటుఁ దిరుగుచు సందడి చేసిరి; లెక్కకు రాని ధనరాసులు ధనాగారంబులఁ బోసియుంచిరి.

ఇట్లు వచ్చి— 70

తల్లులకెల్ల మ్రొక్కి తమ
తల్లికి వందన మాచరించి య
ల్లల్ల బుధాళికిన్ వినతుఁ
డై చెలికాండ్రను దమ్ములం బ్రసం
వుల్లతఁ గాఁగిలించుకొని
భూవరుఁ డోలిఁ గృపారసంబు రం
జిల్లఁగఁ జాలమన్ననలు
సేసె నమాత్యులఁ బూర్వభృత్యులన్. 71

టీ. భూవరుండు = శ్రీరాముఁడు, తల్లులకుఀ + ఎల్లఀ = సుమిత్ర కైకేయి మొదలగు తల్లులకు, మ్రొక్కి = నమస్కరించి, తమ తల్లికిఀ = కౌసల్యకు, వందనము + ఆచరించి = దండము పెట్టి, అల్లఀ + అల్లఀ = మెల్ల మెల్లఁగా, బుధ + ఆళికిఀ = పండితవర్గమునకు, వినతుఁడు + ఐ = వినయుఁడై వందనము చేసి, చెలికాండ్రను = స్నేహితులను, తమ్ములఀ = సహోదరులను, ప్రసంఫుల్లతఀ = మిక్కిలి వాత్సల్యముతో, కౌఁగిలించుకొని, ఓలిఀ = వరుసగా, కృపారసంబు = దయారసము, రంజిల్లఀ + కఀ = అతిశయింపఁగా, అమాత్యులఀ = మంత్రులను, పూర్వభృత్యులఀ = పూర్వముండిన సేవకులను, చాల మన్ననలు = మిక్కిలి గౌరవము, చేసెఀ = ఒనర్చెను.

తా. వచ్చియు రాకమున్నె శ్రీరాముఁడు సుమిత్ర కైకేయి తల్లులకు మ్రొక్కి, తన తల్లియగు కౌసల్యకు నమస్కరించెను. అచటకు వచ్చిన బుధులకు వినయ ముట్టిపడ దండము పెట్టెను. స్నేహితులను దమ్ములను మనసారఁ గౌఁగిలించు కొనెను. అనురాగము పెల్లుకొన మంత్రులను సేవకులను మిక్కిలి గౌరవించెను.

తత్సమయంబునఁ దల్లులు— 72

టీ. తత్ + సమయంబునఀ = ఆ వేళయందు, తల్లులుఀ = తల్లులు సైతము.

కొడుకులుఁ బెద్దకోడలును
గొబ్బున మ్రొక్కిన, నెత్తి చేతులం
బుడుకుచు మోములుం దలలు
బోరన ముద్దులు గొంచు నవ్వుచుం

దొడలకు వారి రాఁదిగిచి
తోఁగఁగఁ జేసిరి నేత్రధారలన్
వెడలిన ప్రాణముల్ దగఁ బ్ర
విష్టము లయ్యె నఁటంచు నుబ్బుచున్. 73

టీ. కొడుకులున్, పెద్ద కోడలును = సీతయును, గొబ్బునన్ = శీఘ్రముగా, మ్రొక్కినన్ = నమస్కరింపఁగా, నెత్తి = శిరస్సును, చేతులన్ = చేతులతో, పుడుకుచున్ = గ్రహించుచు, మోములన్ = ముఖములను, తలలున్ = తలలను, బోరనన్ = వేగముగా, ముద్దులుగొంచున్ = చుంబించుచు, నవ్వుచున్, వారిన్ = కుమారులను, తొడలకున్ + రాన్ + తిగిచి = తొడలపైఁ గూర్చుండఁబెట్టుకొని, వెడలినప్రాణముల్ = పోయినట్టి ప్రాణములు, తగన్ = ఒప్పునట్లుగా, ప్రవిష్టములు + అయ్యెన్ + అఁటంచున్ = ప్రవేశించె నఁటంచు, (తిరిగి వచ్చిన వని భావము), ఉబ్బుచున్ = పొంగుచు, నేత్రధారలన్ = కన్నీటిధారలచే, తోఁగఁగన్ = మునుంగునట్లు, చేసిరి.

(72, 73) తా. అప్పుడు కౌసల్యాదులు తమకు వందన మాచరించిన కొడుకులను సీతాదేవిని శీఘ్రముగా సమీపించి వారి శిరములఁ జేతులతో నిముడుచు, మోములను ముద్దుగొనుచు, నవ్వుచుఁ, బోయిన ప్రాణములు తిరిగివచ్చిన రీతిఁగాఁ బొంగుచుఁ దమ కన్నీటిధారలచే వారు మునుంగునట్లు సంతోషించిరి.

అంత వసిష్ఠుం డరుగుదెంచి శ్రీరామచంద్రుని జటాబంధంబు విడిపించి కులవృద్ధులుం దానును సమంత్రకంబుగ దేవేంద్రుని మంగళస్నానంబు చేయించు బృహస్పతి చందంబున సముద్ర నదీజలంబుల నభిషేకంబు సేయించె. రఘువరుండును సీతా సమేతుండై జలకంబులాడి మంచిపుట్టంబులు గట్టికొని కమ్మని పువ్వులు దుఱిమి సుగంధంబు లలందికొని తొడవులు దొడిగి

కొని తనకు భరతుఁడు సమర్పించిన రాజసింహాసనంబునం గూర్చుండి యతని మన్నించి కౌసల్యకుఁ బ్రియంబుసేయుచు జగత్పూజ్యంబుగ రాజ్యంబు సేయుచుండెను. అప్పుడు— 74

టీ. అంతన్, వసిష్ఠుఁడు, అరుగు + తెంచి=వచ్చి, శ్రీరామచంద్రుని = శ్రీరామునియొక్క, జటాబంధంబున్ = జటలోని ముడిని, విడిపించి = చిక్కుదీసి, కులవృద్ధులున్ = కులములోని పెద్దలు, తాను, సమంత్రకంబుగన్ = మంత్రముతోఁగూడ, దేవ + ఇంద్రునిన్, బృహస్పతి=దేవతల గురువగు బృహస్పతి, స్నానంబు, చేయించు, చందంబునన్ = రీతిగా, సముద్రనదీజలంబులన్ = సముద్రములనుండియు, నదులనుండియు తెచ్చిన నీటిచే, అభిషేకంబున్ = స్నానమును, చేయించెన్ = ఒనరించెను, రఘువరుండును, సీతాసమేతుండు + ఐ = సీతతోఁ గూడినవాఁడై, జలకంబులు + ఆడి = స్నానముచేసి, మంచి పుట్టంబులు = శుభ్రమైన వస్త్రములను, కట్టుకొని, కమ్మని=సువాసనగల, పువ్వులు, తుఱిమి=ముడిచి, సుగంధంబు = మంచి గంధమును, అలందికొని = పూసికొని, తొడవులు = నగలను, తొడిగికొని = పెట్టుకొని, తనకున్, భరతుఁడు, సమర్పించిన = ఇచ్చిన, రాజసింహాసనంబునన్, కూర్చుండి, అతనిన్, మన్నించి = గౌరవించి, కౌసల్యకున్, ప్రియంబు=సంతోషము, చేయుచున్, జగత్ + పూజ్యంబుగన్ = లోకమునకుఁ బూజింపఁదగినట్లు, రాజ్యంబున్ = పరిపాలనము, చేయుచున్ + ఉండెన్, అప్పుడు.

తా. తదుపరి గురువులవారేతెంచిరి. శ్రీరాముని జడలోని ముడులను సడలించి చిక్కుదీయించి, దేవేంద్రుని బృహస్పతి స్నానంబు చేయించిన చందంబున వసిష్ఠులవారు అచ్చట సమావేశమైన కులములోని పెద్దలు మంత్రముల వల్లెవేసి సముద్రమునుండియు నదులనుండియు నప్పుడే కొని తెచ్చిన నీటిచేఁ బుష్కలముగా నభిషేకము చేయించిరి. సీతాదేవితోఁగూడ రామచంద్రుఁడు జలకంబులాడి శుభ్రములైన వస్త్రముల ధరించి, మంచి పరిమళములుగల పువ్వులు

దుఱిమి సుగంధము నలందికొని, నగలను బెట్టుకొని, భరతుఁ డర్పించిన రాజసింహాసనమున నుపవిష్టుఁ డయ్యెను. శ్రీరామ చంద్రుఁడు భరతుని మన్నించి, తల్లియైన కౌసల్యకుఁ బ్రియంబు చేసెను. లోకులెల్లఁ దన్నుఁ బూజించునట్లు రాజ్యము నిరాకులముగాఁ బరిపాలించెను.

కలఁగు టెల్లను మానెఁ జలధు లేడింటికిఁ
  జలనంబు మానె భూచక్రమునకు
జాగరూకత మానె జలజలోచనునకు
  దీనభావము మానె దిక్పతులకు
మాసియుండుట మానె మార్తాండవిధులకుఁ
  గావిరి మానె దిగ్గగనములకు
నుడిగిపోవుట మానె నుర్వీరుహంబుల
  కడఁగుట మానెఁ ద్రేతాగ్నులకును
గడిఁది వ్రేఁగు మానెఁ గరిగిరికిటినాగ
కమఠములకుఁ బ్రజల కలఁక మానె
రామచంద్రవిభుఁడు రాజేంద్రరత్నంబు
ధరణిభరణరేఖఁ దాల్చునపుడు. 75

టీ. రాజ + ఇంద్రరత్నంబు = రాజశ్రేష్ఠులలో వన్నెకెక్కిన వాఁడగు, రామచంద్రవిభుఁడు, ధరణిభరణరేఖన్ + తాల్చునపుడు = భూభారమును నిర్వహించుచు రాజ్యము సేయుచుండఁగా, జలధులు + ఏడింటికిన్ = సప్తసముద్రములకును, కలఁగుట + ఎల్లను = మేర మీఱి పొంగుట, మానెన్ = లేకపోయెను; భూచక్రమునకున్ = (చక్రాకృతిగా నున్న) భూమికి, చలనంబు = కదలుట (భూకంపము), మానెన్; జలజ లోచనునకున్ = పద్మములవంటి నేత్రములు గలవాఁడైన విష్ణుమూర్తికి,

జాగరూకత = మేలుకొని (నిద్రలేక) యుండుట, మానెన్; దిక్పతులకున్ = ఇంద్రుఁడు మొదలైన యష్టదిక్పాలకులకును, దీనభావము = దిగులు, మానెన్, మార్తాండవిధులకున్ = సూర్యచంద్రులకు, మాసియుండుట = వెలుఁగుఁబాసి తేజోహీనమై యుండుట, మానెన్, దిక్ + గగనములకున్ = దిక్కులయందును, ఆకాశమునందును, కావిరి = ధూళివలని నల్లనిరంగు, మానెన్; ఉర్వీరుహంబులకున్ = చెట్లకు, ఉడిగిపోవుట = ఫలింపు లేక పోవుట, మానెన్; త్రేతాగ్నులకున్ = మూఁడు అగ్నులకు (గార్హపత్యము, ఆహవనీయము, దక్షిణాగ్ని) అడఁగుట = చల్లాఱుట, మానెన్, కరిగిరికిటినాగకమఠములకున్ = అష్టదిగ్గజములు, సప్తకులశైలములు, ఆదివరాహము, ఆదిశేషుఁడు, కూర్మరాజు, — వీనికి, కడిఁది బ్రేఁగు = (భూమిని మోయుటవలని) మిక్కిలి భారము, మానెన్ = సమసిపోయెను.

తా. మహానుభావుఁడైన శ్రీరామచంద్రుఁడు రాజ్యము సేయుచుండఁగాఁ బ్రజ లెట్టికష్టములు లేక సుఖంబుగ జీవించుచుండిరి. సముద్రము పొంగుట, భూమి కంపించుట, సూర్యచంద్రులు కాంతిహీనులగుట, దిగంతములు ధూళిధూసరితములగుట మొదలగు నెట్టి యరిష్టము లేకపోయెను. అతివృష్టి, అనావృష్టి గలుగకుండుటచే వృక్షములు నిత్యసస్యవంతములై యుండెడివి. ప్రజలు ధర్మరక్తి దైవభీతి కలవారగుటచే విధివిహితముగఁ ద్రేతాగ్నిహోమముల నెడఁబాయక నెఱవేర్చుచుండిరి. స్వీయాంశసంభూతుఁడైన శ్రీరాముని రాజ్యమిట్లు ధర్మబద్ధమై సుఖవంతమై యుండుటంజేసి, దుష్టశిక్షణ శిష్టరక్షణాద్యవసరములు గలుగకపోవుటచే విష్ణుమూర్తి నిర్విచారుఁడై నిద్రించుచుండెను. రాముఁడు దుష్టరాక్షసగణములను సంహరింపఁ జాలినవాఁ డగుటచే దేవతలు దిక్పతులు దైన్యముం బాసి ధైర్యముతో మెలఁగుచుండిరి. భూభారమంతయు రామచంద్రుఁడే నిర్వహించుటచేఁ గుల

శైలములు, దిగ్గజములు, భుజంగాధిపుఁడు, ఆదివరాహము శ్రమ తొలఁగి సంతసిల్లెడివి.

మఱియును— 76

పొలఁతుల వాలుచూపులయంద చాంచల్య
మబలల నడుములయంద లేమి
కాంతాలకములంద కౌటిల్యసంచార
మతివలనడకలయంద జడిమ
ముగుదల పరిరంభములయంద పీడన
మంగనాకుచములయంద పోరు
పడఁతుల రతులంద బంధసద్భావంబు
సతులఁ బాయుట లంద సంజ్వరంబు

ప్రియులుప్రియరాండ్ర మనముల బెరసి తార్పు
లంద చౌర్యంబు వల్లభు లాత్మసతుల
నాఁగి క్రొమ్ముళ్ళు వట్టుటం దక్రమంబు
రామచంద్రుఁడు పాలించు రాజ్యమందు. 77

టీ. రామచంద్రుఁడు పాలించు రాజ్యమందుౝ, చాంచల్యము = నిలుకడలేని చపలస్వభావము, పొలఁతుల = జవరాండ్రయొక్క, వాలు చూపులయందు + అ = ఓరగంటి చూపులలోమాత్రమే కలదు (మఱి యెందును లేదనుట— అనఁగాఁ బ్రజలు చపలులుగాక స్థితప్రజ్ఞులై యుండి రనుట); లేమి = పేదఱికము, అబలల = స్త్రీలయొక్క నడుములయందు + అ = నడుములలోమాత్రమే కలదు; కౌటిల్యసంచారము = వంకరనడక (కుటిల వర్తనము), కాంతా + అలకములయందు + అ = స్త్రీల ముంగురులలో మాత్రమే యుండెను; జడిమ = మాంద్యము (మొద్దుతనము) అతివల = స్త్రీలయొక్క,

నడకలయందు + అ=నడకలలోమాత్రమే యుండెను, పీడనము=ఒండొరుల రాఁచుకొని బాధించుట, మఁగువల = జవ్వనులయొక్క, పరిరంభముల యందు + అ=కౌఁగిలింతలలో మాత్రమే యుండెను, పోరు=పరస్పరము పోరాడుట (నీకంటె నేను గొప్పయని) అంగనాకుచములయందు + అ = విలాసినుల పాలిండ్లయందుమాత్రమే యుండెను; బంధసద్భావంబు = విషయ వాంఛలవలని బంధము; పడఁతుల రతులందు + అ=యువతులరతి సమయము లందుమాత్రమే కలుగుచుండెను, సంజ్వరంబు = సంతాపము, సతులకు = ప్రియురాండ్రను, పాయుటలందు + అ=ఎడఁబాసి పోవలసి వచ్చినప్పుడు మాత్రమే కలుగుచుండెను; చౌర్యంబు = దొంగతనము, ప్రియులు, ప్రియు రాండ్రకు, బెరసి = చేరి, తార్పులందు = వంచించి రమించుటయందు మాత్రమే, అక్రమంబు = అన్యాయము, వల్లభులు = భర్తలు, ఆఁగి=నిలిచి, ఆత్మసతుల=తమ భార్యల, క్రొమ్ముళ్ళుపట్టుటయందు + అ=సిగఁబట్టి చెంతకు లాగుకొనుటలో మాత్రమే గోచరించుచుండును. (అంతకు మించి మఱెక్క డను గోచరింపవని సర్వత్రాన్వయము,)

(76, 77) తా. ఇంకను-ఆ రామభద్రుని రాజ్యమునఁ బ్రజ లెంతటి ధర్మనిరతులు సత్యసంధులునై యుండిరనఁగా చాంచల్య మనునది పొలఁతుల చూపులలోనే యుండెడిది. (చంచలాక్షు లనుటచే స్త్రీలు విలాసినులనియు, చాంచల్యము ఇంక నెక్కడ లేదనుటచేఁ బ్రజలు నిశ్చలధీరభావులనియు స్వారస్యము.) లేమి, అబలల నడుములయందుమాత్రమే గోచ రించెడిది. (సన్నని నడుము గలవారగుటచే స్త్రీలు సౌందర్య వతులై యుండిరనియు, లేమిడి మఱెందును లేదనుటచేఁ బ్రజ లెల్లరు ధనికులనియుఁ జమత్కారము.) కుటిలగమనము కాంతల ముంగురులలో మాత్రమే కానవయ్యెడిది. (కాంతలు వక్రాలక లనియుఁ బ్రజలు సాధువర్తనులనియు విశేషార్థము.) మాంద్యము అతివల నడకలలోమాత్రమే యూహింపనయ్యె డిది. (సుందరులు మందయానలనియుఁ బ్రజలు కుశాగ్ర

బుద్ధులనియు సారస్యము). బంధము పడఁతులతోడి రతి వేళలలోమాత్రమే. పురుషులు స్త్రీలతో వివిధరతిబంధములఁ బెనఁగుచుండువారయ్యుఁ బుత్త్రప్రాప్తికొఱకే యట్లు చేయుచుండినవారై ఐహికబంధభావములకు దూరగులై యుండిరి. (రామరాజ్యమున అర్థకామములుగూడ ధర్మార్థములై యుండెడివి!) అంగనల కుచములుమాత్రమే యొండొంటితోఁ బోరాడుకొనెడివఁట. ఔన్నత్యమున నీకంటె నేను మిన్నయని యంగనల కుచములు పరస్పరము కలహించెడివేగాని, ప్రజలుమాత్ర మన్యోన్యవైషమ్యములులేక మెలఁగుచుండిరి. (స్త్రీలు పీనోత్తుంగపయోధరలనియుఁ బ్రజలెల్లరు సహనశీలురనియుఁ జమత్కృతి). పీడనము జవరాండ్ర కౌఁగిలింతలలో మాత్రమే సంభవించెడిది. (కౌఁగిలింతలలో యువతీయువకు లొండొరులఁ బీడించుచుండిరేగాని, ప్రజ లొక్కడింకొక్కనిఁ బీడించుట యనునట్టిదే లేకుండెను. స్త్రీపురుషులు ప్రణయపారీణులనియుఁ బ్రజలు సుహృదయులనియు భావము.) తాపము ప్రియావియోగమున మాత్రమే కలుగుచుండెడిది. (యువకులు ఏకపత్నీవ్రతులై సతుల నెడఁబాసినపుడు తపించుచుండిరి. ప్రజలు సంతాపరహితులై జీవించుచుండిరి). చౌర్యము ప్రియులు ప్రియురాండ్రను వంచించి రతికి నూల్కొల్పుటలో మాత్రమే తలంపనగును. (యువకులు చాతుర్యధురీణులనియు రాజ్యమునఁ జోరభీతి శూన్యమనియు విశేషము.) అక్రమము, ప్రియులు పొలయలుకఁ బూనితమ్ముఁ బాయుచున్న తమ కాంతలను సిగఁబట్టి తిగుచుటలోనే భావింపఁదగును. (పురుషులు ప్రణయకలహప్రియులనియుఁ బ్రజలు ధర్మబద్ధులనియు స్వారస్యము).

తండ్రిక్రియ రామచంద్రుఁడు
తండ్రుల మఱపించి ప్రజలఁ దా రక్షింపం
దండ్రుల నందఱు మఱచిరి
తండ్రిగదా రామచంద్రధరణిపుఁ డనుచున్. 78

టీ. రామచంద్రుఁడు, తండ్రి + క్రియన్ = తండ్రివలె, తండ్రులన్, మఱపించి, ప్రజలన్, తాన్, రక్షింపన్ = కాపాడఁగా, అందఱు = ప్రజలందఱు, రామచంద్రధరణిపుఁడు = రామచంద్రభూనాథుఁడు, తండ్రి గదా, అనుచున్, తండ్రులన్, మఱచిరి.

తా. తండ్రియగు దశరథుని ప్రజలు మఱచునట్లుగా శ్రీరామచంద్రుఁడు ధర్మపరిపాలన చేయుచుండెను. "శ్రీరాముఁడే మన తండ్రిగదా!" యని జనులెల్లరు సర్వకాలములఁ దలంచుచుండిరి. కన్నునకు ఱెప్పయుంబలె శ్రీరాముఁడు ప్రజలఁ గాపాడుచుండెను.

మఱియు నా రామచంద్రుండు రాజర్షిచరితుండును నిజధర్మనిరతుండును నేకపత్నీవ్రతుండును సర్వలోకసమ్మతుండును నగుచు ధర్మవిరోధంబుగాకుండఁ గోరిక లనుభవించుచుఁ ద్రేతాయుగంబైనఁ గృతయుగధర్మంబుఁ గావించుచు బాలమరణంబు మొదలగు నరిష్టంబులు ప్రజలకుఁ గలుగకుండ రాజ్యంబుసేయుచుండె నయ్యెడ. 79

టీ. మఱియున్, ఆ రామచంద్రుండు, రాజ + ఋషి + చరితుండును = రాజర్షుల నడవడి గలవాఁడును, నిజ + ధర్మ + నిరతుండును = నిజమగు ధర్మమందాసక్తిగలవాఁడును, ఏక + పత్నీ + వ్రతుండును = ఒక్క భార్య ననుభవించుటయే వ్రతముగాఁ గలవాఁడును, సర్వ + లోక + సమ్మతుండును

= అన్నిలోకములకు సంగీకృతుఁడైనవాఁడును, అగుచున్, ధర్మ + విరోధంబు = ధర్మమునకు వ్యతిరేకము, కాక + ఉండన్ = కాకుండునట్లు, కోరికలు, అనుభవించుచున్, త్రేతాయుగంబు + ఐనన్ = త్రేతాయుగమై నప్పటికిని, కృతయుగధర్మంబు, కావించుచున్ = నెఱపుచు, బాల మరణంబు = పసిబిడ్డలలోఁ జావులు మొదలగు, అరిష్టంబులు = కీడులు, ప్రజలకున్, కలుగక + ఉండన్, రాజ్యంబు, చేయుచు + ఉండెన్, ఆ + ఎడన్ = ఆ సమయమందు.

తా. శ్రీరామప్రభువు రాజర్షివలె మంచినడవడి గలిగి విధ్యుక్తధర్మములం దాసక్తినించి ప్రజల నేలుచుండెను. తా నేకపత్నీవ్రతుఁడని పేరుగాంచెను. సర్వలోకము లాతని పరిపాలన కంగీకరించెను. శ్రీరాముఁడు ధర్మమునకు వ్యతిరేకముగాని కోరికల ననుభవించుచు నత్తఱిఁ ద్రేతాయుగమైనను గృతయుగధర్మంబును నెఱపుచుండెను. దానం జేసి పసిబిడ్డలలోఁ జావులు లేవు. ఏ విధమగు కీడుగాని ప్రజలలో నుత్పన్నముగా లేదు. అట్టి సమయంబున.

సిగ్గుపడుట గల్గి సింగారమును గల్గి
భక్తి గల్గి చాల భయముఁ గలిగి
నయముఁ బ్రియముఁ గల్గి నరనాథు చిత్తంబు
సీత దనకు వశము సేసికొనియె. 80

టీ. సిగ్గు + పడుట = లజ్జ చెందుట, కల్గి, సింగారమును = అలంకార మును, కల్గి, భక్తి, కల్గి, చాల భయమున్, కల్గి, నయమున్ = నీతిని, ప్రియమున్ = సంతోషమును, కల్గి, నరనాథు + చిత్తమున్ = ప్రభువైన శ్రీరాముని హృదయమును, సీత, తనకున్, వశము + చేసి + కొనియెన్ = తనకు స్వాధీనమగునట్లుగాఁ జేసికొనెను.

తా. సీతాదేవి సహజమగు లజ్జచే, శృంగారముచే, భయభక్తులచే, నయప్రియములచే శ్రీరామచంద్రుని హృదయమును బరిపూర్ణముగాఁ జూఱఁగొనెను. శ్రీరామప్రభువు సీతాదేవి శీలమునకుఁ బూర్తిగా లొంగిపోయెను.

అనిన విని పరీక్షిన్నరేంద్రుం డిట్లనియె— 81

టీ. అనినన్, విని, పరీక్షిత్ + నర + ఇంద్రుఁడు=పరీక్షిత్తుఁ డను మహారాజు, ఇట్లు + అనియెన్ = ఇట్లని చెప్పెను.

తా. పై విధముగా శుకుండు చెప్పఁగా నాలకించి పరీక్షిన్మహారాజు ఇట్లనియెను.

భ్రాతృజనులయందు బంధువులందును
ప్రజలయందు రాజభావ మొంది
యెట్లు మెలఁగె రాఘవేశ్వరుం డీశ్వరుఁ
గూర్చి క్రతువు లెట్లు గోరిచేసె. 82

టీ. భ్రాతృ + జనుల + అందున్=తన తమ్ములపట్లను, బంధువులు + అందును = బంధువులపట్లను, ప్రజలు + అందున్, రాజ + భావము = రాజత్వము, ఒంది=పొంది, ఎట్లు + మెలఁగెన్=ఏ రీతిగాఁ బ్రవర్తించెను, రాఘవ + ఈశ్వరుండు=శ్రీరాముఁడు, ఈశ్వరున్ + కూర్చి, క్రతువులు, ఎట్లు, కోరి, చేసెన్.

తా. తన తమ్ములయెడలను, బంధువులపట్లను, ప్రజలయందును రాజభావము పొంది, శ్రీరామప్రభు వే రీతిగాఁ బ్రవర్తించెను? అతఁ డీశ్వరునికొఱకు యజ్ఞముల నేమి కోరి యొనర్చెను?

అనిన శుకుం డిట్లనియె. 83

టీ. అనినన్, శుకుండు, ఇట్లు + అనియెన్.

తా. అని పరీక్షిత్తు ప్రశ్నింపఁగా శుకుఁడిట్లు ప్రత్యుత్తర మొసంగెను.

భగవంతుఁడగు రామభద్రుండు ప్రీతితో
దేవోత్తముని సర్వదేవమయునిఁ
దనుఁ దాన కూర్చి యధ్వరములు సేసెను;
హోతకుఁ దూరుపు, నుత్తరంబు
సామగాయకునికి, శమనదిగ్భాగంబు
బ్రహ్మకుఁ, గ్రమమునఁ బడమరెల్ల
నధ్వర్యునకు, శేష మాచార్యునకు నిచ్చి,
సొమ్ములఁ బంచి భూసురుల కొసఁగి,

తనకు రెండుపుట్టంబులు దనకునయిన
మెలఁత మంగళసూత్రంబు మినుకుఁదక్క-
వినతుఁడై యుండె నా రాము వితరణంబు
పాండవోత్తమ! యేమని పలుకవచ్చు. 84

టీ. పాండవ + ఉత్తమ! = పాండవశ్రేష్ఠుఁడవైన యో పరీక్షిన్మహారాజా! భగవంతుఁడు, అగు, రామభద్రుండు, ప్రీతితోన్ = సంతోషముతో, దేవ + ఉత్తమునిన్ = దేవతలలో శ్రేష్ఠుఁడును, సర్వదేవమయునిన్ = అనేక విధములుగఁ జెప్పఁబడు దేవస్వరూపము లెల్లఁ దానే యగువాఁడును (అగు), తనున్, కూర్చి, తాను + అ = తానే, యధ్వరములు సేసెను = యజ్ఞము లొనరించెను. (అప్పుడు) క్రమమునన్ = వరుసగా, హోతకున్ = యజ్ఞహవిస్సును గొనువానికి, తూరుపున్ = తూరుపుదిక్కును, సామగాయకునికిన్ = సామవేదము చదివినవానికి, ఉత్తరంబున్ = ఉత్తరపు

దిక్కును, బ్రహ్మకున్, శమనదిక్ + భాగంబున్ = దక్షిణపు దిక్కును, అధ్వర్యునకున్=యజ్ఞాధికారికి, ఎల్లపడమరన్=పశ్చిమ దిగ్భాగమంతయు, శేషము = మిగిలినది, ఆచార్యునకున్=పురోహితునకు, ఇచ్చి, సొమ్ములన్, పంచి = భాగములు పెట్టి, భూసురులకున్ + ఒసఁగి = బ్రాహ్మణులకు దానము సేసి, తనకున్, తనదు, రెండుపుట్టంబులున్ = కట్టుగుడ్డయు నంగవస్త్రమునుమాత్రమే, అయినన్=మిగులఁగా, మెలఁత=సీతయొక్క, మంగళసూత్రంబు (లోని), మినుకు = తాళిబొట్టు, తక్కన్=మాత్రమే మిగిలినవై యుండఁగా, వినతుఁడు + ఐ=గరువము లేనివాఁడై, యుండెన్, ఆ రాముని, వితరణంబు = దానమహిమ, ఏమని చెప్పవచ్చున్=ఎంతయని పొగడఁదగును! (వర్ణనాతీతమని భావము.)

తా. శ్రీరాముఁడు తానే పరమేశ్వరుని యవతార విశేషసంజనితుఁడయ్యును, సామాన్యమానవుని చందంబున భగవంతునిఁగూర్చి యొక్క క్రతువు నొనరించెను. అట్టి సమయమున నాతఁడు చతుర్దిశావలయితమైన తన రాజ్య సర్వస్వమును యాగనిర్వాహకులకు ధారవోసెను; ధన ధాన్యాభరణాదివస్తునిచయము నెల్ల బ్రాహ్మణోత్తములకు దానము సేసెను; తాను గట్టు గుడ్డలతోను, దన భార్య మంగళసూత్రములోని తాళిబొట్టుతోను మిగిలినవారైరి. (అనివార్యము లగుటచేతనే యవిమాత్రము మిగిలినవి). ఇంతటి వితరణశాలి యయ్యు నాతఁ డించుకయేని గరువము లేక నమ్రుఁడై యుండెను. అట్టి రఘుకులేశ్వరుని సౌజన్య త్యాగముల నెంతని గొండాడ నగును!

అంత నా రామచంద్రుని దానశీలత్వంబునకు మెచ్చి విప్ర వరులు దమతమ భూములు మరల నిచ్చి యిట్లనిరి. 85

టీ. అంతట, ఆ రామచంద్రుని, దాన + శీలత్వంబునకున్ = ఈవి యందలి మంచి నడతను, మెచ్చి = మెచ్చుకొని, విప్రవరులు = బ్రాహ్మణోత్తములు, తమతమ భూములు, మరలన్ + ఇచ్చి = తిరిగి యొసఁగి, ఇట్లు + అనిరి.

తా. బ్రాహ్మణోత్తములు శ్రీరామప్రభుని దాన గుణమునకు నాతని శీలమునకు మెచ్చుకొని తమ కొసంగిన భూముల నెల్లఁ దిరిగి వానికిచ్చి యిట్లనిరి.

ధరణి వలదు మాకుఁ దపసుల కేల నీ
వఖిలలోకగురుఁడవైన హరివి
మా మనంబులందు మలయు చీఁకటిఁ బాపు
భవదుదారరుచులఁ బార్థివేంద్ర! 86

టీ. పార్థివ + ఇంద్ర! = ఓ రాజా! మాకు, ధరణివలదు = భూమి యవసరము లేదు, తపసులకున్ + ఏల = తపస్సు చేసికొను మాకు ఎందులకు? నీవు, అఖిల + లోక + గురుఁడవు + ఐన = సర్వ ప్రపంచములకుఁ బెద్దవైన, హరివి = విష్ణువవు, మా + మనంబులు + అందున్ = మా మనస్సులలో, మలయు = వ్యాపించు, చీఁకటిన్ = అజ్ఞానమును, భవత్ + ఉదార + రుచులన్ = నీయొక్క గొప్పవైన జ్ఞానకాంతులచే, పాపుము = పోఁగొట్టుము.

తా. ఓ రాజా! మేము రేయింబవళ్ళు తపసు చేయు వారము. మాకు ఈ భూము లవసరము లేదు. వీనినిఁ బరిగ్రహింపుము. నీవు సర్వలోకములకు గురుఁడవైన హరివి. మా హృదయములందు వ్యాపించియున్న యజ్ఞానమును నీ యుదార జ్ఞానకాంతులచేఁ బోఁగొట్టి మమ్ము ధన్యులం గావింపుము.

అని పలికి బ్రహ్మణ్యదేవుండైన రామచంద్రుని విన
యోక్తులం బూజించి మునులు సనిరి. ఇట్లు పెద్దకాలంబు
రాజ్యంబుసేసి రాఘవేంద్రుం డొక్కదినంబున. 87

టీ. అని, పలికి, మునులు, బ్రహ్మణ్యదేవుండు + విన = బ్రాహ్మణులకు హితముగూర్చెడు భగవంతుఁడైన, రామచంద్రుని = శ్రీరాముని, వినయ + ఉక్తులన్ = అడఁకువగల్గిన మాటలచే, పూజించి = కొలిచి, చనిరి, ఇట్లు, పెద్దకాలంబు = చాలకాలము, రాజ్యంబుచేసి = పరిపాలించి, రాఘవ + ఇంద్రుఁడు, ఒక్కదినంబునన్.

తా. అని వచించి మునులు బ్రాహ్మణులకు మేలుఁ గూర్చు నట్టివాఁడైన శ్రీరామచంద్రుని వినయవాక్కుల చేఁ బ్రశంసించి తమదారిం బోయిరి. శ్రీరాముఁడు శాంతి యుతముగా రాజ్యమును గలకాల మిట్లే పరిపాలించెను. ఒక్కనాఁడు.

వసుధపైఁ బుట్టెడువార్త లాకర్ణించు
    కోఱకునై రాముండు గూఢవృత్తి
నడురేయి దిరుగుచో నాగరజనులలో
    నొక్కఁడు దనసతి యొప్పకున్న
నొరునింటఁ గాఁపురంబున్న చంచలురాలిఁ
    బాయంగలేక చేపట్టనేమి
తా వెఱ్ఱియగు రామధరణీశ్వరుండనే
    బేలపొమ్మను మాట బిట్టువలుక

నాలకించి మఱియు నా మాట చారుల
వలన జగములోనఁ గలుగఁ దెలిసి

88

సీత నిద్రవోవఁ జెప్పక వాల్మీకి
పర్ణశాలఁ బెట్టఁబనిచె రాత్రి. 88

టీ. వసుధపైన్ = భూమిమీఁద, పుట్టెడు + వార్తలు, ఆకర్ణించు + కొఱకున్ + ఐ = వినుటకుఁగా, రాముండు, గూఢవృత్తిన్ = రహస్యముగ, నడురేయిన్ = అర్ధరాత్రమందు, తిరుగుచోన్ = తిరుగుచుండఁగా నాగరజనులలో = నగరమందలి ప్రజలలో, ఒక్కఁడు, తన + సతిన్ = తనభార్యను, ఒప్పక + ఉన్నన్ = అంగీకరింపక యుండఁగా, ఒరు + ఇంటన్ = ఇతరుల యింటిలో, కాఁపురంబు + ఉన్న = నివాసము చేసిన, చంచలురాలిన్ = చంచల స్వభావముగలదానిని, పాయఁగన్ + లేక = విడువలేక, చే + పట్టన్ = గ్రహించుటకు, ఏమి, తాన్, వెఱ్ఱి + అగు = పిచ్చివాఁడగు, రామధరణీ + ఈశ్వరుండన్ + ఏ = రామభూపాలుఁడనా? ఛీ! ఛీ! = ఓ మూఢులారా! పొమ్ము = వెడలిపొమ్ము, అనుమాట, బిట్టు + పలుకన్ = బిగ్గఱగాఁ బలుకఁగా, ఆలకించి = విని, మఱియున్ = ఇంకను, ఆ మాట, చారులవలనన్ = వేగువాండ్లచే, జగములోనన్ = తన రాజ్యమందు, కలుగన్ = కలిగియున్నట్లుగా, తెలిసి = ఎఱిఁగి, సీత, నిద్ర, పోవన్, చెప్పక = ఆమెకు నేవార్తయుఁ దెలుపక, వాల్మీకి + పర్ణశాలన్ = వాల్మీకిమహర్షి పర్ణశాలయందు, పెట్టన్ = ఉంచుటకు, రాత్రిన్, పనిచెన్ = పంపెను.

తా. తన రాజ్యములోఁ బ్రజలందుఁ బుట్టెడువార్తలు వినుటకొఱకు రాముఁడు రహస్యముగా మాఱువేసము దాల్చి అర్ధరాత్రమునందు నయోధ్యాపురమునఁ దిరుగాడుచుండెను. నగరమందలి ప్రజలలో నొక్కఁడు తన భార్యతోఁ దగవులాడుచు మరల నామె నింటిలోనికి రానిచ్చుట కంగీకరింపలేదు. "ఏమి—ఇతరుల యింటిలోఁ గాఁపురము చేసిన చపలురాలిని సీతను విడువలేక పరిగ్రహించుటకు నేను రామభూపాలుఁడనా? ఛీ! ఛీ! ఓ మూఢురాలా! వెడలిపొమ్ము" అని బిగ్గఱగా నఱచి చెప్పెను. శ్రీరాముఁ డా పల్కులువిని

నిర్ఘాంతపోయి "అగ్నిచేఁ బరిశుద్ధురాలైన సీతను మహా పతివ్రతను నిందానివారణార్థ మడవులకుఁ బంపుటయే యుక్తము" అని నిశ్చయించుకొనెను. చారులవలన సీతా దేవిపై నట్టి యపవాదము తనరాజ్యములోఁ బుట్టెనని తెలిసికొని శ్రీరాముఁడు మఱింత చిన్నఁబోయెను. శ్రీరాముని యాజ్ఞపై లక్ష్మణుఁడు రథంబు నాయత్తపఱచి తెచ్చి సీతా దేవినిఁ జిత్రశాల ద్వారమున నిలిపి యప్పుడే మేల్కాంచిన వదినెకు నమస్కరించి "అమ్మా! రథము సిద్ధముగా నున్నది; నీకోర్కెమేరకు నదీవనగిరులను జూడవచ్చు"నని చెప్పెను. ప్రాణనాథుఁడు తన వాంఛను వెంటనే తీర్ప ననుగ్రహించెనని అమాయకురాలగు సీత రథము నెక్కి బయలుదేఱెను. రథము కదలినంతనే యశుభములు పెక్కు లయ్యెను. రథము గోమతీతీరమందలి యాశ్రమప్రదేశములఁ జేరెను. మరునాఁడంద ఱు గంగానదినిఁ జేరిరి. పడవమీఁద నవ్వలిగట్టును జేరిరి. లక్ష్మణుఁడు సీతాదేవికడకు వచ్చి యెలుఁగెత్తి యేడ్చి, "తల్లీ! పౌరాపవాదభీతిచే రాజు నిన్నుఁ ద్యజించెను; ఆశ్రమాంతములందు నిన్నుఁ బాఱవైచిపోవు మహాపాతకము నానొసట వ్రాసియున్నది" అని యా కఠోరవార్త సీతాదేవికి విన్నవించి పిచ్చివానివలెఁ దిరిగివచ్చెను. సీతాదేవి తన దౌర్భాగ్యమును దలఁచి వెక్కివెక్కి విలపింప సాగెను. ఈసంగతి మునిబాలకులవలన విని వాల్మీకిమహర్షి సీతకడకేఁగి యామె నోదార్చి తన యాశ్రమమునకుఁ గొని పోయెను. మునిపత్నులు సీతాదేవికి శుశ్రూష గావించు చుండిరి.

అంత సీతయు గర్భిణి గావునఁ గుశలవు లనియెడి కొడుకులం
గనియె. వారికి వాల్మీకి జాతకర్మంబు లొనరించె. లక్ష్మ
ణునకు నంగదుండును జంద్రకేతుండును భరతునకు దక్షుం
డును బుష్కలుండును శత్రుఘ్నునకు సుబాహుండును శ్రుత
సేనుండును సంభవించిరి. అయ్యెడ— 89

టీ. అంతన్, సీతయు, గర్భిణి=గర్భము ధరించినది, కావునన్ =కాఁబట్టి, కుశలవులు, అనియెడి, కొడుకులన్, కనియెన్=ప్రసవించెను, వారికిన్, వాల్మీకి, జాత+కర్మంబులు = పుట్టినప్పుడు చేయు క్రియలు, ఒనరించెన్ = చేసెను, లక్ష్మణునకున్, అంగదుండును చంద్రకేతుండును =అంగదుఁడును చంద్రకేతుండను కుమారులును, భరతునకున్, దక్షుండును పుష్కలుండును = దక్షుఁడును పుష్కలుఁడును అను పుత్త్రులును, శత్రుఘ్నునకున్, సుబాహుండును శ్రుతసేనుండును = సుబాహుండును శ్రుతసేనుండను కొమరులును, సంభవించిరి = పుట్టిరి, ఆ+ఎడన్ = ఆ సమయమందు.

తా. అంతఁ గొంతకాలమునకు సీతాదేవికి నిరువురు పుత్త్రు లుదయించిరి. అర్ధరాత్రంబున మునిబాలకులు వచ్చి యీ సంగతి వాల్మీకికి వినిచిరి. వాల్మీకిమహర్షి యీ నిసువులను జూచి సంతసించి కుశలవంబులతో వారికి రక్షఁగట్టి 'కుశను' (దర్భాగ్రభాగము) రక్షగాఁ గట్టిన యతఁడు 'కుశుఁ' డనియు, లవమును (దర్భ మొదటిభాగమును) రక్షగాఁ గట్టినవాఁడు లవుఁడనియు నామకరణము చేసెను.

అయోధ్యానగరమందు లక్ష్మణునకుఁ జంద్రకేతుండు, అంగదుఁ డను పుత్త్రులు జన్మించిరి. భరతునకుఁ బుష్కలుండును, దక్షుఁ డను కుమారులు పుట్టిరి. శత్రుఘ్నునకు సుబాహుండు, శ్రుతసేనుం డను కొమరులు జనియించిరి. బిడ్డలందఱ అల్లారుముద్దుగాఁ బెరుఁగుచుండిరి.

బంధురబలుఁ డగు భరతుఁడు
గంధర్వచయంబుఁ ద్రుంచి కనకాదుల స
ద్బంధుఁడగు నన్న కిచ్చెను
బంధువులును మాతృజనులుఁ బ్రజలుల్ మెచ్చన్. 90

టీ. బంధుర + బలుఁడు + అగు = ఒప్పిదమైన పరాక్రమముగల, భరతుఁడు, గంధర్వచయంబున్ = గంధర్వ సమూహమును, త్రుంచి = చంపి, కనక + ఆదులన్ = బంగారము మొదలగు వస్తువులను, సత్ బంధుఁడు + అగు = ప్రియమగు బంధువైన, అన్నకున్ = శ్రీరామునకు, బంధువులు, మాతృజనులున్ = తల్లు లందఱు, ప్రజలున్, మెచ్చన్ = మెచ్చఁగా, ఇచ్చెన్ = ఒసంగెను.

తా. ఒకనాఁడు శ్రీరామునికడకు గార్గమహర్షి వచ్చి "రామా! సింధునది యుభయతటంబుల మూఁడుకోట్ల గంధర్వులు సాధువుల బాధించుచున్నారు. వారిని నీవు సంహరించి నీ సుతులలో నొకని నిలిపి కీర్తిఁబడయుము" అని నివేదించెను. శ్రీరామప్రభువు వెంటనే భరతుని యిరువురి పుత్త్రులకుఁ దద్రాజ్యపట్టాభిషేక మొనర్చి భరతునితో ససైన్యముగాఁ దరలించెను. గంధర్వులకు భరతాదులకు ఘోరరణ మయ్యెను. గంధర్వులెల్ల రెచ్చటివా రచ్చటనే పడి క్షణములో మడిసిరి. అతిబలాఢ్యుఁడగు భరతుఁ డంతట గంధర్వరాజ్యంబును వశ మొనర్చుకొనెను. గంధర్వదేశమందలి కనకధనధాన్యాదులు తెచ్చి తల్లులు, ప్రజలు మెచ్చఁగా భరతుఁడు తన ప్రియబంధువైన శ్రీరామప్రభువునకు నొప్పగించెను. శ్రీరాముఁడును బరమామోదము నందెను.

మధువనంబులోన మధునందనుండగు
లవణుఁ జంపి భుజబలంబు మెఱసి
మధుపురంబు సేసె మధుభాషి శత్రుఘ్నుఁ
డన్న రామచంద్రుఁ డౌ ననంగ. 91

టీ. మధుభాషి = తేనెలవలెఁ దియ్యఁగా మాటాడునట్టి, శత్రుఘ్నుఁడు, మధువనంబులోనన్, మధు + నందనుండు + అగు = మధుఁడను రాక్షసుని కుమారుఁడైన, లవణున్ = లవణాసురుని, చంపి, భుజబలంబు = బాహువులందలి పరాక్రమము, మెఱసి = ఒప్పఁగాఁ జేసి, రామచంద్రుఁడు, ఔ + అనన్ + కన్ = అవునవుననంగ, మధుపురంబు, చేసెన్ = ఒనర్చెను.

తా. ఒకనాఁడు సభలో భార్గవాదిమును లేతెంచి "రామా! లవణుఁడను రాక్షసుఁడు మధువనంబున వసించుచుఁ గంటఁబడిన తాపసులను భక్షించుచున్నాఁడు. మమ్ము రక్షింపుము" అని వేఁడిరి. శత్రుఘ్నుఁడు లవణునిఁ జంపుటకు నంగీకరించెను. శత్రుఘ్నుఁడు తల్లులకు మ్రొక్కి పయనమై పోయి మధుపురద్వారమును జేరి లవణాసురునికొఱకు వేచియుండెను. కొంతతడవునకు లవణాసురుఁడు రాఁగా వానితో శత్రుఘ్నుఁడు ద్వంద్వయుద్ధము చేసి మూర్ఛిల్లెను. కొంతవడికిఁ దేఱి శత్రుఘ్నుఁడు శ్రీరాముఁడు తన కొసంగిన యమోఘశరంబును బూని లవణునిమీఁదికి విడిచెను. ఆ బాణము జ్వాలలు గ్రక్కుచు వైరియురంబును వ్రీల్చెను. లవణుఁడు మహాశైలమట్లు దొరలి క్షణములో మడిసెను. శత్రుఘ్నుఁ డంత మధుపురంబు ప్రవేశించి యా వార్త శ్రీరాముని కెఱింగించెను. వసిష్ఠాదిమునులు వచ్చి శత్రుఘ్నునకు మధురాజ్యపట్టాభిషేకంబును సమంత్రకంబుగా నొనర్చిరి.

అంతఁ గొంత కాలంబునకు రామచంద్రుని కుమారులయిన
కుశలవు లిద్దఱును వాల్మీకివలన వేదాదివిద్యలయందు నేర్పరులై
పెక్కుసభల సతానంబుగా రామకథాశ్లోకంబులు పాడుచు
నొక్కనాఁడు రాఘవేంద్రుని యజ్ఞశాలకుం జని— 92

టీ. అంతన్, కొంత కాలంబునకున్, రామచంద్రుని, కుమారులు + అయిన, కుశలవులు, ఇద్దఱును, వాల్మీకి, వలనన్, వేద + ఆది + విద్యలు + అందు = వేదములు మొదలగు శాస్త్రములందు, నేర్పరులు + ఐ = నిపుణులై, పెక్కు, సభలన్, సతానంబుగాన్=తానముతోఁగూడ (తానమనఁగా సంగీతమున స్వరముల ప్రస్తారవిశేషము), రామ + కథా + శ్లోకంబులు, పాడుచున్, ఒక్కనాఁడు, రాఘవ + ఇంద్రుని=శ్రీరాముని యొక్క, యజ్ఞశాలకున్, చని = పోయి.

తా. కొంత కాలంబునకు వాల్మీకి యాశ్రమమందు శ్రీరామచంద్రుని కుమారులగు కుశలవు లిద్దఱును వేదాది విద్యలందు మిక్కిలి ప్రవీణులై యనేకసభలలో రామకథా శ్లోకంబులఁ బాడుచు, నొక్కదినంబున శ్రీరాముని యజ్ఞ శాలకుఁ బోయిరి.

వట్టిమ్రాఁకులు పల్లవింప న
వారిగమై మధుధార దా
నుట్టఁబాడిన వారి పాటకు
నుర్వరాధిపుఁడున్ బ్రజల్
బిట్టు సంతస మంది రయ్యెడఁ
బ్రీతిఁ గన్నుల బాష్పముల్
దొట్టనొందల లూఁచి వారల
తోడి మక్కువ పుట్టఁగాన్. 93

టీ. వట్టి + ప్రాఁకులు = ఏమియు లేని (ఎండిపోయిన), ప్రాఁకులు = చెట్లు, పల్లవింపన్ = చిగుర్పఁగా, అ + వారి + ఐ = అపరిమితమై, మధు + ధార = తేనెధారలు, తాన్, ఉట్టన్ + పాడిన = స్రవించునట్లు పాడఁగా, వారి = కుశలవులయొక్క, పాటకున్, ఉర్వర + అధిపుఁడున్ = భూనాథుఁడైన రామచంద్రుఁడును, ప్రజల్ = జనులు, ఆ + ఎడన్ = ఆ చోటియందు, ప్రీతిన్ = ప్రేమతో, కన్నులన్ = నేత్రములనుండి, బాష్పముల్ = కంటినీరు, తొట్టన్ = కాఱఁగా, ఔఁదలలు = శిరస్సులను, ఊఁచి = కదలించి, వారల + తోడి = కుశలవులమీఁది, మక్కువ = ప్రేమ, పుట్టన్ + కాన్ = జనింపఁగా, బిట్టు = మిక్కిలి, సంతసము + అందిరి = సంతోషమందిరి.

తా. కుశలవులపాటకు నెండిన ప్రాఁకులు చిగురించెను. ఆ గానమునుండి యనర్గళముగాఁ దేనెధార లుట్టిపడఁగా సభయందు శ్రీరామప్రభువునకు ప్రజలకు నానందబాష్పములు నేత్రములనుండి తొరఁగి కాల్వలై పాఱెను; సభ్యులందఱు తన్మయులై పలుమాఱు తల లూఁచిరి; కుశలవులమీఁదిప్రేమ వారికెల్లరకు నపారమయ్యెను.

అంత నా రామచంద్రుండు కుమారుల కిట్లనియె. 94

టీ. అంతన్, ఆ రామచంద్రుఁడు, కుమారులకున్, ఇట్లు + అనియెన్.

చిన్నయన్నలార! శీతాంశుముఖులార!
నళినదళవిశాలనయనులార!
మధురభాషులార! మహిమీఁద నెవ్వరు
దల్లిదండ్రి మీకు ధన్యులార! 75

టీ. చిన్న + అన్నలార = చక్కని పిల్లలారా! శీతాంశు + ముఖులార! = చంద్రునివంటి ముఖములఁ గలిగినవారా! నళిన + దళ = తామరరేకులవలె, విశాల = వెడఁదలైన, నయనులారా! = కన్నులు గలిగినవారా! మధుర + భాషులార! = తీయఁగా మాటాడువారా! ధన్యులారా! = పుణ్యులారా! మహిమీఁదన్ = భూమిపైన, మీకున్ తల్లి, దండ్రి, ఎవ్వరు?

(94, 95) తా. అంత శ్రీరామచంద్రుఁడు బాలకులను బిల్చి ఓ చక్కనిపిల్లలారా! తామరరేకులవలె వెడందలైన కన్నులుగలిగి క్రొందేనెలవంటి తీయనిపల్కులఁ బలుకుచు మీరు ముద్దుఁ గూర్చుచున్నారు. మిమ్ములనుగన్న తల్లి దండ్రు లెవ్వరు? అని యడిగెను.

అనిన, వార "లేము వాల్మీకిపౌత్రులము రాఘవేశ్వరుని యాగంబు సూడవచ్చితి" మనవుఁడు మెల్లన నగి యెల్లి ప్రొద్దున మీతండ్రి నెఱింగెద రుండుండని యొక్క నివాసంబునకు సత్కరించి పనిచె. మఱునాఁడు సీతం దోడ్కొని కుశలవుల ముందటనిడుకొని వాల్మీకివచ్చి రఘుపుంగవునిం గని యనేకప్రకారంబుల వినుతించి యిట్లనియె. 96

టీ అనినన్, వారలు = ఆ కుశలవులు, ఏము = మేము, వాల్మీకి పౌత్రులము = వాల్మీకిమహర్షి మనుమలము, రాఘవేశ్వరుని, యాగంబు, చూడన్, వచ్చితిమి, అనవుఁడున్ = అని చెప్పఁగా, మెల్లనన్, నగి = నవ్వి ఎల్లి = రేపు, ప్రొద్దునన్ = ప్రభాతమందు, మీ తండ్రిన్, ఎఱింగెదరు, ఉండుండు + అని, ఒక్క, నివాసంబునన్ = గృహమునకు, సత్కరించి = గౌరవించి, పనిచెన్ = పంపెను, వాల్మీకి, మఱునాఁడు, సీతన్, తోడ్కొని = వెంటఁదీసికొని, కుశలవులన్, ముందటన్, ఇడుకొని, వచ్చి రఘుపుంగవున్, గని, అనేక + ప్రకారంబులన్ = పలువిధముల, వినుతించి = పొగడి, ఇటు, అనియెన్.

తా. అనిన కుశలవులు వినయవిధేయులై శ్రీరాము నకు మ్రొక్కి "ఓ ప్రభూ! మేము వాల్మీకి మునుమలము; శ్రీరామచంద్రుని యజ్ఞంబును జూడవచ్చితిమి" అని చెప్పఁగా శ్రీరాముఁడు మందహాససుందరవదనారవిందుఁడై "రేపు మీ తండ్రిని మీరు తప్పక యెఱింగెదరు" అని నమ్మఁబలికి వారలను గౌరవించి యచ్చటి నివాసమునకు నాఁడు పంపెను. మఱునాఁడు వాల్మీకిమహర్షి సీతాదేవినిఁ దోడ్కొని కుశ లవులతోవచ్చి శ్రీరామభూనాథుని ననేకవిధంబుల స్తుతించి యిట్లనియెను.

సీత శుద్ధురాలు చిత్తవాక్కర్మంబు
లందు సత్యమూర్తి యమలచరిత
పుణ్యసాధ్వి విడువఁబోలదు చేకొను
రవికులాబ్ధిచంద్ర! రామచంద్ర! 97

టీ. రవి + కుల + అబ్ధి + చంద్ర=సూర్యవంశమను సముద్రమునకుఁ చంద్రునివంటివాఁడా! రామచంద్ర!, సీత, శుద్ధ + ఆలు = పరిశుద్ధమైన భార్య (అనఁగా మహాపతివ్రత యని అర్థము), చిత్త + వాక్ + కర్మంబులు + అందుఁ=మనోవాక్కాయకర్మలందు, సత్యమూర్తి సత్యసంధురాలు, అమల + చరిత = నిర్మలమైన చరిత్రగలది, పుణ్య + సాధ్వి=ధన్యురాలైన పతివ్రత, విడువఁ + పోలదు=విడిచిపెట్టుట న్యాయముగాదు, చేకొను(ము) = పరిగ్రహింపుము.

తా. ఓ రామా! నీవు సూర్యవంశమను సముద్ర మునకుఁ జంద్రునివంటివాఁడవు; నీ భార్యయగు సీతాదేవి యతిపరిశుద్ధురాలు; మనో వాక్కాయకర్మములందు నిత్య సత్యవ్రత; నిర్మలమైన చరిత్రగలది; అత్యంత పుణ్యురాలు;

అట్టి మహాసాధ్విని నీవు విడిచిపెట్టుట న్యాయముగాదు; ఈమెను బరిగ్రహింపుము.''

అని వాల్మీకి పలుక రామచంద్రుండు పుత్త్రార్థియై విచారింపఁ గుశలవులను వాల్మీకికి నొప్పగించి రామచంద్రచరణ ధ్యానంబుసేయుచు నిరాశయై సీత భూవివరంబుసొచ్చెను. అయ్యెడ. 98

టీ. అని, వాల్మీకి, పలుకన్, రామచంద్రుండు, పుత్త్ర + అర్థి + ఐ = కుమారులకొఱకై, విచారింపన్ = దుఃఖింపఁగా, సీత, కుశలవులను, వాల్మీకికిన్, ఒప్పగించి = అప్పగించి, రామచంద్ర చరణ ధ్యానంబు= శ్రీరాముని పాదధ్యానము, చేయుచున్ = ఒనర్చుచు, నిరాశ + ఐ = భర్తతో మరలఁ గూడు నాశలేనిదై, భూవివరంబు = భూమిలో నేర్పడిన రంధ్రమును, చొచ్చెను = ప్రవేశించెను, అ + ఎడన్ = అప్పుడు.

తా. అని వాల్మీకిమహర్షి కంఠోక్తముగాఁ జెప్పెను. కుశలవులును శ్రీరామచంద్రునకు నమస్కరించి తమ తల్లినిఁ జేకొనుమని ప్రార్థించిరి. శ్రీరాముఁ డందులకు దుఃఖించి వాల్మీకి నుద్దేశించి "మహాభాగా! సీత యెట్టి పాప మెఱుంగ దని తెలిసియు లోకమునకు వెఱచి యీ పడంతినిఁ ద్యజించి తిని. నా యీ తప్పు క్షమింపవేఁడెదను. ప్రజలు ఋషి వాక్యములకుఁ దనివిచెందుట లేదు. సీతాదేవియే నిజశుద్ధినిఁ గూర్చి స్వయముగాఁ బలుకుటమేలు'' అని వక్కాణించెను. కాషాయవస్త్రయగు సీతాదేవి సభ్యులమ్రోల నిలిచి శ్రీరాముని మరలఁజేరు నాసవీడి "నేను శ్రీరామునిఁ దప్పనిదాననౌట నిజమైనచో నన్ను నీలోనికిఁ గొంపోవుము'' అని దీనాతి దీనముగా భూదేవినిఁ బ్రార్థించెను. ధరాతలంబు వెంటనే

పెట్లిల్లునఁ బగిలి మహాబిలం బొకటి యేర్పడెను. ఒక్క దివ్యసింహాసనంబును మోసికొని నాగకన్యలు వచ్చిరి. వెను వెంట నొక దివ్యాంగన యుద్భవిల్లి సీతాదేవినిఁ గవుంగలించి కన్నీరు దుడిచి తత్సింహాసనమున నామెను గూర్చుండఁ బెట్టుకొని రసాతలము సొచ్చెను. సభాగతు లెల్లరు విస్మయ మందిరి.

ముదితా! యేటికిఁ గ్రుంకితీవు మనలో
మోహంబు చింతింపవే
వదనాంభోజము సూపవే మృదువు నీ
వాక్యంబు విన్పింపవే
తుదిసేయం దగదంచు నీశ్వరుఁడునై
దుఃఖించె భూపాలుఁ; డా
పదగాదే ప్రియురాలిఁ బాసినతఱిన్
భావింప నెవ్వారికిన్. 99

టీ. ముదితా! = ఓ సీతా! ఏటికి = ఎందులకు, ఈవు, క్రుంకితివి = భూమిలోనికి దిగఁబడితివి? మనలో = మన ఉభయులలో, మోహంబు = ప్రేమను, చింతింపవు + ఏ = ఆలోచింపవా? వదన + అంభోజము = ముఖకమలమును, చూపవు + ఏ = చూపవా? మృదువు = సుకుమారమైన, నీ వాక్యంబు = నీ పలుకులను, విన్పింపవు + ఏ = వినిపింపవా? తుది + చేయన్ + తగదు + అంచున్ = అంతముచేయుట పాడిగాదనుచు, భూపాలుఁడు = ప్రభువైన శ్రీరామచంద్రుఁడు, ఈశ్వరుఁడున్ + ఐ = లోకాంతమునకుఁ గారణభూతుఁడైన శివుఁడైనప్పటికిని, దుఃఖించెన్ = విలపించెను, భావింపన్ = తలపఁగా, ప్రియురాలిన్ = ప్రియయైన భార్యను, పాసిన + తఱిన్ = విడిచిపెట్టినవేళలో ఏ + వారికిన్ = ఎవరికైనను, ఆపద + కాదు + ఏ = విపత్తు కాదా?

తా. సీతాదేవి యట్లు చనుట రాముఁడు చూచి నేత్రంబులఁ గన్నీరుమున్నీరుగా స్రవింప "ఓ సీతా! ఓ సీతా! నీ వెల్లప్పుడు సంతోషముతో నుండెడిదానవు; ఎందులకు భూమిలోనికిఁ బ్రవేశించితివి? మన యిరువురకుఁగల యుత్కట ప్రేమను దలంపక పోతివా? తామరవంటి నీ ముద్దుమోమును నాకుఁ జూపవా? అతి సుకుమారమైన నీపలుకులను వినిపింపవా? ఈకరణి నా జీవిత మంతము చేయుట పాడియా?" అని వాపోవ సాగెను. శ్రీరాముఁడు సర్వజ్ఞుఁడైన పరమేశ్వరుఁడే యయ్యును ప్రియురాలి యెడఁ బాటును గూర్చి పొరిఁబొరి దుఃఖించెను. అవును అది సహజమే. ఎట్టివారికైనను ప్రేయసినిఁ బాసినప్పు డాపద చేకూరును గదా?

అని వగచి రామచంద్రుండు బ్రహ్మచర్యంబు ధరియించి
పదమూఁడువేల యేండ్లెడ తెగకుండ నగ్నిహోత్రంబులు
సెల్లించి తా నీశ్వరుండు గావునఁ దన మొదలి నెలవునకుం
జనియెను. ఇవ్విధంబున. 100

టీ. అని, వగచి = దుఃఖించి, రామచంద్రుఁడు, బ్రహ్మచర్యంబు = బ్రహ్మచర్యమను ఆశ్రమవిశేషము, ధరించి = తాల్చి, పదమూఁడు + వేలు + ఏండ్లు, ఎడ తెగక + ఉండన్ = విడువకుండ, అగ్నిహోత్రంబులు = హవిస్సులు, చెల్లించి, తాన్, ఈశ్వరుండు = శివుఁడు, కావునన్, తన మొదలి + నెలవునకున్ = పూర్వస్థానమునకు, చనియెను, ఈ + విధంబునన్ ఈ రీతిగా.

తా. అనంతరము శ్రీరాముఁడు పదమూఁడువేలేండ్లు విధివిరామము లేకుండ హవిస్సులు చెల్లించి కుశునిఁ గోసల రాజ్యంబులకు లవుని నుత్తర కోసలరాజ్యంబులకుఁ బట్టము

గట్టెను. తన సుతులను లక్ష్మణ భరత శత్రుఘ్నుల పుత్త్రులను రావించి వారినెల్లరను గాఢాలింగన పురస్సరంబుగా దీవించి "ఇఁక మీరు మీ జీవితభారంబును స్వయముగా వహించి ప్రజలఁ బరిపాలింపుఁడు" అని చెప్పెను. తెల్లవాఱినంత రాముఁడు వసిష్ఠుని రావించి మహాప్రస్థానికమును విధిపూర్వకముగాఁ గావింపించెను. రాముఁడు సూక్ష్మాంబరము గట్టి గృహమునుండి వెడలెను. భరత శత్రుఘ్ను లాతని వెన్నంటిరి. రాముఁడు గడసారి చూపిదే యని రాజ్యమెల్ల పయిఁబయిఁ బడి వెల్లివిరిసెను. శ్రీరాముఁడు సరయూ జలంబులఁ జొచ్చెను. వాని వెంట భరతాదులు నట్లె గావించిరి. పుష్పవృష్టి గురిసెను; గంధర్వగానంబు లుప్పతిల్లెను; అట్లు శ్రీరామమహాప్రస్థానికము సంపూర్ణమయ్యెను.

ఆదిదేవుఁడైన యా రామచంద్రుని
కబ్ధిఁ గట్టు టెంత? యసురకోటిఁ
జంపు టెంత? కపుల సాహాయ్య మది యెంత?
సురలకొఱకుఁ గ్రీడ సూపెఁ గాక. 101

ఆది + దేవుఁడు + ఐన = మొదటి దేవుఁడైన, ఆ రామచంద్రునికిన్, సురలకొఱకున్ = దేవతులకై, క్రీడన్ = వినోదము, చూపెన్ + కాక = చూపెనుగానీ, అబ్ధి = సముద్రము, కట్టుట, ఎంత = ఏమాత్రము, అసుర + కోటిన్ = రాక్షస సమూహములను, చంపుట, ఎంత, కపుల + సాహాయ్యము = వానరులు చేసిన సాయము, అది, ఎంత.

తా. దేవతలకై వినోదము చూపెనుగానీ యాదిదేవుఁడైన శ్రీరామచంద్రుఁడు సముద్రమును దాఁటుట యెంత?

రాక్షసులఁ దెగటార్చుట యెంత? ఆ ప్రభువునకుఁ గోఁతుల సాయ మొక లెక్కయా?

వశుఁడుగ మ్రొక్కెదఁ లవణ
వార్ధివిజృంభణతానివర్తికిఁ
దశదిగధీశమాళిమణి
దర్పణమండితదివ్యకీర్తికిఁ
దశశతభానుమూర్తికి సు
ధారుచిభాషికి సాధుపోషికిఁ
దశరథరాజుపట్టికిని
దైత్యపతిం బొరిగొన్న జెట్టికిఁ. 102

టీ. వశుఁడుగఁ=(భగవంతునికి) స్వాధీనమైనవాఁడుగా, లవణ+వార్ధి=ఉప్పుసముద్రముయొక్క, విజృంభణతా=చెలరేఁగఁబడుటను, నివర్తికిఁ=మరలఁజేసిన వానికి (అనఁగా సముద్రుని గర్వ మడంచిన వాఁడును), దశ...కీర్తికిఁ, దశ+దిక్=పది దిక్కులందలి, అధీశ+మౌళి=రాజుల కిరీటములయొక్క, మణి+దర్పణ=అద్దములవంటి మణులతోఁ, మండిత=ప్రకాశించు, దివ్య+కీర్తికిఁ=దివ్యమైన యశస్సుగలవాఁడును, దశ+శత+భాను+మూర్తికిఁ=వేయి సూర్యులకాంతిగల శరీరము గలవాఁడును, సుధా+రుచి+భాషికిఁ=అమృతమువలె రుచిగల మాటలు పల్కువాఁడును, సాధుపోషికిఁ=సజ్జనులఁ బోషించువాఁడును, దశరథరాజు పట్టికిని=దశరథమహారాజు పుత్త్రుఁడును, దైత్యపతిఁ=దనుజరాజును, (రావణాసురుని), పొరిఁగొన్న=చంపినట్టి, జెట్టికిఁ=యోధుఁడును (అగు శ్రీరామునకు), మ్రొక్కెదఁ=నమస్కరించెదను.

తా. లవణపారావారమును సేతువుచే బంధించి దాఁటినవాఁడును, దిక్పతుల కిరీటమణిదర్పణములలోఁ బ్రతిఫలించుచు దింగతములకు వ్యాపించిన యశస్సుచే వెలుఁ

గొందువాఁడును, సూర్యుని వెలుఁగునంటి తేజస్సుగలవాఁడును, సుధామధురమైన వాగ్విన్యాసము కలవాఁడును, సాధుజనరక్షకుఁడును, దుష్టరాక్షససంహారణుఁడును, దశరథాత్మజుఁడు నగు రామచంద్రునకు భక్తివివశుఁడనై మ్రొక్కెదను.

నల్లనివాఁడు పద్మనయ
నంబులవాఁడు మహాశుగంబులన్
విల్లును దాల్చువాఁడు గడు
విప్పగువక్షమువాఁడు మేలు పైఁ
జల్లెడువాఁడు నిక్కిన భు
జంబులవాఁడు యశంబు దిక్కులం
జల్లెడువాఁడునైన రఘు
సత్తముఁ డిచ్చుత మాకభీష్టముల్. 103

టీ. నల్లనివాఁడు, పద్మ+నయనంబులవాఁడు = కమలములవంటి కన్నులు గలవాఁడు, మహా+ఆశుగంబులన్=గొప్ప బాణములు, విల్లును, తాల్చువాఁడు, కడున్+విప్పు+అగు=మిక్కిలి విశాలమైన, వక్షము+వాఁడు=ఉరము గలవాఁడు, మేలు=శుభము, పైన్+చల్లెడువాఁడు, నిక్కిన = ఉన్నతిగన్న, భుజంబులవాఁడు = బాహువులు గలవాఁడు, యశంబు = కీర్తి, దిక్కులన్, చల్లెడువాఁడు, ఐన, రఘుసత్తముఁడు, మాకు, అభీష్టముల్ = కోరికలు, ఇచ్చుతన్ = ఇచ్చునుగాక!

తా. తొలకరిమబ్బువంటి మైచాయగలవాఁడును, తమ్మిపూవులవంటి కనుఁగవ కలవాఁడును, పెద్ద విల్లునమ్ములుఁ దాల్చువాఁడును, వెడఁదయైన యెడఁదగలవాఁడును, ఎల్లరకు మేలు సేయువాఁడును, నిక్కు భుజములతో నొప్పువాఁడును,

దెసలంట యసమును బఱపినవాఁడును అగు శ్రీరామచంద్రుఁడు మా కోర్కెల నెఱవేర్చును గాక!

రామచంద్రుఁగూడి రాకలఁ బోకలఁ
గదిసి తిరుగువారుఁ గన్నవారు
నంటికొన్నవారు నా కోసలప్రజ
లరిగి రాదియోగు లరుగుగతికి. 104

టీ. రామచంద్రుఁన్, కూడి, రాకలన్ = వచ్చుటయందు, కదిసి = చేరి, తిరుగువారున్, కన్నవారున్ = చూచినవారును, అంటికొన్నవారున్ = కలసియున్నవారు, ఐన, కోసలప్రజలు = కోసలదేశమందలి జనులు, ఆది + యోగులు + అరుగుగతికిన్ = పోవుమార్గమునకు, అరిగిరి = పోయిరి. (మోక్షము నొందిరి.)

తా. శ్రీరాముని సహవాసభాగ్యమునఁ గోసల దేశపుఁ బ్రజలెల్లరును మోక్షమార్గము నధిగమించిరి.

మంతనములు సద్గతులకుఁ
బొంతనములు ఘనములైన పుణ్యముల కిదా
నీంతనపూర్వ మహాఘని
కృంతనములు రామనామకృతిచింతనముల్. 105

టీ. రామనామ + కృతి + చింతనముల్ = శ్రీరామచంద్రుని కృతినిఁ గూర్చి పలుమాఱు తలంచుటలు, సద్గతులకున్ + మంతనములు = ఉత్తమ గతికిఁ గొనిపోవు నేకాంతమార్గములు, ఘనములు + ఐన = గొప్పవైన పుణ్యములకున్ = సుకృతములకు, పొంతనములు = మైత్రినిఁగూర్చునవి (పొందించునవి), ఇదానీంతన = ఇప్పటివి, పూర్వ = మునుపటివి అయిన, మహా + అఘ + నికృంతనములు = మహాపాపములను ద్రెంచునవి.

తా. రామనామస్మరణము మహత్తరపుణ్యాసముపార్జనమునకు సాధనము; మోక్షమునకు హేతువు; ఇతఃపూర్వ్గమొనర్చినట్టియు, నిప్పు డొనరించునట్టియు పాతకములను నశింపఁజేయు ప్రభావముగలది.